# ఆర్గాన్ న్యూస్
VOICE OF DEMOCRACY
తెలుగు దినపత్రిక

సంపుటి :17 సంచిక : 232 ఖమ్మం, తెలంగాణ శనివారం 27.09.2025 పేజీలు :12. వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar





'ఆర్గాన్ న్యూస్'

మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహా, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...

సెల్ : 9848 156 178


# బీసీలకు 42% రిజర్వేషన్లు



## రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

**కమిటీ సిఫారసులను ఆమోదించిన ప్రభుత్వం**

**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు**

**ఉన్నతాధికారులతో నేడు ఎన్నికల సంఘం భేటీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 : తెలంగాణలో పల్లె, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు భారీగా రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జి.ఓ నెం.9ను శుక్రవారం విడుదల చేసింది. ఈ రిజర్వేషన్ల ఆధారంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. శనివారం ఉదయం ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్, భద్రతా ఏర్పాట్లపై చర్చించనున్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బుసాని వెంకటేశ్వరరావు కమిటీ సిఫారసుల ను ప్రభుత్వం ఆమోదించింది.

- మిగతా 2వ పేజీలో...



### ఆర్థిక వృద్ధిపై మొండి బకాయిల దెబ్బ

- ఎగవేతదారుల్లో కనిపించని భయం
- సామాన్య ఖాతాదారులే బలిపశువులు

04

పెద్దలు ఎగవేసిన మొత్తాల కారణంగా, సామాన్యులకు గుదిబండగా మారింది. సామాన్యులు ఒక్క రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకర్లు, పెద్దల అప్పులపై నోరు మెదపడం లేదు. మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవ డానికే అన్నట్లుగా బ్యాంకులు ఖాతాదారులపై ఇష్టమొచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నాయి.



# ఫార్మాపై ట్రంప్ దెబ్బ

## మరోమారు ట్రంప్ సుంకాల బాదుడు

**ఫార్మా ఉత్పత్తులపై వందశాతం టాక్స్**

**భారతీయ ఔషధ పరిశ్రమలు లక్ష్యంగా సుంకాలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తూ బాంబు పేల్చారు. బ్రాండెడ్, పేటెంట్ ఉన్న ఔషధ ఉత్పత్తుల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. అమెరికాలో ప్లాంట్‌లను నిర్మిస్తున్న విదేశీ ఔషధ తయారీ సంస్థలకు ఈ సుంకాలు వర్తించవని పేర్కొన్నారు.


04

### స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు శుక్రవారం సమావేశం అయ్యా రు. ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులకు ఇప్పటికే కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు వివరణ ఇచ్చారు. అయితే, ఈ నెల 30వ తేదీ వరకూ కడియం శ్రీహరి గడువు కోరారు. ఈనెల 29 నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యక్ష విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

02

# హైదరాబాద్‌లో కుండపోత



హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. శుక్రవారం కూడా భారీ వర్షం కురుస్తుండటంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం అప్రమత్తమైంది. ట్రాఫిక్ సమస్యలు, ప్రజల భద్రతా దృష్ట్యా వివిధ కంపెనీలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సూచించింది. పరిస్థితిని అర్థం చేసుకొని సహకరిం చాలని కోరింది.

## తడిసి ముద్దయిన నగరం

**ఇబ్బందులు పడ్డ నగర వాసులు**

**పటాన్‌చెరు వద్ద హైవేపై నిలిచిన ట్రాఫిక్**

**కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 : ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. మరోవైపు హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఛత్రినాక, తార్నాక, హబ్సిగూడ, నాచారం, కూకట్‌పల్లి, జేఎన్టీ యూ, నిజాంపేట్, ప్రగతినగర్, ఆల్విన్ కాలనీ, చార్మినార్, యూకత్‌పురా, ఓయూ క్యాంపస్, హైదర్‌నగర్, బాచుపల్లి, వివేకానంద నగర్, చార్మినార్, చాంద్రయణగుట్ట, బహదూర్‌పురా, లాలాపేట్, మల్లాపూర్, ఉప్పుగూడ, బార్కస్, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది.

- మిగతా 2వ పేజీలో..



## నూతన డిజిపిగా శివధర్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్26: తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు శివధర్ రెడ్డి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ఇంటలిజెన్స్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. శివధర్ రెడ్డిని నియమిస్తూ ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.

- మిగతా 2వ పేజీలో..

### జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా

# మాగంటి సునీత

**అధికారికంగా ప్రకటించిన బీఆర్ఎస్**

**కేసీఆర్‌కు రుణపడి ఉంటా : గోపీనాథ్ సతీమణి**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని భారత రాష్ట్ర సమితి ప్రకటించింది. ఇటీవల మృతిచెందిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు టికెట్ కేటాయించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. దీంతో అభ్యర్థి పేరును పార్టీ వెల్లడించింది. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూ శారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది.

- మిగతా 3వ పేజీలో..



### జూబ్లీహిల్స్‌పై కేసీఆర్ సమాలోచనలు

సీనియర్ నేతలతో తాజా పరిస్థితులపై సమీక్ష

03



# కోల్ ఇండియా కార్మికులకు లక్ష

## కార్మికులకు పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్

- ప్రీమియం లేకుండా బీమా కవరేజ్
- ఎక్స్‌గ్రేషియా రూ. 25 లక్షలకు పెంపు
- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న కీలక పరిశ్రమల వృద్ధి వేగం పుంజుకుంది. గత కొన్ని నెలలుగా, బొగ్గు రంగం ఉత్పత్తి, సామర్థ్యంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. అంతేకాకుండా, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటోంది.





### అమెరికా విశ్వవిద్యాలయాలకూ హెచ్-1బీ కష్టాలు

వాచ్-1బీ వీసా ఫీజును ట్రంప్ సర్కారు భారీగా పెంచడంతో అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకూ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే ప్రభుత్వం నుంచి వచ్చే పరిశోధనల నిధులకు కోతపడటంతో ఇబ్బంది పడుతున్న ఈ విద్యా సంస్థలు తాజా నిర్ణయం మోయలేని ఆర్థిక భారమైంది. అమెరికాలో సాఫ్ట్‌వేర్, ఆర్థిక సేవల కంపెనీలే కాదు.. మెడికల్ స్కూల్స్, స్టేట్ యూనివర్శిటీలు, ఐవీ లీగ్ స్కూల్స్ ఈ రకం వీసాలపై ఆధారపడుతున్నాయి.

10



03

### మహిళలతో పెట్టుకుంటే అంతే సంగతులు

- కేటీఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క
- రవీంద్రభారతిలో బతుకమ్మ ఉత్సవాలకు హాజరు



### ఓజి సినిమా టిక్కెట్ ధరల పెంపు వీల్లేదు

సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించిన హైకోర్టు

03

# బీసీలకు 42% జిఓ

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే ఆధారంగా 42% రిజర్వేషన్లు నిర్ణయించబడ్డాయి. ఆర్టికల్స్ 40, 243%ణ, 243ు%తో పాటు డైరెక్టివ్ ప్రిన్సిపిల్స్ ప్రకారం ఈ రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే అసెంబ్లీలో ఈ బిల్లకు ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం అమలులోకి రాబోయే ఈ రిజర్వేషన్లతో తెలంగాణ దేశంలోనే తొలిసారి బీసీలకు పల్లె, పట్టణ స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రంగా నిలిచింది. ఈ నిర్ణయంతో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం గణనీయంగా పెరగనుంది. రాబోయే ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో బీసీ వర్గాల ప్రాధాన్యం మరింత బలపడనుంది. అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మార్చి 18, 2025న BC కోటాను 42%కు పెంచే బిల్లులు ఆమోదించారు. ఆగస్టు 31న మరో రెండు బిల్లులు ఆమోదించి, SC, ST, BCలకు 50% మించి రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. కానీ అవి పెండింగ్ లో ఉన్నాయి. డెడికేటెడ్ BC కమిషన్ నివేదిక, కుల సర్వే ఆధారంగా 42 BC కోటా నిర్ణయించారు. ఈ కోటాలో మహిళలకు 50% సబ్‌కోటా కూడా ఉంటుంది. జిల్లా కలెక్టర్లు రిజర్వేషన్ మ్యాట్రిక్స్‌ను సీల్డ్ కవర్లలో పంచాయతీ రాజ్ విభాగానికి సమర్పించారు. ఈ మ్యాట్రిక్స్ ప్రకారం, గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు, జిల్లా పరిషత్తులలో కోటాలు నిర్ణయిస్తారు. జీవో విడుదలైనందున వెంటనే పంచాయతీ రాజ్ విభాగం కు సిఫార్సు చేస్తుంది. ఒకటి లేదా రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తుంది. ఎన్నికలు దశలవారీగా జరుగుతాయి. మొదటి దశలో జిల్లా పరిషత్తులు చైర్మన్‌లు (31), జెడ్పీటీసీలు లు (566), ఎంపీపీ ప్రెసిడెంట్లు (566), ఎంపిటీసీలు(5,773) ఎన్నికలు. రెండో దశలో గ్రామ పంచాయతీలు (13,000ం) జరుగుతాయి. అయితే ఈ జీవో చెల్లుబాటుపై సందేహాలు ఉన్నాయి. సెప్టెంబర్ 24న తెలంగాణ హైకోర్టు, 42% బీసీ కోటాపై పిటిషన్‌ను తిరస్కరించింది. "జీవోజారీ కాలేదు, తొందరపడి పిటిషన్ వేశారు." అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఇప్పుడు జీవో జారీ అయినందుకు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందని కోర్టులో పిటిషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

# కోల్ ఇండియా కార్మికులకు లక్ష

- కార్మికులకు పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్
- ప్రీమియం లేకుండా బీమా కవరేజ్
- ఎక్స్‌గ్రేషియా రూ. 25 లక్షలకు పెంపు
- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న కీలక పరిశ్రమల వృద్ధి వేగం పుంజుకుంది. గత కొన్ని నెలలుగా, బొగ్గు రంగం ఉత్పత్తి, సామర్థ్యంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. అంతేకాకుండా, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే బొగ్గు పరిశ్రమలోని ప్రతి సభ్యుని సంక్షేమం ప్రధాన ప్రాధాన్యతగా ఉండేలా చూసుకోవడానికి అవిశ్రాంతంగా కృషి చేసింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దార్శనిక మార్గదర్శకత్వంలో కీలక మైలురాళ్లను సాధించామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.ప్రతి కార్మికుడి సహకారాన్ని గౌరవించాలని కేంద్ర ప్రభుత్వ నిబద్ధతతో ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇందుకు అనుగుణంగా, కోల్ ఇండియా లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలు, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లోని కార్మికులకు పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ ఆమోదించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ప్రతి కార్మికుడు వారి అంకితభావం, అవిశ్రాంత కృషికి బహుమతిగా రూ.1,03,000 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు బీమా కవర్ రూ. 1 కోటి వరకు గణనీయంగా పెంపు. ఇది కుటుంబాలకు బలమైన ఆర్థిక భద్రతను అందిస్తుంది. ఉద్యోగులు ఎటువంటి బీమా ప్రీమియం చెల్లించాల్సిన పని లేదు.మొదటిసారిగా, శాశ్వత ఉద్యోగులు కాని వారికి బీమా కవర్ ప్రవేశ పెట్టడం జరిగింది. ఇది సమగ్ర సంక్షేమం వైపు ఒక సమగ్ర అడుగును సూచిస్తుంది. ఉద్యోగులు ఎటువంటి బీమా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు.కోల్ ఇండియా లిమిటెడ్ , దాని అనుబంధ సంస్థలలో, కార్మికుడి వరకు, సమానత్వం, ఐక్యత, కోల్ పరివార్ ఒక గుర్తింపును సూచిస్తూ యూనిఫాం డ్రెస్ కోడ్ పరిచయం. ఎక్స్-గ్రేషియా పరిహారాన్ని రూ. 15 లక్షల నుండి రూ. 25 లక్షలకు పెంచారు. ఇది కష్ట సమయాల్లో కుటుంబాలను ఆదుకోవాలనే నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. పండుగ సీజన్ ప్రారంభంలో వస్తున్న ఈ ప్రకటన, ప్రతి కార్మికుడి గౌరవం, సంక్షేమంతో అభివృద్ధి ముడిపడి ఉందన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. ఇది కేవలం ఆర్థిక బహుమతి మాత్రమే కాదు, దేశానికి ఇంధనంగా నిలిచే బొగ్గు పరివార్‌కు గుర్తింపు, కృతజ్ఞత, సాధికారత సందేశమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వం, విధానాలలో ప్రజలను హృదయంలో ఉంచడానికి మార్గనిర్దేశం చేసింది. పనితీరులో దృఢంగా ఉండటమే కాకుండా కరుణ స్ఫూర్తితో కూడిన రంగాన్ని నిర్మించడానికి మోదీ దిశానిర్దేశం స్ఫూర్తినిస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. భారతదేశ బలం దాని కార్మికుల ఐక్యత, దాని దృక్పథంలోని స్పష్టతలో ఉందని బొగ్గు పరివార్ కలిసి నిరూపించింది. మన సోదరభావంలోని ప్రతి సభ్యునికి కొత్త ప్రమాణాలను నిర్దేశించడానికి, బలమైన, సురక్షితమైన భవిష్యత్తును నిర్మించడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారుప్రధాని మోదీ చెప్పినట్లుగా, "సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే మంత్రం ద్వారా మార్గనిర్దేశం చేసిన భారతదేశం ఇప్పుడు ప్రపంచాన్ని నెమ్మదిగా వృద్ధి పట్టు నుండి విముక్తి పొందేలా సహాయపడే స్థితిలో ఉంది." ఈ మాటలు బొగ్గు రంగం పురోగతి, సంక్షేమం రెండింటికీ మూలస్తంభంగా ఉండేలా చూసుకుంటూ, నూతన దృఢ సంకల్పంతో ముందుకు సాగడానికి మనకు స్ఫూర్తినిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

- నేడు శిల్పారామంలో టూరిజం కాంక్లేవ్
- హాజరుకానున్న సిఎం రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** పర్యాటక రంగం అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా శిల్పారామంలో టూరిజం కాంక్లేవ్ శనివారం జరుగనుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. టూరిజం కాంక్లేవ్ ద్వారా పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 50 వేల ఉద్యోగాలు రానున్నాయి. హుస్సేన్ సాగర్‌లో డబుల్ డెక్కర్ బోట్‌ను 'ముచుకుందా' పేరుతో నేడు ప్రారంభించనుంది. అలాగే, తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, రిసార్టులు, ఫైవ్‌స్టార్ హోటళ్ల ఏర్పాటు- చేయనుంది. అలాగే, ఫిల్మ్ ఇన్ తెలంగాణ పోర్టల్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించనుంది. సినిమా షూటింగ్స్‌కు తెలంగాణ ప్రభుత్వం సింగిల్ విండో అనుమతులు ఇవ్వనుంది. మెడికల్ వాల్యూ టూరిజం పోర్టల్ ప్రారంభించనుంది. ప్రపంచం నలుమూలాల నుంచి పేషెంట్లకు సౌకర్యం కల్పించనుంది. తెలంగాణలో హెలికాప్టర్ టూరిజం ప్రారంభించనుంది. సోమశిల - శ్రీశైలం రూట్‌లో తొలి సర్వీసులు కల్పించనుంది. వీటితో పాటు- సీప్లేన్ టూరిజం కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. టూరిజం పోలీస్ ఫోర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. టూరిజం పోలీస్ ఫోర్స్‌లో 15 మంది నుంచి 90 మందికి పెంచనుంది. ఇందుకోసం ఐఆర్‌సీటీసీ, ట్రావెల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. అలాగే, డిజిటల్ టూరిజం కార్డును కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది.

# నాటో చీఫ్ వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తం

- నాటో లాంటి సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలి
- నిరాధార, ఊహజనిత వ్యాఖ్యలు ఆమోదనీయం కాదు
- నాటో చీఫ్ వ్యాఖ్యలకు భారత విదేశాంగ శాఖ కౌంటర్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుటె వ్యాఖ్యలకు భారత్? స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో ఏవిధంగా ముందుకువెళ్తున్నారనే అంశం గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను భారత ప్రధాని మోదీ ఆరా తీసినట్లు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని భారత విదేశాంగ శాఖ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో ఎలాంటి చర్చలు జరగలేదని, భవిష్యత్తులో ఇలాంటివి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది.ఉక్రెయిన్ యుద్ధంపై భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుకున్నట్లు నాటో చీఫ్ మార్క్ రుటే చేసిన వ్యాఖ్యలు చూశాం. అవన్నీ కూడా పూర్తిగా అవాస్తం, నిరాధారమైనవి. ఏ సమయంలో కూడా ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఈ విషయంపై మాట్లాడలేదు. అసలు ఇలాంటి చర్చలే జరగలేదు. నాటో లాంటి కీలక సంస్థల నాయకులు బహిరంగంగా మాట్లాడేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రధాని మోదీపై నిరాధార, ఊహజనిత వ్యాఖ్యలు చేయడం ఆమోదనీయం కాదు. ఇంతకుముందు చెప్పినట్లుగానే భారతీయ వినియోగదారులకు తక్కువ ధరకు అందేలా ఇంధన దిగుమతులు చేసుకుంటాం. భారత జాతీయ ప్రయోజనాలు, ఆర్థిక భద్రతను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు ఉక్రెయిన్ యుద్ధంపై నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుటె కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన ఆయన, ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో ఏవిధంగా ముందుకువెళ్తున్నారనే అంశం గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను భారత ప్రధాని మోదీ ఆరా తీసినట్లు చెప్పారు. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్‌పై సుంకాల భారం పడటంతో పుతిన్ భవిష్యత్ వ్యూహాల గురించి అడిగి తెలుసుకున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. "భారత్‌పై అమెరికా విధిస్తోన్న సుంకాలు రష్యాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్ సుంకాలతో ఇబ్బందులు పడుతోంది. దీంతో పుతిన్‌కు భారత్? నుంచి ఫోన్ వెళ్లింది. ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో ఏవిధంగా ముందుకు వెళ్లనున్నారనే దానిపై పుతిన్‌ను నరేంద్ర మోదీ ఆరా తీశారు" అని రుటే అన్నారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై మొదటగా 25శాతం సుంకాలు విధించింది అమెరికా. ఆ తర్వాత వాటిపై మరో 25శాతం పెనాల్టీ విధించి మొత్తం 50శాతానికి చేసింది. ఇలా కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్, చైనాలు నిధులు సమకూరుస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శిస్తున్నారు. రష్యా కూడా యుద్ధాన్ని ముగించడానికి సిద్ధంగా లేదని, ఈ రక్తపాతాన్ని ఆపేందుకు మరిన్ని శక్తివంతమైన సుంకాలను విధించడానికి సిద్ధమవుతున్నానని తెలిపారు. నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం షాక్‌కు గురిచేస్తుందని ట్రంప్? ఇప్పటికే పలుమార్లు అసహనం వ్యక్తంచేశారు. అయితే, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్ చర్చలు జరుపుతూనే ఉంది.

## అరెస్టుకు భయపడేది లేదు : కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్ట్రాంరగ్ కౌంటర్ ఇచ్చారు.శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. తన అరెస్టుపై కాంగ్రెస్ నేతలు కలలు కంటున్నారని కేటీఆర్ విమర్శించారు. తన అరెస్టు కోసం కాంగ్రెస్ నేతలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అరెస్టు చేసుకోండి... అరెస్టు భయం తనకు లేదని స్పష్టం చేశారు. . తన అరెస్టుతో సీఎం రేవంత్‌రెడ్డికి పైశాచిక ఆనందం తప్ప మరొకటి రాదని కేటీఆర్ మండిపడ్డారు. తాను ఏ తప్పు చేయలేదని... ఏం చేసుకుంటారో చేసుకోవాలని సవాల్ విసిరారు. తనతో రేవంత్‌రెడ్డి లై డిటెక్టర్ టెస్ట్‌కు రావాలని ఛాలెంజ్ చేశారు కేటీఆర్. ఏసీబీ కేసు తనపై ఉందని... రేవంత్‌రెడ్డిపైనా ఏసీబీ కేసుందని గుర్తుచేశారు. ఆర్ఎస్ బ్రదర్స్‌కు ప్రజా సమస్యలు పట్టవని విమర్శించారు. ఆర్ఎస్ బ్రదర్స్‌కు తాను ఏ కారులో తిరుగుతున్నానో మాత్రమే కావాలని ఎద్దేవా చేశారు.

## దళారులను ఆశ్రయించొద్దు

**: రవాణాశాఖ**

**హైదరాబాద్:** అదనపు భద్రతా చర్యలు తీసుకున్న కారణంగానే స్లాట్ బుకింగ్‌లో అధిక సమయం పడుతోందని రవాణాశాఖ తెలిపింది. ఫలితంగానే గతంలో కంటే ఎక్కువ సమయం పడుతోందనీ.. దళారులను ఆశ్రయించకుండా 'సారథి' పోర్టల్ ద్వారానే సేవలు పొందాలని ప్రజలను కోరింది. 'సులభతరం అనుకుంటే చుక్కలు చూపిస్తోంది' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి రవాణాశాఖ స్పందించి వివరణ ఇచ్చింది. 'డ్రైవింగ్ లైసెన్స్, లెర్నర్ లైసెన్స్ స్లాట్ బుకింగ్, టెస్ట్ ప్రక్రియలో భద్రతా చర్యల్లో భాగంగా ఓటీపీ, క్యాప్చాను ప్రవేశపెట్టారు. ప్రతి దశలో ఓటీపీ, క్యాప్చా తప్పనిసరిగా ఇవ్వాలి. ప్రజలు దయచేసి ఏజెంట్లకు డబ్బులు ఇవ్వొద్దు' అని కోరింది. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

## ముగిసిన ఆర్డీవో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

**హైదరాబాద్:** రెవెన్యూ విభాగంలో డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. ఈ సందర్భంగా వారితో డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలు తెలపడంతో పాటు రెవెన్యూ విభాగం పరిపాలనలో ఎంతో కీలకమైనదని, సమాజానికి సేవ చేసేందుకు అవకాశం కొత్తగా ఎంపికైన ఆర్డీవోలకు లభించిందని తెలిపారు.



# డీజీపీగా శివధర్‌రెడ్డి

## రెండుసార్లు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అనుభవం
## అక్టోబరు 1న బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్:** తెలంగాణ డీజీపీగా బత్తుల శివధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ స్థానానికి పలువురు ఐపీఎస్ ఉన్నతాధికారుల పేర్లు వినిపించినా ప్రస్తుత ఇంటెలిజెన్స్ చీఫ్ వైపే ప్రభుత్వం మొగ్గుచూపింది. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్‌రెడ్డిని డీజీపీ(సమన్వయం)గా నియమిస్తూ తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు హెడ్ ఆఫ్ ది పోలీస్ ఫోర్స్(హెచ్‌వోపీఎఫ్)గా పూర్తి అదనపు బాధ్యతల్ని అప్పగించింది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబరు 1న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం డీజీపీగా కొనసాగుతున్న డా.జితేందర్ ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ పొందనున్నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తనను డీజీపీగా నియమించినందుకు శివధర్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డినికలిసి కృతజ్ఞతలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్(పెద్దతూండ్ల) గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన శివధర్‌రెడ్డి విద్యాభ్యాసం హైదరాబాద్‌లోనే సాగింది. ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్‌బీ చదివిన అనంతరం కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు.సివిల్స్ రాసి 1994 బ్యాచ్ ఐపీఎస్‌గా అఖిలభారత సర్వీసుల్లోకి అడుగుపెట్టారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరంగా కీలకమైన సౌత్‌జోన్ డీసీపీగా విధులు నిర్వర్తించారు. 2007లో మక్కామసీదు బాంబు పేలుళ్లతోపాటు ఆ సమయంలో జరిగిన అల్లర్ల నియంత్రణ క్రమంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో 14 మంది మరణించిన అనంతరం అప్పటి ప్రభుత్వం ఆయన్ని అక్కడ నియమించింది. 2003లో ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక దళంలో భాగంగా కొసావోలో విధులు నిర్వర్తించారు. డీఐజీగా పదోన్నతి పొందిన అనంతరం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) చీఫ్‌గా నియమితులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏసీబీలో అదనపు డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన అక్కడే ఐజీ హోదాలో డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ సమయంలో వైజాగ్ కమిషనర్‌గా ఉన్న ఆయన్ను అప్పటి సీఎం కేసీఆర్ తెలంగాణ తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించారు. ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్నపుడు నయీంను ఎన్‌కౌంటర్‌లో పోలీసులు హతమార్చారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం మరోసారి ఆయన్ని ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించారు. అక్కడ ఉండగానే గతేడాది ఆగస్టులో ఆయన డీజీపీగా పదోన్నతి పొందారు. ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో ఆయన పనితీరుకు శౌర్యపతకం, ఐపీఎం, పీపీఎం పురస్కారాలు లభించాయి.

# 5లోగా ఫిరాయింపులపై విచారణ

- 6 నుంచి 23 వరకూ సభాపతి విదేశీ పర్యటన
- న్యాయవాదులను సమకూర్చుకోవాలని ఇరుపక్షాలకు లేఖలు
- స్పీకర్ సమక్షంలో వాదనలకు సిద్ధమవుతున్న ఎమ్మెల్యేలు



**హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై తమ వివరణలను అఫిడవిట్ రూపంలో ఇప్పటికే అందజేసిన 8 మంది ఎమ్మెల్యేలు.. వారిపై ఫిర్యాదు చేసిన భారాస ఎమ్మెల్యేల అభ్యంతరాలు, ఆధారాలపై వచ్చే నెల 5 లోగా విచారణ ముగించాలని శాసన సభాపతి సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ వచ్చే నెల 6 నుంచి 12 వరకూ బ్రిడ్జిటౌన్, బార్బడోస్‌లో జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్సులో పాల్గొననున్నారు. దీనికి కొనసాగింపుగా యూకే, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో వచ్చే నెల 12 నుంచి 23 వరకూ స్టడీ టూర్‌లో కొనసాగనున్నారు. ఇవన్నీ ముందస్తుగా కుదుర్చుకున్న కార్యక్రమాల దృష్ట్యా.. ఆ లోగానే విచారణ ముగించాలనే నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. ఈ మేరకు ఇరుపక్షాలకు శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు లేఖలు పంపించారు. "శాసన సభాపతి ముందస్తుగా నిర్ణయించిన విదేశీ పర్యటనల దృష్ట్యా వచ్చే నెల 5లోగా విచారణ ముగించేలా సహకరించండి. మీ తరఫున వాదనలు వినిపించేందుకు అడ్వొకేట్‌ను నియమించుకొని వారి వివరాలను 26లోగా తెలియపర్చండి. విచారణ తేదీలను ఖరారు చేస్తాం" అని శాసనసభ కార్యదర్శి తన లేఖలో ఎమ్మెల్యేలను కోరారు. దీంతో ఇరుపక్షాలు శుక్రవారం తమ న్యాయవాదుల వివరాలు సమర్పించాయి.

### 29న తొలివిడత విచారణ ప్రారంభించే అవకాశం

పార్టీ ఫిరాయింపులపై తమపై వచ్చిన ఫిర్యాదులకు ఆయా ఎమ్మెల్యేలు ఇప్పటికే అసెంబ్లీ కార్యదర్శికి తమ వివరణలను అఫిడవిట్ రూపంలో అందజేశారు. వారిపై ఫిర్యాదు చేసిన భారాస ఎమ్మెల్యేలు తాము కూడా ఆ ఎమ్మెల్యేలిచ్చిన వివరణలపై అభ్యంతరాలను న్యాయ సమీక్షకు అనుగుణంగా స్పీకర్ కార్యాలయంలో అందించారు. 3 నెలల్లోగా పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనల గడువు వచ్చే నెల 30తో ముగియనుంది. అయితే వచ్చే నెలలో 6 నుంచి 23 వరకూ స్పీకర్ విదేశీ పర్యటనలో ఉంటుండడంతో.. ఆలోగా విచారణ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు పార్టీ ఫిరాయింపు నోటీసులు ఇవ్వగా.. ఇందులో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది తమ వివరణలను అందజేశారు. ఇరుపక్షాల వివరణలు, అభ్యంతరాలు న్యాయసమీక్షకు అనుగుణంగా స్పీకర్ కార్యాలయానికి చేరడంతో విచారణకు శాసనసభాపతి కార్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 29 నుంచే స్పీకర్ సమక్షంలో విచారణ ప్రారంభించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సోమ, మంగళ, బుధవారాల్లో తొలివిడత.. తిరిగి వచ్చే 3, 4, 5 తేదీల్లో మలిదశ విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఇరుపక్షాల వాదనల అనంతరం.. తన నిర్ణయాన్ని సభాపతి అక్టోబరు 30లోగా సుప్రీంకోర్టుకు నివేదించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# డిజిటల్ అరెస్టు కేసు ఛేదన

### కర్ణాటకకు చెందిన అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్టు



**బాపట్ల :** బాపట్ల జిల్లా చీరాలలో విశ్రాంత వైద్యుడిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.1.10 కోట్ల నగదు స్వాహా చేసిన కేసులో కర్ణాటకకు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. బాపట్లలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన కేసు వివరాలు వెల్లడించారు. "కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. వారు విశ్రాంత వైద్యుడికి ఫోన్ చేసి మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని, డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు బెదిరించారు. వైద్యుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.1.10 కోట్లు తమ ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చీరాల పోలీస్‌స్టేషన్లో ఈ నెల 19న కేసు నమోదైంది. దీనిపై సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసు బృందం కర్ణాటకకు వెళ్లింది. బ్యాంకు లావాదేవీల విశ్లేషణ, కాల్‌డేటా వివరాల రికార్డు, సెల్‌ఫోన్ టవర్ సిగ్నళ్ల ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్టు చేసింది. ఎన్సీఆర్‌పీ పోర్టల్‌లో పరిశీలించగా నిందితులు 8 రాష్ట్రాల్లో రూ.14 కోట్ల విలువైన సైబర్ మోసాలకు పాల్పడినట్లు గుర్తించాం. వారి ఖాతాలకు సంబంధించి రూ.55 లక్షల విలువైన లావాదేవీలను స్తంభింపజేశాం. రూ.రెండున్నర లక్షలు రికవరీ చేశాం" అని వెల్లడించారు. కేసు ఛేదనలో కృషి చేసిన పోలీసు బృందాన్ని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

# త్వరలోనే గాజాపై ఒప్పందం : ట్రంప్

**న్యూయార్క్ :** గాజా యుద్ధాన్ని త్వరలోనే ముగించి, బందీలను తిరిగి వెనక్కి తీసుకువస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఒప్పందం త్వరలోనే పూర్తి కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యూయార్క్‌లోని రైడర్ కప్ గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు బయలుదేరే ముందు వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. అయితే, ఒప్పందం పూర్తి వివరాలు మాత్రం వెల్లడించలేదు. "గాజాపై ఒప్పందం కుదిరేలా కనిపిస్తోంది. బందీలను తిరిగి తీసుకువచ్చే ఒప్పందం అది. ఇది యుద్ధాన్ని ముగించే ఒప్పందం అవుతుంది" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఐరాస సమావేశాలు జరుగుతున్న వేళ.. పశ్చిమాసియాలో శాంతిస్థాపన కోసం అమెరికా 21-పాయింట్లతో ఓ ప్రతిపాదిత ప్రణాళిక రూపొందించింది. దీన్ని సౌదీ అరేబియా, యూఏఈ, ఖతర్, ఈజిప్టు, జోర్డాన్, తుర్కియే, ఇండోనేసియా, పాకిస్థాన్ దేశాల అధికారులకు పంపించినట్లు అమెరికా వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే గాజా ఒప్పందంపై ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ఐరాసలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రసంగిస్తూ.. హమాస్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ తప్పకుండా పూర్తి చేస్తామన్నారు. ఇటీవల పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించడంపై అసంతృప్తి వ్యక్తం చేశార. పాశ్చాత్య నేతలు ఒత్తిడికి గురై ఉండవచ్చేమో కానీ, ఇజ్రాయెల్ మాత్రం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు.

# హైదరాబాద్‌లో కుండపోత

- తడిసి ముద్దయిన నగరం
- ఇబ్బందులు పడ్డ నగర వాసులు
- పటాన్‌చెరు వద్ద హైవేపై నిలిచిన ట్రాఫిక్
- కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. శుక్రవారం కూడా భారీ వర్షం కురుస్తుండటంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం అప్రమత్తమైంది. ట్రాఫిక్ సమస్యలు, ప్రజల భద్రతా దృష్ట్యా వివిధ కంపెనీలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సూచించింది. పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మరోవైపు హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఛత్రినాక, తార్నాక, హబ్సిగూడ, నాచారం, కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్, ప్రగతినగర్, ఆల్విన్ కాలనీ, చార్మినార్, యూకత్‌పురా, ఓయూ క్యాంపస్, హైదర్‌నగర్, బాచుపల్లి, వివేకానంద నగర్, చార్మినార్, చాంద్రయణగుట్ట, బహదూర్‌పురా, లాలాపేట్, మల్లాపూర్, ఉప్పుగూడ, బార్కస్, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మియాపూర్ మంజీరా పైపులైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మైహోం మంగళ మార్గంలో రైల్వే అండర్ పాస్‌లోకి వరదనీరు చేరింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మియాపూర్ మంజీరా పైపు లైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మై హోం మంగళ మార్గంలో రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి 65వ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్ వద్ద నుంచి రుద్రారం వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంగారెడ్డి నుంచి ఇస్నాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరద నీటిలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. దీంతో కార్యాలయాలకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

## భారీ వర్షాలపై సీఎం రేవంత్ సమీక్ష

### అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ మహానగరం తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని లోతట్టు- ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తం గా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ క్రమంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకు ఒడా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. అలాగే నీరు నిలిచే ప్రాంతా లను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. ఆ దిశగా సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలంటూ సీఎస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. అందులోభాగం ఉద్యోగులకు ఈ రోజు.. అంటే శుక్రవారం సాఫ్ట్‌వేరు నిపుణులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలంటూ ఐటీ- కంపెనీలను ఇప్పటికే సూచించింది. అలాగే వివిధ ప్రాంతాల్లోని రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ బృందాలు రంగలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

## భారీ వర్షాల ప్రభావం

### పలు విమానాల దారి మళ్లింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** తెలంగాణతో పాటు- హైదరాబాద్ నగరంలో కూడా వర్షాలు దంచి కొడుతున్నాయి. భారీ వానల కారణంగా పలు విమానాలను దారి మళ్లిస్తున్నట్లు- శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కోల్‌కతా - హైదరాబాద్ ముంబై - హైదరాబాద్, పూణే నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మూడు ఇండిగో విమానాలను విజయవాడకు దారి మళ్లించినట్లు- అధికారులు తెలిపారు. భారీ వర్షాల ప్రభావం ఇలాగే ఉంటే.. ఇంకా మరికొన్ని విమానాలను కూడా దారి మళ్లించే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే వానల కారణంగా విమాన రాకపోకలకు కూడా ఆలస్యం అవుతోందని చెప్పుకొచ్చారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందికి గురవుతున్నారు. విమానాల రాకపోకలకు ఆలస్యం, మళ్లింపు విషయాన్ని ప్రయాణికులు గమనించాలని శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు సూచించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

### బిఆర్ఎస్ అభ్యర్థిగా గోపీనాథ్ సతీమణి



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని భారత రాష్ట్ర సమితి ప్రకటించింది. ఇటీవల మృతిచెందిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు టికెట్ కేటాయించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. దీంతో అభ్యర్థి పేరును పార్టీ వెల్లడించింది. అనారోగ్య కారణాల తో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో దీనికి సంబంధిం చిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థిగా భారత రాష్ట్ర సమితి ప్రకటించిన అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడారు. తనపై విశ్వాసంతో ఉపఎన్నికకు అభ్యర్థిగా పార్టీ అవకాశం కల్పించిందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తనకు ప్రజల మద్దతు, ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నానని సునీత పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్‌పై కేసీఆర్ సమాలోచనలు

### సీనియర్ నేతలతో తాజా పరిస్థితులపై సమీక్ష

**గజ్వేల్, సెప్టెంబర్ 26 :** త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని, ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకొని విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ-ఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్‌తోపాటు- పలువురు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశర చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి అంశం పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు- అన్ని నివేదికలు చెబుతున్నాయని కేసీఆర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో కిందిస్థాయి కార్యకర్తలను అప్రమత్తం చేసి తద్వారా ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు- తెలిపారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్ని అప్రమత్తం చేయాలని కేసీఆర్ సూచించినట్లు- తెలుస్తోంది.

## కిషన్ రెడ్డి చేసిందేమిటో చర్చకు సిద్ధం

### టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముద్దాయిగా నిరూపించబడ్డారని శిక్ష తప్పదని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఫార్ములా- ఈ కార్ రేసులో కెటిఆర్ తప్పు చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లా డుతూ.. మూసి సుందరీకరణను బిఆర్ఎస్‌తో పాటు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని మండి పడ్డారు. అభివృద్ధి విషయంలో రాజక యాలు చేయొద్దు అని సూచించారు. తెలంగాణకు కిషన్ రెడ్డి తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు. కేంద్రం దగ్గర బిసి బిల్లు ఎందుకు పెండింగ్ లో ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రయత్నిస్తే బిసి బిల్లు ఆమోదం పొందుతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## గాంధీ జయంతి రోజే దసరా

### మందు షాపులు బంద్ అంటూ బోర్డులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండుగ దసరా.. ఈ పర్వదినాన రెండు రాష్ట్రాలప్రజలు ఫుల్ జోష్‌లో ఉంటారు. బంధుమిత్రులందరినీ తమ ఇళ్లకు ఆహ్వానించి సంతోషంగా దసరాను జరుపుకుంటారు. దసరా రోజున ముక్కా, సుక్కతో ఫుల్ ఖుషీ అవుతారు. అయితే, ఈసారి మాత్రం ఆ పరిస్థితి కనిపించేలా లేదు. ఎందుకంటే.. దసరా పండుగ అక్టోబర్ 2వ తేదీన వచ్చింది. అక్టోబర్ 2 గాంధీ జయంతి. దీంతో ఆ రోజున మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధం. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఇప్పటికే చాలా వైన్స్ షాపుల వద్ద దసరా రోజున వైన్ షాప్స్ బంద్ అంటూ ప్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. సోషల్ మీడియాలోనూ ఈ అంశంపై రీల్స్ మీద రీల్స్ చేస్తున్నారు నెటిజన్లు. మరోవైపు.. అసలే దసరా.. అక్టోబర్ 2న మందు బంద్ అనడంతో.. మద్యం ప్రియులు వైన్ షాపుల వద్దకు పరుగెత్తుకెళ్తున్నారు. ముందే స్టాక్ తీసుకెళ్తున్నారు.

## బీర్ల ఐలయ్యవి పార్టీ వ్యతిరేక చర్యలు

### మండిపడ్డ ఎమ్మెల్యే మందుల సామేలు



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 26 :** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీర్ల ఐలయ్య లఫంగి రాజకీయాలు మానుకుని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రాజకీయ వ్యభిచారం చేసుకోవాలన్నారు. భువనగిరిలో మీడియాతో మందుల సామేల్ మాట్లాడారు. మదర్ డైరీ ఎన్నికల్లో తమ జిల్లా నాయకులు కొంతమంది బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నట్లు- ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు, మదర్ డైరీ చైర్మన్ మీకు బంధుత్వం కోసం కాంగ్రెస్ పార్టీని బొందపెట్టవద్దన్నారు. మదర్ డైరీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే నైతికంగా బాధ్యత వహిస్తూ బీర్ల ఐలయ్య తన పదవులకు రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వ విప్‌గా ఉన్న బీర్ల ఐలయ్య కాంగ్రెస్ పార్టీని బొందపెట్టె- ప్రయత్నం చేస్తున్నట్లు- మండిపడ్డారు. రేమదర్ డైరీ ముగ్గురు డైరెక్టర్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని చైర్మన్లను వేడుకుంటున్నట్లు- చెప్పారు. ఎవరి ప్రలోభాలకు గురి కాకుండా ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు, మదర్ డైరీ చైర్మన్ జంగిలి పనులు, లఫంగ పనులు చేయకండని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఓడితే నాయకులు, కార్యకర్తలు వారికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

## బతుకమ్మకుంట ప్రారంభం వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** అంబర్‌పేటలో పునర్నించిన బతుకమ్మ కుంట ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరగాల్సిన కార్యక్రమాన్ని ఆదివారానికి వాయిదా వేశారు. హైదరాబాద్ నగరంలోని బాగ్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ఆక్రమణకు గురైంది. పెద్దమొత్తంలో భవంతులు వెలిశాయి. మిగిలిన కొద్ది స్థలం కూడా కబ్జాదారుల చేతుల్లో ఉంది. దాన్ని వాహనాల పార్కింగ్ స్థలంగా వినియోగించుకునేవారు. ముళ్ల కంపలు, చెత్తాచెదారం వేసేవారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత బతుకమ్మ కుంట ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ దస్త్రాలను ఆధారాలుగా చూపారు. రంగంలోకి దిగిన హైడ్రా.. ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంది. అక్కడ ఎక్స్‌కవేటర్లతో తవ్వగా మీటరు లోతులోనే నీరు ఉబికివచ్చింది. దాదాపు రూ. 7.15 కోట్లు- వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టింది. పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దింది. చిన్న పిల్లలు ఆడేందుకు ఆటస్థలం, వృద్ధులు సేద తీరేందుకు బెంచీలు తదితరాలు ఏర్పాటు- చేసింది. చుట్టూ మెట్లతో కాంక్రీట్ గోడ కట్టింది. ప్రస్తుత వర్షాలకు కుంటలో నిండుగా నీరు చేరి జలకళ సంతరించుకుంది.

## ఓజి సినిమా టిక్కెట్ ధరల పెంపు వీల్లేదు

### సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించిన హైకోర్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఓజీ' మూవీ టికెట్ ధరల పెంపుపై తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. టిక్కెట్ ధలు పెంచేందుకు నిరాకరించింది.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమాకు తెలంగాణ హైకోర్టు మరోసారి షాకిచ్చింది. రివ్యూ తర్వాత కూడా పెంపునకు న్యాయస్థానం అంగీకరించలేదు. 'ఓజీ' బెనిఫిట్ షోలకు, ఆ సినిమా టికెట్ రేట్లను పెంచుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులే కొనసాగుతాయని స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులే అక్టోబర్ 9వ తేదీ వరకు కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. టికెట్ రేట్లు- ఎందుకు పెంచాలని అనుకున్నారో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. ఓజీ సినిమా టికెట్ల ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఇప్పటికే హైకోర్టు సింగిల్ బెంచ్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై ఇటీ-వల విచారణ జరిపిన సింగిల్ బెంచ్.. 'ఓజీ' బెనిఫిట్ షోల ద్వారా వచ్చే రాబడిని వీధి పిల్లలు, అనాథల సంక్షేమం కోసం ఖర్చు చేస్తారా? అని నిలదీసింది. 'ఓజీ' బెనిఫిట్ షోలను, ఆ సినిమా టికెట్ రేట్ల పెంపుదలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. 'ఓజీ' సినిమా టికెట్లను 18 ఏండ్లలోపు వారికి విక్రయించ కుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌తోపాటు- 'ఓజీ' చిత్ర నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్‌కు నోటీ-సులు జారీచేస్తూ.. తదుపరి విచారణను అక్టోబర్ 9కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్ కుమార్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. 'ఓజీ' బెనిఫిట్ షోలకు, ఆ సినిమా టికెట్ రేట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన బీ మల్లేశ్ యాదవ్ పిటిషన్ దాఖలు చేయడంతో హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

## రేవంత్ వైఖరి వల్లనే ఎల్‌అండ్‌టి నిష్క్రమణ

### మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** సిఎం రేవంత్ వైఖరి వల్నే ఎల్ అండ్ టి మెట్రోను వదులుకుందని కెటిఆర్ అన్నారు. అనేక కష్టాలు ఎదుర్కొని ఎల్ అండ్ టీ .. మెట్రోను నడిపింది. దాని నిష్క్రమణ రాష్ట్ర ప్రభుత్వానికి మాయని మచ్చ. పెట్టుబడిదారులను సాక్షాత్తూ ముఖ్యమంత్రే బెదిరిస్తున్నారు. నియంతలా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ మెట్రోకు మంచి డిమాండ్ ఉండేదని, తాము దిగిపోయే నాటికి దేశంలోనే రెండో అతిపెద్ద వ్యవస్థగా ఉందని కేటీఆర్ అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడే ఎయిర్‌పోర్టు మెట్రోకు కూడా శంకుస్థాపన చేసినట్లు- చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో వైఎస్ఆర్ ఓఆర్ఆర్ నిర్మించినప్పుడు ఒక మంచి పని చేశారని, రోడ్డు పక్కన కొంత భూమిని అదనంగా వదిలారని చెప్పారు. 400 కి.మీ మేర మెట్రో విస్తరణకు కేసీఆర్ ప్రణాళికలు రచించారు. దశలవారీగా మెట్రో విస్తరణకు గతంలో కేబినెట్ ఆమోదం తెలిపింది. అధికారంలోకి రాగానే రేవంత్‌రెడ్డి అనాలోచితంగా ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేశారు. ఆయన తలచుకుంటే ఇప్పటికే ఎయిర్‌పోర్టు మెట్రో పూర్తయ్యేది. భూసేకరణ ఇబ్బంది కూడా లేదు. ఎయిర్‌పోర్టు మెట్రో కొనసాగించాలని ఎల్ అండ్ టీ- కోరింది. అందుకు రేవంత్‌రెడ్డి ఒప్పుకోలేదు. అప్పటి నుంచే సీఎం, ఎల్ అండ్ టీ- మధ్య గొడవ మొదలైంది. రేవంత్‌రెడ్డి వల్ల ఆ సంస్థ చాలా ఇబ్బంది పడింది. ఆయన వైఖరి వల్లే ఆ సంస్థ వెళ్లిపోతోంది.

## భారత్, అమెరికా వాణిజ్య చర్చలు

- పరస్పర విశ్వాసంతో అడుగులు
- పీయూష్ గోయల్ నేతృత్వంలో బృందం వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** భారత్, అమెరికాలకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు- కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. అగ్రరాజ్యం సైతం భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింత పెంచుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు- తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఇరుదేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయన్నారు. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నా యని.. ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు- పేర్కొంది. వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు- వాణిజ్య శాఖ వెల్లడించింది. మరోవైపు అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవ్వనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. ఈ సదస్సుకు అనుబంధంగా జరగనున్న మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీలో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దానిపై ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ తాజాగా ఫార్మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించారు. దీంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారాయి. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15శాతం భారత్ సరఫరా చేసినవే. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్, సన్‌ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి సంస్థల మొత్తం ఆదాయంలో 30-50శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నట్లు- గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లతో అమెరికా మార్కెట్‌లో ఈ ఔషధాల ధరలు రెట్టింపు కానున్నాయి.

## మహిళలతో పెట్టుకుంటే అంతే సంగతులు

- కేటీఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క
- రవీంద్రభారతిలో బతుకమ్మ ఉత్సవాలకు హాజరు



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** మహిళలతో పెట్టుకున్న వారు ఎవరూ బాగుపడరని మంత్రి సీతక్క హెచ్చరించారు. సొంత ఇంట్లో ఆడపడచుకు న్యాయం చేయలేని వారు తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం గాంధీ భవన్ లో మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. సొంత ఇంటి ఆడబిడ్డను గోస పెడుతున్నారని.. మాజీ మంత్రి కేటీఆర్ కు ఇది తగునా..? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సంక్షేమ కార్యక్రమాల్లో మహిళా కాంగ్రెస్ భాగస్వామ్యం కానుందని ఉద్ఘాటించారు. మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పుకొచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాదని... మహిళలను బస్సు ఓనర్లను చేశామని ఉద్ఘాటించారు. అభయహస్తం నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం కాజేసిందని మంత్రి సీతక్క ఆరోపించారు. మరోవైపు... రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం రవీంద్రభారతిలో పువ్వుల బతుకమ్మ పాటను ఆవిష్కరించారు. తెలంగాణ పర్యాటక సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పువ్వుల బతుకమ్మ పాటను సంస్థ నిర్వాహకులు రూపొందించారు. సింగర్స్ గడ్డం సంతోష్, శ్రీనిధి పువ్వుల బతుకమ్మ పాటను ఆలపించగా.. నయని పావని నటించింది. ఈ సందర్భంగా సింగర్స్, నాయని పావనీని మంత్రి సీతక్క, కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరా శోభన్ సన్మానించారు.

ఆర్గాన్ న్యూస్

4

తెలంగాణ
శనివారం
27 సెప్టెంబర్ 2025

www.organnews.in
organ.today@gmail.com
@organnews

# రాజకీయ విలువలు లేని నేతలు!



రాజకీయమంటే పదవులు కావాలి. పదవి, హోదా ఉంటేనే ప్రజల గురించి మాట్లాడుతారు. ఎపిలో వైకాపానేత జగన్‌కు ఇది బాగా సరిపోతుంది. విపక్షనేత హోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని మొండికేశారు. చివరకు హైకోర్టు గడప తొక్కారు. ఐదేళ్లు సిఎంగా పనిచేసిన వ్యక్తికి నిబంధనలు తెలియకపోవడం, అసెంబ్లీకి రాకపోవడం సిగ్గుచేటు. తనకు విపక్ష పదవి కావాలని దేబురిస్తున్నారు. బయట ఉండి విమర్శలు చేస్తున్నారు. నిజానికి రాజకీయాల్లో రోజురోజుకూ విలువలు పడిపోతున్నాయి. సిద్ధాంతాలు పక్కకు పోయాయి. ఎదుటి పార్టీని ఎలా దిబ్బతీయాలా అన్నదే ఇప్పుడు అన్నిపార్టీల ప్రథమ లక్ష్యంగా మారింది. అధికారంలో ఉంటే అక్రమాలకు పాల్పడడం, ఆస్తులు సంపాదించుకోవడం, ఓడితే ఎదుటి పార్టీని విమర్శించడం అలవాటు చేసుకున్నారు. బిఆర్‌ఎస్, వైకాపాలు ఇదే కోవలో ఉన్నాయి. తమ పాలనలో జరిగిన అవినీతి వ్యవహారాలపై మాత్రం మాట్లాడడంలేదు. ఇకపోతే కొందరు నేతలు అధికారం ఉన్న పార్టీలో ఉండడం అలవాటు చేసుకున్నారు. ఎక్కడ అధికారం ఉంటే అక్కడ చేరిపోతున్నారు. విపక్ష పార్టీలు కూడా సమర్థంగా పనిచేయడం లేదు. అధికార పార్టీని విమర్శించడం, ఐదేళ్ల తరవాత అదృష్టం ఉంటే మళ్లీ మనదే అధికారం అన్న ధోరణిలో రాజకీయాలు నెరపుతున్నాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి.. పరస్పర విమర్శలతో పబ్బం గడుపుకునే పరిస్థితిలో రాజకీయ పార్టీలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. అనేక విషయాల్లో జగన్ అధికార టిడిపిపై విమర్శలు చేస్తే సరిపోతుందని ఎదురుదాడికి దిగుతున్నారు. తన హయాంలో జరగిన పాపాలపై జగన్ ఏనాడూ విచారణ కోరుకోవడం లేదు. అందుకే రాజకీయాల్లో విలువలు లేవనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. ఇకపోతే తెలంగాణలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, భ్రష్టు పట్టించిన బిఆర్‌ఎస్, ఎపిలో ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో దివాళా తీయించిన జగన్ ఇప్పుడు ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారు. ఈ రెండు పార్టీల నేతలు తమ తప్పులను, అప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఇప్పుడున్న ప్రభుత్వాలపై విరుచుకు పడుతున్నారు. ప్రాంతీయ పార్టీలు, సిద్ధాంత భావజాలాన్ని కలిగి ఉండడం లేదు. తమ రాజకీయ అవసరాన్ని ప్రజల అవసరంగా చిత్రీకరించి కొందరు పార్టీలు మారుతున్నారు. దీనికి ఎవరూ మినహా యింపు కాదు. అందుకే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది.

సుప్రీం తీర్పు ఇచ్చి సూచనలు చేశాక, తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని పార్టీమారిన పదిమంది ఎమ్మెల్యేలు బుకాయి స్తున్నారు. ఎంతటి నేతలైనా అధికారపార్టీలో చేరడానికి వెరవడం లేదు. రాజకీయనిబద్దత పక్కకుపెడుతున్నారు. అధికారపార్టీ అయితే తమ పబ్బం గడుపుకోవచ్చు. అందులో చేరడానికి సవాలక్ష కారణాలు చూపాల్సిన అసవరం లేదు. రాజకీయాల్లో విలువలు లేవని, వ్యక్తులకు పార్టీల పట్ల విశ్వాసం కన్నా పదవులపైనే మోహం ఉందనడానికి తాజా రాజకీయాలే ఉదాహరణ. ఇలా ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఇకపోతే మోడీ పనితీరు నచ్చిందని, దేశానికి ఆయనే ఆశాజ్యోతి అని బిజెపి పార్టీలో చేరేముందు కొందరు ప్రవచానాలు వల్లిస్తున్నారు. గతంలో తెలంగానలో పలువురు బఆర్‌ఎస్‌లో చేరగా దానిని బిఆర్‌ఎస్ గర్వంగా చాటుకుంది. కానీ ఇప్పుడు తమ ఎమ్మెల్యేలు పార్టీని వీడేసరికి గగ్గోలు పెడుతోంది. ఇలా చేయడంలో కేవలం స్వార్ధ రాజకీయాలు తప్ప మరోటి కాదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడ పదవులు అనుభవించి, పార్టీ అధినేత అడుగలకు మడుగులొత్తిన వారు అధికారం కోల్పోగానే అధికారంలో ఉన్న పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు.అనేక పదవులు అనుభవించి, రాజకీయం గా ఎదుగుదలకు కారణం అయిన పార్టీని, దాని అధినేతలను తిట్టాల్సినన్ని తిట్లు తిట్టి మరీ పార్టీలు మారుతున్నారు. ఇదంతా రాజకీయంగా తమ అవసరం కోసమే అన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. రాజకీయ ఉనికి కోసం అనేక కారణాలు చూపుతున్నారు. అధికారంలో ఉన్నవారు రాజకీయ ఎత్తులు వేస్తూ వీరిని అక్కున చేర్చుకుంటున్నారు. పార్టీ మారదల్చు కుంటే మారాలి. అంతేగానీ వీడుతున్న పార్టీపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరని నేతలు గుర్తించాలి.

రాజకీయ అవసరార్థం ఎప్పుడు ఏదైనా మాట్లాడే అలవాటు మన రాజకీయ నేతలకు ఉంది. చాలామంది ప్రాంతీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు అవకాశం వస్తే ఢిల్లీ గద్దెను ఎక్కాలనే కుతూహలంతో ఉన్నవారు అనేకులు ఉన్నారు. ఏ పార్టీకి కూడా సిద్ధాంతం లేదన్నది తాజా పరిణామాలను బట్టి గమనిం చాలి. అధికారమే అన్ని పార్టీల సిద్ధాంతం. అధికారం ఉంటేనే నేతలు పార్టీని అంటిపెట్టుకుని ఉంటారు. లేకుంటే అధికారం ఉన్న పార్టీలోకి జంప్ అవుతారు. ఇందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. రాష్ట్రం ఏదైనా, పార్టీ ఏదైనా అధికారం ఉంటే అదే తమ పార్టీ అన్న ధోరణిలో నేతలు ఉన్నారు. ఇది రాజకీయ పార్టీల పతనానికి దారితీస్తోంది. ప్రజల సమస్యలపై పోరాడే అవకాశం లేకుండా చేస్తోంది. రాజకీయనేతలు నిబద్దత కోల్పోతే ఎక్కువ కాలం నేతలుగా మనలేమని గుర్తిస్తే మంచిది. తెలంగాణలో ఓ పదిమంది విపక్ష బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ కోర్టుల చుట్టూ తిరుగుతోంది. చివరకు సుప్రీంకోర్టు బాల్‌ను స్పీకర్ కోర్టులో వేసింది. పార్టీ వీడిని వారికి స్పీకర్ నోటీసులు ఇచ్చి, విచారణ చేశారు. తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని అంటున్నారు. ఇక ఎపిలోనూ జగన్‌కు వీరవవిధేయులుగా ఉన్నవారు సైతం పార్టీని వీడుతు న్నారు. అధికారం పోవడంతో అధికార టిడిపి, జనసేనల్లో చేరుతున్నారు. వీరు కూడా సిద్దాంతాలు, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రధానంగా తెరమీదకు తీసుకుని వస్తున్నారు. నిజానికి ఫిరాయింపుల చట్టం పకడ్బందీగా లేకపోవడం, దానిని అమలు చేయాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో లేకపోవడం వల్ల ఇష్టం వచ్చినట్లుగా పార్టీ ఫిరాయింపులు సాగుతున్నాయి. ఇందుకు అన్ని పార్టీలది ఒకటే సిద్ధాంతం. దీనికి ఎక్కడో ఒకచోట తెరపడాలి. పార్టీ ఫిరాయింపులు, అవకాశవాద రాజకీయాలపై ప్రజలు నిలదీయడం అలవాటు చేసుకోవాలి.

27-09-2025 — ఎడిటర్

# విమర్శలతో పాపాలను కడుక్కోలేరు

## ప్రజలకు అందుబాటులోకి రాని కేసీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** బీఆర్‌ఎస్ విమర్శలు కోటలు దాటి పోతున్నాయి. ఓ వైపు హరీష్ రావు, మరోవైపు కేటీఆర్ చేస్తున్న విమర్శలు లిగురివిందలి సామెతను గుర్తు చేస్తున్నాయి. బంగారు తెలంగాణ జరిగి ఉంటే, ఇన్ని సమస్యలు మళ్లీ ఎందుకు వచ్చాయన్నదీ ఆలోచించాలి. ఇకపోతే కేసీఆర్ సామాన్యులకు అందుబాటులో ఉండడన్న విషయం అధికారంలో ఉన్నప్పుడే అందరికీ తెలుసు. అలాగే అధికారం కోల్పోయినా, అలాగే వ్యవహరిస్తున్నారు. ఉద్యమ సమయంలో కూడా అదే ధోరణి కనబర్చారు. ఆయన నేరుగా ప్రజలను కలుసుకునే వీలు లేకుండా, తన వైఖరిని ధృఢపరిచారు. అందుకే ప్రజలు ఆయనను కలవడానికి అవకాశం లేదు. ప్రజలను కలవకుండా, నేతలో చర్చించకుండా బలమైన నేతగా ఎక్కువకాలం మనలేరని కూడా రుజువు చేసుకున్నారు. గత పదేళ్ల ఆయన పాలనలో తనకు తానుగా నిర్మించుకున్న ఇనుపగోడల కారణంగా ప్రజల అవసరాలను గుర్తించలేకపోయారు. సమస్యలను ప్రస్తావిస్తే దాటవేతలు లేదా విమర్శలు ఎక్కువయ్యాయి. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ప్రజల పక్షాన నిలిచి పనులు చేసుకుంటూ పోతే, ఇవాళ బీఆర్‌ఎస్ ఇంతగా ఇతర పార్టీలను విమర్శించాల్సిన అవసరం ఉండేది కాదు. ప్రజలను పట్టించుకుని ఉంటే, తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన నేతగా కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. కానీ దాదాపు పదేళ్లపాటు భరించారు. లాభం లేదనుకుని తీర్పు ఇచ్చారు. దీనిని బీఆర్‌ఎస్ నేతలు అర్థం చేసుకోవడం లేదు. తమ పదేళ్ల కాలంలో అంతా బ్రహ్మాండంగా చేశామంటూ డప్పు కొట్టుకుంటున్నారు. అందుకే, అదేపనిగా విమర్శల ద్వారా ప్రజల్లో ఉండాలని చూస్తున్నారు. వీరు గతంలోనే ప్రజలకు దగ్గరగా ఉంటే, ఆ పార్టీని ప్రజలు విస్మరించేవారూ కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఇంకా కాంగ్రెస్, టిడిపి, బిజెపీలను తిడుతూ, సెంటిమెంట్‌ను రెచ్చగొడుతూ పోతే, ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు లేదు. ఆరు దశాబ్దాల వివక్ష కారణంగా దెబ్బతిన్న తెలంగాణ ప్రాంతానికి నూతన దిశానిర్దేశం చేయడానికి, చరిత్రలో ఒక విశిష్ట నాయకుడిగా నిలవడానికి వచ్చిన అవకాశాలను కేసీఆర్ తాను తానే చేజార్చుకున్నారు. ఎందరో బలిదానాలు చేస్తే తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా, ఆ విజయం తనదేనని కేసీఆర్ అన్నా ఎవ్వరూ పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. ఒక ఆశయం కోసం సుదీర్ఘ పోరాటం జరిపి, దాని విజయాన్ని ప్రజలంతా కేసీఆర్ చేతిలో పెట్టారు. అయితే కేసీఆర్ సీఎం అయ్యాక అధికారాన్ని, సంఖ్యాబలాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రజలకు పింఛన్లు, తాయిలాలు ఇస్తూ సాదాసీదా నాయకుడిగా మిగిలి పోయారు. ప్రజలు ఇలాంటి పందేరాలను కోరుకోలేదు. పనులు చేయాలని చూశారు. హామీయాలను అమలు చేసి కొత్త తెలంగాణకు తెరతీయాలని చూశారు. గ్రామీయూల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం ఆయన కులవృత్తులకు ఆర్థిక సాయం అందించినా, అది ఓట్ల కోసం చేస్తున్న ప్రయత్నంగా నిరూపితమయ్యింది. "ఓటుకు నోటు" పథకాలు అమలవుతున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడింది. చెరువుల పూడికతీత అంతా ఆర్భాటపు ప్రచారంగా సాగింది. మిషన్ భగీరథ కూడా అంతే. ఇలాంటి వాటి ద్వారా లాభం పొందాలనుకున్నప్పుడు, పటిష్ఠంగా కార్యక్రమాలు అమలు చేసి ఉంటే బాగుండేది. అవేవీ చేయకుండా, కేవలం కేంద్రాన్ని, ఎదుటి వారిని తిట్టడం ఇప్పుడు రాజకీయ ప్రచారంగా మారింది. విమర్శలతో ఒనగూరే ప్రయోజనం సున్నా అని బీఆర్‌ఎస్ నేతలు తెలుసుకోవాలి. కావత్ పార్టీ నుంచి వెళ్లడానికి, ఆమె చేస్తున్న విమర్శలకు ముందు సమాధానం చెప్పాలి. కేసీఆర్ కూడా ఫామ్‌హౌస్ వీడి బయటకు రావాలి. తమ హయాంలో జరిగిన తప్పులను గుర్తించి చర్చించాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు.

# ఆర్థిక వృద్ధిపై మొండి బకాయిల దెబ్బ

- ఎగవేతదారుల్లో కనిపించని భయం
- సామాన్య ఖాతాదారులే బలిపశువులు



**ముంబయి, సెప్టెంబర్ 26 :** పెద్దలు ఎగవేసిన మొత్తాల కారణంగా, సామాన్యులకు గుదిబండగా మారింది. సామాన్యులు ఒక్క రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకర్లు, పెద్దల అప్పులపై నోరు మెదపడం లేదు. మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యాంకులు ఖాతాదారులపై ఇష్టమొచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నాయి. కొన్ని కేసుల్లో రుణగ్రహీతలను వదిలేసి, బ్యాంక్ అధికారులను బాధ్యులుగా చేస్తున్నారు. అక్రమ రుణాలకు సహకరించిన బ్యాంక్ అధికారులు మాత్రం ఊచలు లెక్కిస్తున్నారు. ఇలాంటి వారి భరతం పట్టే ఉపాయాలు ఆలోచించడం లేదు. తాజాగా బ్యాంకుల్లో దోపిడీ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాకట్టు బంగారాన్ని మాయం చేస్తున్నారు. నకిలీ బంగారంతో రుణాలు ఇప్పిస్తున్నారు. బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదును మార్చేస్తున్నారు. ఇవి కొత్త తరహా మోసాలు బయట పడుతున్నాయి. సామాన్యుల రుణాల విషయంలో ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకులు, పెద్దల విషయంలో మిన్నకుంటున్నాయి. ఇకపోతే ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే, బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తమమని ప్రజలు భావిస్తున్నారు. మరోవైపు పాత బకాయిల వసూళ్లకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండి బకాయిదారుల పేర్లను వెల్లడించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నా, ఎందుకనో ఆర్బీఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండి బకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల, వివిధ బ్యాంకులు దాదాపు రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ గతంలో విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం, యాభై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వీటి మొండి బకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నట్టు తెలిపింది. ఈ 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ రంగం 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగాలవేనని పేర్కొన్నారు. భారత జీడీపీలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారంగా ఈ రైటాఫ్ విలువను లెక్కించామని లిలిక్రిసిల్ రేటింగ్స్‌లిలి ప్రతినిధి ఒకరు వెల్లడించారు. చివరిగా తీసుకునే రైటాఫ్ విలువ, బ్యాంకుల అంచనాలు, సబ్సిడరీల విలువలు, కమోడిటీ రంగాల ధరల అవుట్‌లుక్ ప్రభావంతో మారవచ్చని క్రిసిల్ వివరించింది. ఈ కంపెనీలన్నీ వ్యాపారంలో సమగ్రత కలిగినవే అని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో, నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించకపోవడం తదితర పరిణామాలు, కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. తాజా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే, మరో 20 శాతం పెంచాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నష్టాలను తట్టుకోవడానికి బ్యాంకులకు సరిపడ మ్షలధనం అవసరం అవుతుందని స్పష్టం చేసింది.



## 2417 మంది అమెరికా నుంచి భారత్‌కు..

### విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ :** డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ వలసలపై కఠిన చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జనవరి నెల మొదలుకొని ఇప్పటివరకు 2,417 మంది అమెరికా నుంచి భారత్‌కు వచ్చారని శుక్రవారం విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు. వారిలో కొందరు బహిష్కరణకు గురికాగా.. మరికొందరు అక్కడ ఉండలేక తిరిగి వచ్చినవారని చెప్పారు. "భారత ప్రభుత్వం చట్టపరమైన వలస మార్గాలను ప్రోత్సహిస్తుంది. అక్రమ వలసలను వ్యతిరేకిస్తుంది. ఏదైనా దేశంలో భారతీయులు ఎవరైనా చట్టపరమైన హెూదా లేకుండా ఉంటే.. వారి నేపథ్యాన్ని తనిఖీ చేసి నిర్ధారించుకుంటాం. తర్వాత వారిని తిరిగి తీసుకువస్తాం. అక్రమ వలసలను ప్రోత్సహించే వ్యక్తులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాం" అని జైశ్వాల్ వెల్లడించారు. అక్రమ వలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేసిన సంగతి తెలిసిందే. చట్టవ్యతి రేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమా నాల్లో వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. ఆ వ్యవహారంపై గతంలో భారత ప్రభుత్వం స్పందించిన సంగతి తెలిసిందే. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

# హైడ్రా చర్యలతో చెరువులకు కళ

## బతుకమ్మ కుంటకు దక్కిన మోక్షం



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** హైదరాబాద్‌తో పాటు నగరంతోపాటు నగరం చుట్టూ ఉన్న చెరువుల సంరక్షణపై హైడ్రా పక్కా ప్రణాళికను అమలు చేస్తోంది. బతుకమ్మ కుంటను రక్షించడం ఓ పెద్ద విజయంగా చూడాలి. నిజానికి శుక్రవారం ఇది ప్రారంభం కావాల్సి ఉన్నా వర్షాల కారణంగా వాయిదా పడింది. ఇప్పటికే అనేక చెరువులకు హైడ్రా విముక్తి కలిగించింది. అనేక ఆక్రమణలను తొలగించింది. కొన్ని తటాకాల విషయంలో అధికారులు హద్దులు మార్చినట్లు, తప్పుడు పత్రాలు సృష్టించినట్లు హైడ్రా విచారణలో తేలింది. వాటిని చట్టపరంగా ఎదుర్కొ నేందుకు కమిషనర్ రంగనాథ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయం తీసుకోబోతున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఎన్‌ఆర్‌ఎస్‌సీ నుంచి 45 ఏళ్ల నాటి ఉపగ్రహ చిత్రాలను సేకరించేందుకు సిద్ధమయ్యారు. హైడ్రా, ఎన్‌ఆర్‌ఎస్‌సీ మధ్య త్వరలో ఒప్పందం జరగనుంది. ఇప్పుడు వెనకడుగు వేస్తే.. నగరంలో మిగిలిన అరకొర చెరువులు కూడా కబ్జా అవుతాయని, యుద్ధప్రాతిపదికన వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని హైడ్రా భావిస్తోంది. లక్ష్యం నెరవేరే వరకు వెనకడుగు ఉండదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. సరైన ఆధారాలతో కూల్చివేతలు చేపట్టినప్పుడే పనులు లక్ష్యం ప్రకారం కొనసాగుతాయని హైడ్రా భావిస్తోంది. అందులో భాగంగా ఇటీవల కమిషనర్ రంగనాథ్ బాలానగర్‌లోని ఎన్‌ఆర్‌ఎస్‌సీ కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలతో హైడ్రా కార్యక్రమాలను పంచుకున్నారు. చెరువుల రక్షణకు సాయం కావాలని అడిగారు. అధికారికంగా చెరువుల హద్దులను నిర్ణయించి, స్పష్టమైన పటాలను ఇవ్వాలని కోరారు. కొందరు అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చినట్లు తెలుస్తోంది. అలాంటి సందర్భాల్లో ఎన్‌ఆర్‌ఎస్‌సీ పటాలు ఉపయోగపడతాయి. ఎన్‌ఆర్‌ఎస్‌సీ సంస్థ ఇప్పటికే హైడ్రా అభ్యర్థన మేరకు 56 చెరువుల పటాలను అందజేసింది. 1979-2023 ఏళ్ల మధ్య చెరువులు ఏ విధంగా ఆక్రమణకు గురయ్యాయో చిత్రాలతో సహా వివరించింది. అనేక తటాకాలు కొన్ని రోజుల్లో కనుమరుగవుతాయని చెప్పడమే వాటి ఉద్దేశం. ఆయా పటాలను మరింత పక్కాగా రూపొందించి, హద్దులను నిర్ణయించాలని తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశోధన సంస్థను కోరడం గమనార్హం. ఈ క్రమంలో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా గతంలో ఉన్న చెరువులు నాలాలు గుర్తించి త్వరగా చర్యలు చేపట్టబోతున్నారు. ఈ క్రమంలో చెరువుల రక్షణపై మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోబోతున్నారు.

## మరోమారు ట్రంప్ సుంకాల బాదుడు

- ఫార్మా ఉత్పత్తులపై వందశాతం టాక్స్
- భారతీయ ఔషధ పరిశ్రమలు లక్ష్యంగా సుంకాలు

**వాషింగ్టన్, సెప్టెంబర్ 26 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తూ బాంబు పేల్చారు. బ్రాండెడ్, పేటెంట్ ఉన్న ఔషధ ఉత్పత్తుల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. అమెరికాలో ప్లాంట్‌లను నిర్మిస్తున్న విదేశీ ఔషధ తయారీ సంస్థలకు ఈ సుంకాలు వర్తించవని పేర్కొన్నారు. అదేవిధంగా అప్‌హోల్స్టర్డ్ ఫర్నిచర్‌పై 30 శాతం, భారీ ట్రక్కులపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించనున్నట్లు వెల్లడించారు. అలాగే కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ వానిటీలపై 50 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు- చెప్పారు. ఈ నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి తీసుకొస్తామన్నారు. జాతీయ భద్రతతో పాటు- ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకుని ఈ టారిఫ్‌లు విధిస్తున్నట్లు- తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్ ద్వారా ట్రంప్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న ఈ నిర్ణయంతో భారతీయ ఫార్మా పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తంగా 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసింది. ఇందులో 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు అమెరికాకే ఎగుమతి అయ్యాయి. అంటే మొత్తం ఎగుతుల్లో ఇది 31 శాతం. ఇక అగ్రరాజ్యంలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45 శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15 శాతం మన దేశం నుంచి సరఫరా చేసినవే కావడం గమనార్హం.



## ఆర్కేపురం డివిజన్లో ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న భాస్కర్ రెడ్డి

**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26 :** తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ భవన్ వద్ద గల చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహం వద్ద ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పగడాల ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మెంబర్ దీపా భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో వీరవరిత ఐలమ్మ స్ఫూర్తి మరవలేనిదని అన్నారు సాకలి ఐలమ్మ లాంటి నిస్వార్థ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పున్నా గణేష్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ బొడ్డుపల్లి మహేందర్ జ్ఞానేశ్వర్ యాదవ్ పగడాల శ్రీశైలం రామకృష్ణ గౌడ్ బొడ్డుపల్లి నగేష్ అంజి ఢిల్లీ నరసింహచారి కిట్టు అనిల్ రాష్ట్ర నాయకులు డివిజన్ అధ్యక్షులు యువజన కాంగ్రెస్ నాయకులు ఎన్ ఎస్ యు ఐ నాయకులు మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.



## హలో ఆదివాసి చలో భద్రాచలం

- నేడు జరిగే ఆదివాసి తెగల ధర్మ యుద్ధం మహాసభను విజయవంతం చేయాలని పిలుపు
- లంబడాలను ఎస్టీ జాబితాల నుండి తొలగించాలి
- మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షులు తాటి నాగరాజు

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** ములుగు జిల్లా మంగపేట మండలంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు మాట్లాడుతూ చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ 1976 లో అక్రమంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలికంగా విద్యపరంగా వాలా రాజకీయ ప్రయోజనాల కోసం జీవో ద్వారా వెనకబడిన వారు అనే నెపం తీసుకొచ్చి కేవలం విద్య పరంగా డిఎన్‌టిలుగా అవకాశం ఇస్తే అదే ఆసరా చేసుకుని ఎస్టీలుగా చలా మణి అవుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసులకు దక్కాల్సిన అందాల్సిన పాలాలు విద్య ఉద్యోగం ఉపాధి రిజర్వేషన్లు అన్నిటిని దోసుకుంటూ అనుభవిస్తూ ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు అందుకు ఆదివాసులు అందరూ ఐకమత్యంతో గూడెం గూడెం కదిలి ఆదివాసుల కదం తొక్కాలి ఆదివాసుల హక్కులకై అస్తిత్వంకై పోరాడే సమయం ఆసన్నమైంది అందుకు సెప్టెంబర్ 28 భద్రాచలంలో జరిగే 9 తెగల ధర్మ యుద్ధం మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్న మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు మన్య సీమ నాయకులు తోలేం నరసింహారావు తోలేం సుధాకర్ పాల్గొన్నారు.



## చదువే మనిషిని ఉన్నత స్థితికి చేరుస్తుంది

- కష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యం సాధ్యం
- తల్లిదండ్రులు విద్యార్థులతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**కారేపల్లి ఆర్గాన్ న్యూస్ సెప్టెంబర్ 26:** చదువుకుంటేనే ప్రతి ఒక్కరు ఉన్నత స్థితిలో ఉంటారని కష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అన్నారు శుక్రవారం సింగరేణి మండలంలో స్థానిక శాసనసభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ పర్యటించారు ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పేరెంట్స్ అధ్యాపకుల సమావేశానికి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ వేడుకలు పాల్గొన్నారు అదేవిధంగా స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే పరిశీలించారు ఇటీవల కారేపల్లిలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి ఇంటికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు అంతకుముందు కారేపల్లిలోని దుర్గామాత మండపాలలో జరిగిన ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే పాల్గొన్నారు ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల మంజుల మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ మేదరి టోనీ బానోతు దేవల నాయక్ అడ్డగోడ ఐలయ్య ఎండి యాకూబ్ అలీ తాజుద్దీన్ బానోత్ హిరాలాల్ షేక్ మాజీద్ పాష ధరావత్ భద్ర నాయక్ ఆదెర్ల రాములు రజక సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయ లెక్చరర్లు సుధారాణి వేణు శ్రీనివాస్ రాజ్యలక్ష్మి దుర్గాప్రసాద్ వనిత పార్థసారథి యాకయ్య లక్ష్మీనారాయణ రమ ఖాసిం రాంబాబు బాబురావు షాజిదా కవిత కృష్ణవేణి యాకూబ్ పాషా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు భారీ వర్ష సూచన నేపథ్యంలో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వండి
- క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.





**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26 :** నేడు రేపు రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భారీ వర్ష సూచనల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని సూచించారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం ఆస్తి నష్టం మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అధికారులు సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం యావత్తు అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలని హితవు పలికారు. ముఖ్యంగా రెవెన్యూ పోలీస్ వైద్యారోగ్య ఇరిగేషన్ విద్యుత్ పంచాయతీ రాజ్ రోడ్లు-భవనాల శాఖలు విపత్తు నిర్వహణ సంస్థలు రాబోయే రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలన్నా రు. ప్రజలు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రజలు కూడా ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. లోతట్టు ప్రాంతాలు నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. లో లెవెల్ వంతెనలు కాజ్ వేల మీదుగా వరద ప్రవాహం ఉన్న సమయాలలో రాకపోకలను నిషేధించాలని చెరువులు కాలువలు నదులలో చేపల వేట, ఈత కోసం ఎవరూ వెళ్ళకుండా కట్టడి చేయాలన్నారు. భారీ వర్షాల వల్ల చెరువులు కాలువ కట్టలు తెగి పోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని హితవు పలికారు. భారీ వర్షాలు ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు వైర్లు తెగిపోవడం ట్రాన్స్ఫార్మర్లు కూలిపోవడం వంటివి చోటుచేసుకున్న సందర్భాలలో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా రోడ్లు తెగిపోవడం వంటివి జరిగితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని జనజీవనం స్తంభించిపోకుండా ప్రజలకు అసౌకర్యం కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ దారిమళ్ళింపు చర్యలలో పోలీసు అధికారులు సిబ్బంది క్రియాశీలంగా పాల్గొనాలని సూచించారు. పురాతన శిథిలావస్థకు చేరిన భవనాలలో ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తిస్తూ అవసరమైన సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అక్కడికి తరలించి ఆహారం ఇతర సదుపాయాలు సమకూర్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలతో వరద జలాలు ఏర్పడి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని పీ.హెచ్.సీలు ఆసుపత్రులలో సరిపడా మందుల స్టాక్ ను అందుబాటులో పెట్టుకుని వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అప్రమత్తమై ఉన్నదని ఎలాంటి పరిస్థితులు తలెత్తిన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని ప్రజలు ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా తక్షణ సహాయం కొరకు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 కు కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ వర్షానికి జలమాయమైయ్యే ప్రాంతాల సమస్య కు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వరద ఉధృతి ఎక్కువ ఐతే వెంటనే జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రజలు సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు

### విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్ బ్రహ్మానందం



**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** జనజీవన ప్రవంతిలో విశ్వ జనని సామాజిక సేవలో దూసుకుపోతున్న నేపథ్యంలో విశ్వజనని ప్రతిభా పురస్కారాలు వివిధ రంగాలలో సేవలు అందజేస్తున్న వారికి అంద జేయాలని నిర్ణయించినట్టు విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు . ఈ నేపథ్యంలో సామాజిక సేవలు విద్య వైద్యం నృత్యం పర్యావరణ పరిరక్షణ క్రీడలు సాహిత్యం సంగీతం కలలు ఆధ్యాత్మికం ఉపాధి కల్పనా రంగాలలో సేవలు అందిస్తున్న వారు విద్యార్థులనువిద్యా బోధనలతో తీర్చిదిద్దుతున్న సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులకు, ఉత్తమ అధ్యాపకులుగా అవార్డులు అందజేసే కార్యక్రమం చేపట్టినట్టు ఈ కార్యక్రమానికి ప్రముఖ శని నటులు అతిరాజు మహారధులు విచ్చేస్తున్నారని వెంటనే పేరు నమోదు చేసుకోవాలని విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు రుమానందం కోరారు. ఈ కార్యక్రమం నవంబర్ 1న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదులో నిర్వహించడం జరుగుతుందని వివరాలకు బొగ్గారపు బ్రహ్మానందం విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్ మొబైల్ నెంబర్9885204063 లో సంప్రదించాలని బొగ్గారపు బ్రహ్మానందం కోరారు.

## సెప్టెంబర్ 30న అంబేద్కర్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవం

- కవి గోరేటి వెంకన్న ప్రేమ్ రావత్ లకు గౌరవ డాక్టరేట్లు
- ఉపకులపతి ఆచార్య డాక్టర్ చక్రపాణి

**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 26వ స్నాతపూర్ ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య గంటా చక్రపాణి తెలిపారు. సభా మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30న అంబేద్కర్ యూనివర్సిటీ 26వ శాఖ నిర్వహిస్తున్నట్లు తెలిపారు సమావేశంలో సబ్రిస్టార్ డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ బోజూ శ్రీనివాస్‌తో కలిపి బీసీ వివరాలు వెల్లడించారు. స్నాతకోత్సవానికి గవర్నర్ విష్ణుదేవ్ వర్మతో పాటు ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) న్యూఢిల్లీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమా కాంజీలాల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు ఈస్ నాతకోత్సవంలో తెలుగు సాహిత్యం వ్యాప్తికి చేసిన సేవలకు గాను ప్రఖ్యాత కవి గేయ రచయిత గోరేటి వెంకన్నకు గౌరవ డాక్టర్ ప్రత్యేక విద్యావేత్త ప్రేమ్ రావత్ కు గౌరవ డాక్టరేట్ తో సత్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారులో ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు బుక్ ప్రైస్ లు అందజేస్తామని తెలిపారు అండర్ గ్రాడ్యుయేషన్ విభాగంలో 35 బంగారు పథకాలు పోస్ట్ గ్రాడ్యుయేట్ విభాగంలో మొత్తం 51 మొత్తం 86 బంగారు పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు వివిధ జిల్లాలో నుంచి చదువుకుంటున్న 203 మంది ఖైదీలకు డిగ్రీ పట్టాలు అందజేస్తామని వీరిలో ఇద్దరికీ బంగారు పతకాలు బుక్కు ప్రైజులు అందజేస్తామని చక్రపాణి తెలిపారు.


## భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

- నివాళులర్పించిన బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఏటూరు నాగారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి ఏ ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఏటూరునాగారం మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ...!! తెలంగాణ వీర వనిత, ధైర్య శాలి చాకలి చిట్యాల ఐలమ్మ అనాడు నిరంకుశ నిజాం రజాకార్లను దేశ్ ముఖులను ఎదుర్కొన్నది. నిజాం పాలన విస్నూరు దేశ్ ముఖ్ కి వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు ఐలమ్మ ఐలమ్మ సాగు చేసిన పొలాన్ని తన పేరున రాయించుకొని ఆ పొలం తనదేనని ఆ పంట కూడా తనదేనని తన మనుషులను పంపించాడు. నాడు సంఘం గా పిలిచే కమ్యూనిస్టుల తో చేయి కలిపి తన పొలాన్ని దేశ్ ముఖ్ గుండాల నుండి కాపాడుకుంది. వారు చేసిన ఆనాటి ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది అయింది. ఆ తర్వాత మలి దశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అయ్యిందిచాకలి ఐలమ్మ ధైర్యం తెగువ చూపుతూ ఆనాటి దేశ్ ముఖులు రజాకార్ల గుండెల్లో భయం పుట్టించింది. ఒకవైపు సాయుధ పోరాటం చేస్తూనే మరోవైపు అమ్మ లాగా ఉద్యమకారులకు అన్నం పెట్టి ఆదరించిన మహనీయురాలు ఐలమ్మ స్ఫూర్తి తోనే మాజీ సీఎం కెసిఆర్ తెలంగాణ సాధించారు పరిపాలన లో ఉద్యమ స్ఫూర్తిని పాటిస్తున్నారు. అందుకే తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా మారింది. ఐలమ్మ జయంతి వర్ధంతిలను అధికారికంగా నిర్వహించే విధంగా చర్య చూపిన మాజీ సీఎం కెసిఆర్ కి ధన్యవాదాలు భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. అందరం ఏకమై చాకలి ఐలమ్మ ఆశయాలను సాదిద్దామని అన్నారు. అనంతరము చాకలి ఐలమ్మ విగ్రహానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ ములుగు జిల్లా సీనియర్ నాయకులు మండల నాయకులు గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు

## దుర్గామాత పూజలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకుడు కృష్ణయ్య



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** మంగపేట మండలం తిమ్మంపేట గ్రామంలో యూత్ మరియు గ్రామస్తులు కలిసి దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేయగా నవరాత్రుల సందర్భంగా దుర్గామాత విగ్రహ పూజా కార్యక్రమానికి ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తాటి కృష్ణయ్య చిట్టిమల్ల సమ్మయ్యను ఆహ్వానించగా దుర్గామాత పూజా కార్యక్రమంలో పాల్గొని తిమ్మంపేట గ్రామ ప్రజలకు మరియు మండల ప్రజలకు మంచి జరగాలని తాటి కృష్ణయ్య కోరుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గాద శ్రీనివాసాచారి తిమ్మంపేట దుర్గామాత కమిటీ సభ్యులు దిడ్డి కాశీనాదం సార్ లోడిగే మధుకర్ పల్నాటి సతీష్ గుండు నాగయ్య వాసం రాజు పోలిపోయిన అర్జున్ రావు దుర్గం సావిత్రి కుమార్ యూత్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మానకొండూర్‌లో మినీ స్టేడియం

### హామీ ఇచ్చిన మంత్రి వాకిటి



**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** మానకొండూర్ నియోజకవర్గానికి మినీ స్టేడియం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర క్రీడలు, యువజన శాఖామాత్యులు వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో క్రీడాభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి చర్చించారు. మానకొండూర్ నియోజకవర్గానికి మినీ స్టేడియం, ఫిషరీస్ రీప్రొడక్టివ్ సెంటర్, సెట్ విన్ ట్రైనింగ్ సెంటర్ మంజూరు చేయాలని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరగా, మంత్రి శ్రీహరి సానుకూల స్పందన ప్రకటించారు. త్వరలో వీటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, నియోజకవర్గంలో క్రీడలకు సంబంధించిన సదుపాయాల కల్పన, క్రీడా సామాగ్రి సమకూర్చడంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ ప్రజల పక్షాన మంత్రి వాకిటి శ్రీహరి కి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా దుర్గాదేవికి కుంకుమార్చన

**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** దసరా నవరాత్రుల సందర్భంగా భక్తి శ్రద్ధలతో కట్టరాంపూర్ జిపి (గిద్దెపెరు మాండ్లనగర్)లోని యూత్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమార్చన మహోత్సవం జరిగింది. శ్రీ దుర్గామాత శ్రీ మహాలక్ష్మి అవతారంలో అలంకరించబడి భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వేదపండితుడు ఫణి శర్మ మార్గదర్శకత్వంలో మంత్రోచ్చారణల మధ్య సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ (రథయాత్ర) నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, మాలధారణ స్వాములు, మాతలు పాల్గొని ఊరేగింపు నిర్వహించగా వాతావరణం భక్తి ప్రపుల్లతతో మార్మోగింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారిలో కమిటీ సభ్యులు కట్టె కిరణ్, బండ సంపత్, సౌడోజు అభిలాష్, గోనె అనిల్, జంగ సంపత్, జంగిలి విష్ణు, పెద్దపల్లి శ్రీనాథ్, చేతన్ క్రాంతి, గూడూరి వినోద్, తోట కుమారస్వామి, బొబ్బిలి హర్షవర్ధన్ ఉన్నారు.

ప్రాంతీయం

# ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

## తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల రాకపోకలకు అంతరాయం





**వాజేడు :** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాజేడు మండలం టేకులగూడెం గ్రామ శివారులో రేగుమాకు వాగు వద్ద 163 జాతీయ రహదారిపై ఇరువైపులా వరద నీరు చేరటంతో రెవిన్యూ, పోలీస్ శాఖ అధికారులు,బారికెట్లు ఏర్పాటు చేశారు. పేరూరు గోదావరి నీటిమట్టం 16.350 మీటర్లు ఉందని, వరద నెమ్మదిగా పెరుగుతుందని సిడబ్ల్యూసి అధికారులు వెల్లడించారు.ముప్పు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు,పశువుల కాపలదారులు లోతట్టు ప్రాంతాలకు వెళ్ళకూడదని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ,చత్తీస్గడ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మర్రిమాకు వంతెనపై వరద నీరు చేరటంతో పేరూరు, చంద్రుపట్ల రహదారి నిలిపివేశారు.వరద ప్రవాహం వల్ల మిర్చి తోటలు నీటమునిగాయి. ప్రభుత్వ రెవిన్యూ అధికారులు స్పందించి మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు.



## పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ

### కారేపల్లి విశ్వనాథపల్లిలో చాకలి ఐలమ్మ జయంతి

**కారేపల్లి ఆర్గాన్ న్యూస్ సెప్టెంబర్ 26:** పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మని ఆమె చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రేగళ్ల మంగయ్య మండల అధ్యక్షులు కనతాల ఉపేందర్ అన్నారు శుక్రవారం సింగరేణి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకను నిర్వహించారు సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి మహిళా చైతన్యానికి చాకలి ఐలమ్మ దిక్సూచిలా పనిచేశారన్నారు భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి వీర వనిత అని కొనియాడారు చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజలందరికీ ఆదర్శమని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని పిలుపునిచ్చారు రజక సంఘం నాయకులు దాసరి వెంకటేశ్వర్లు సైదులు బెల్లంకొండ సత్యం బెల్లంకొండ వేలాద్రి యాడారివెంకన్న బెల్లంకొండ రాములు వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.



## దుర్గాదేవి మండపాలలో కుంకుమ పూజలు

**కారేపల్లి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26 :** వైరా నియోజకవర్గ పరిధిలోని సింగరేణి ఏనుకూరు జూలూరుపాడు వైరా కొణిజర్ల మండలాలలో గల గ్రామాలలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామాలలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవార్లకు శుక్రవారం ధనలక్ష్మి అవతారంలో నగదును అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఎంతో పవిత్రంగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు శుక్రవారం మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించడం జరిగింది అమ్మవారికి ఎంతో ప్రీతి పాత్రమైన రోజు శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజకు హాజరై తమ భక్తిని చాటుకున్నారు ఉత్సవ నిర్వహణ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడంతో అర్చకులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారి విశిష్టతను వివరించడం జరిగింది ఈ సందర్భంగా పలువురు దంపతులు పీటలపై కూర్చొని అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

## విశ్వజనని ఫౌండేషన్ బంగారు శివనంది అవార్డులు

- ఎంపికైన ప్రముఖ గాయకులు బుల్లా శ్రీకాంత్
- విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం



**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26 :** వచ్చే నవంబర్ ఒకటవ తేదీ హైదరాబాదులోని నాంపల్లి లో గల పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఎన్టీఆర్ ఆడిటోరియంలో విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం ఆధ్వర్యంలో విశ్వజనని ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు , రాజకీయ ప్రముఖులు చేతుల మీదగా ప్రముఖ గాయకులు అత్తలూరు గ్రామ వాస్తవ్యులు అమరావతి మండలం పల్నాడు జిల్లా బుల్లా శ్రీకాంత్ 2015 ఈటీవీ దసరా సంబరం దివ్య దీపావళి ప్రోగ్రాం తో తన కెరియర్ ప్రారంభించిన మారుమూల గ్రామం నుంచి వచ్చి ఎన్నో కార్యక్రమాలు చేస్తూ హైదరాబాదు నగరంలో ఎంఎం కీరవాణి ఏఎన్ భాష మెలోడీ మ్యూజిక్ టీంలో వర్క్ చేస్తూ కర్ణాటక మరియు హిందుస్థాన్ సంగీతం నేర్చుకుని ఇటీవల విశ్వజనని ఫౌండేషన్ ద్వారా మధుర స్వరరత్న అవార్డు తీసుకొని నవంబర్ ఒకటవ తేదీన హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ లో జరుగు విశ్వజనని ప్రతిభా పురస్కారాలలో పాల్గొననున్నారు.ఇందులో భాగంగా శ్రీకాంత్ కి బంగారు శివ నంది అవార్డు ఇవ్వడం తమకు గర్వకారణంగా అనగా శ్రీకాంత్ మాట్లాడుతూ శివ నంది అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా అవార్డు అందజేస్తున్న బొగ్గారపు బ్రహ్మానందం కి తన సంపూర్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రొద్దుటూరులో వాగు ఉధృతి, బ్రిడ్జిపై నుండి నీటి ప్రవాహం

- గ్రామ ప్రజల రాకపోకలకు అంతరాయం
- వాగు ఉధృతిని పరిశీలించిన మోకిల సిఐ వీరబాబు



**శంకర్‌పల్లిరాజముద్ర న్యూస్ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని ప్రొద్దుటూరు వద్ద మూసి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. బ్రిడ్జి పైనుండి ఉధృతంగా ప్రవహిస్తున్నడంతో పొద్దుటూరు గ్రామ ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల వల్ల తరచుగా బ్రిడ్జి మునిగిపోతుండడం, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, మరో రెండు మీటర్ల ఎత్తువరకు పెంచుతూ నూతన బ్రిడ్జి నిర్మించాలని గ్రామ ప్రజలకు కోరుతున్నారు.ఈ పరిణామంపై మోకిల సిఐ వీరబాబు గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎట్టి పరిస్థితు ల్లోనూ వాగు దాటే ప్రయత్నం చేయకూడదని, భద్రత కోసం పోలీసులు, రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలకు వెళ్లేవారు, బయటకు వెళ్లాల్సిన వారు ఈ మార్గం ఉపయోగించకుండా శంకర్ పల్లి మీదుగా వెళ్లాలని సూచించారు. వర్షపాతం తగ్గే వరకు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండండని సూచించారు.

## నేడు సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

- ఆర్ఆర్ఆర్‌లో భూములు కోల్పోతున్న వారందరూపాల్గొని జయప్రదం చేయాలి
- సిపిఎం వికారాబాద్ జిల్లా కార్యదర్శి మహిపాల్

**వికారాబాద్ :** ఆర్ ఆర్ ఆర్ లో భూములు కోల్పోతున్న వారందరూ నేడు కలెక్టర్ కార్యాలయం ముట్టడిలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం పార్టీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని 4 మండలలోని 23గ్రామాలలో ఆర్ ఆర్ ఆర్ రోడ్, ఏరియల్ రింగ్ రోడ్ లో భూములు కోల్పోతున్న భూ బాధితులతో చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామన్నారు. వికారాబాద్ మండల పరిధిలోని పులుమామిడి, పిరంపల్లి, చించల్ పెట్ గ్రామాలలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ బృందం పర్యటించి భూములు కోల్పోతున్న వారితో మాట్లాడ్డం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ మాట్లాడుతూ త్రిబుల్ ఆర్ రోడ్ ఏరియ రింగ్ రోడ్ లో ప్రభుత్వం పేదల రైతుల భూములు బలవంతపు భూ సేకరణ చెయ్యవద్దన్నారు. రైతులు కోరుకుంటేనే భూములు తీసుకోవాలి లేదా రైతులు వద్దంటే బలవంతపు భూ సేకరణ తీసుకోవద్దు అన్నారు. గతంలో ప్రభుత్వాలు అనేక ప్రాజెక్టుల పేరుతో భూములు తీసుకుంటే భూ సేకరణ చట్టాలు అమలు చెయ్యలేదన్నరు. ఈ ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టం అమలు చెయ్యాలనీ కోరుతున్నామని పేర్కొన్నారు.



## బీసీ రిజర్వేషన్లు పెంపు హర్షనీయం

### తోటకూర వజ్రేష్ యాదవ్

**బోడుప్పల్ :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల జనాభా దామాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు పెంచడం పట్ల కాంగ్రె స్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు లేకుండా చేశారని తాము అధికారంలోకి వస్తే బీసీ కుల గణనతో పాటు బీసీ రిజర్వేషన్లు పెంచు తామని నాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్‌లో తెలిపారని, అలా ఇచ్చిన మాట కు కట్టుబడి అధికారంలోకి వచ్చిన వెంటనే నేడు బీసీ కుల గణనతో చేయడంతో పాటు బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో తీసుకురావడం బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉన్న చిత్తశుద్ధిని అర్థం చేసుకోవాలని అన్నారు.



## తిరుపతిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

### గజమాలతో సత్కరించిన బిక్షపతి చారి

**రంగారెడ్డి, ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి, అక్టోబర్ 26:** మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు తిరుపతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా డి టి ఆర్ గ్రౌండ్ లో జరిగిన వేడుకల్లో హాయ్ నన్ను గజమాలతో శాలువతో తలపాగాతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగిందని మీర్ పేట కార్పొరేషన్ అధ్యక్షులు బిక్షపతి చారి తెలిపారు ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అశోక్ గాజుల మధు దివ్య శ్రావణ్ రాజశేఖర్ మన్యం రవీందర్ రెడ్డి లిక్కీ కృష్ణారెడ్డి బొంత కృష్ణ రాఘవేందర్ గౌడ్ శ్రీనివాస రెడ్డి ప్రశాంత్ ప్రభాకర్ ఆచారి కోట్ల గోపాల్ సంపట్ల అనిల్ వేణుగోపాల్ రెడ్డి గోలి శ్రీనివాసరెడ్డి వెంకటేష్ గౌడ్ హనుమంతు బిజెపి నాయకులు హిందూ ఉత్సవ సమితి సభ్యులు నంది హిల్స్ కాల నీవాసులు పాల్గొనడం జరిగిందని తెలిపారు.

## సారథినగర్‌లో సమస్యలు పరిష్కరించండి

- ఎంబీ గార్డెన్ నుంచి దానవాయు గూడెం వరకు గల రోడ్డును వెడల్పు చేసి,సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి
- ఖమ్మం డివిజన్ సీపీఎం కార్యదర్శి వై.విక్రమ్
- సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర



**ఖమ్మం త్రీ టౌన్, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26 :** ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ సారథి నగర్,మేకల నారాయణ నగర్,గణేష్ నగర్ లల్లో అనేక సమస్యలు తాండవం చేస్తున్నాయని,అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు.48వ డివిజన్ సీపీఎం శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాదయాత్ర బృందానికి కాలనీవాసులు అనేక సమస్యలు తెలిపారు.కాలనీలల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు,విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు, మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాదయాత్ర బృందానికి తెలిపారు.జనవాసాల మధ్యగల ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు,చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.పిచ్చి చెట్లను తొలగించి ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేయాలని కోరారు.ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ....మేకల బిక్షమయ్య ఫంక్షన్ హాల్ నుంచి దానవాయిగూడెం వెళ్లే రోడ్డును వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు.రోడ్డుపై భారీ గుంతలు ఉండటం వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్నేరుకు సైడ్ వాల్ నిర్మించేందుకు దానవాయి గూడెం పార్కు సమీపంలో కాంక్రీట్ మిక్చర్ యూనిట్ నెలకొల్పడం వలన టిప్పర్లు,డంపర్ లు ఈ రహదారి వెంట నిత్యం తిరుగుతూ ఉండటం వలన రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయని, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు.చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు నిత్యం సంచరించే రహదారి కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు.అధికారులు వెంటనే స్పందించి 48వ డివిజన్ లోని పలు కాలనీ లల్లో గల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం,కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ పాదయాత్రలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్,మెరుగు సత్యనారాయణ,స్థానిక నాయకులు తోకల బాబు, మద్దెల పుల్లారావు, పెద్దప్రోలు రామకృష్ణ, శ్రీధర్, డాక్టర్ కృష్ణారావు, హనుమంతరావు, కన్నెకంటి శ్రీనివాసచారి, గండు లక్ష్మీనారాయణ, చామకూరి నాగేశ్వరరావు, చిత్రా శ్రీను, గోసుల వీరభద్రం, రబ్బాని లక్ష్మయ్య, భిక్షం, బైరి బాబు, నిమ్మటూరి ఆంజనేయులు, చంద్రశేఖర్, విజయ్ కుమార్, ఎస్కే.రహీం, ఇ.నాగేశ్వరరావు, రామకృష్ణ, అంజయ్య, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి స్ఫూర్తిదాత చాకలి ఐలమ్మ

- శేరిలింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్‌యాదవ్
- ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి దాయకం

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం లో హాఫీజ్ పెట్ లో శుక్రవారం రోజున చాకలి ఐలమ్మ 130 వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన శేరిలింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాయుధ పోరాటంలో భూమి కోసం చేసిన పోరాట ఉద్యమకారిణి, నేటి తరం యువతకు పోరాటనికి దిక్సూచి చూపించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం వారు పాల్గొన్నారు.



## జి ఇనిస్టిట్యూట్‌ని ప్రారంభించిన మాజీ ఎంపి వినోద్ కుమార్

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మాజిద్ బండలో ఆహ్వానం మేరకు ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్ తో కలసి పాల్గొన్న బిఆర్ఎస్ యువ నాయకుడు మారబోయిన రవి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్సిటీట్యూట్ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్, రవి యాదవ్ తో కలసి రిబ్బన్ కట్ చేసి ఇన్సిటిట్యూట్ ను ప్రారంభించారు. అనంతరం ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. శుక్రవారం మజీద్ బండలో రవియాదవ్ తో కలిసి ఇన్సిటిట్యూట్ ను ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందని నేటి యువతకు వారి గుణాత్మతకు అనుగుణంగా విద్యా సదుపాయాలు కల్పించడంలో జీ ఇన్సిటిట్యూట్ తోడ్పడుతుందని యువతకు విద్యా సదుపాయాలు కల్పించడం మనందరి బాధ్యతని మీడియా విద్యా రంగానికి ఈ ఇన్సిటిట్యూట్ ఒక మైలు రాయిలా నిలుస్తుందని అన్నారు. అదేవిధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు అందరూ పార్టీని వీడినా రవి యాదవ్ మాత్రం పార్టీలోనే ఉంటూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ కార్యకర్తలను ప్రజలను ఉత్తేజ పరుస్తూ శేరిలింగంపల్లి ప్రజలపక్షాన పోరాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళుతూ బిఆర్ఎస్ పార్టీ పరంగా ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ తనకంటూ ఒక చెదరని ముద్ర వేసుకుంటూన్నాడని బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ప్రస్తుత ప్రభుత్వం లో అభివృద్ధి ఏం లేదని ప్రజలకు తెలియపరుస్తూ. మన బస్తి బాట లాంటి కార్యక్రమాలతో ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టి కి అధికారుల దృష్టికి తీసుకెళ్లటంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న యువ నాయకుడు రవియాదవ్ ని అభినందిస్తున్నానని అన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో ఒక గొప్ప నాయకుడిని రవి యాదవ్ లో చూడబోతున్నామని ఈ సందర్భంగా మాజీ ఎంపీ బి వినోద్ కుమార్ అన్నారు.



## అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా సైగ భాష పోస్టర్ ఆవిష్కరణ

**ఖమ్మం ఆర్గాన్ సెప్టెంబర్ 26:** ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా సైగ భాష నేర్చుకోవడానికి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాసరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రామ్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో బధిర భాష తెలిసిన ఒక ట్రైనర్‌ను ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కలెక్టర్ కార్యాలయ గోడపై బధిరులకు సంబంధించిన సైగ భాష పోస్టర్ పెయింటింగ్ వేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఖమ్మం జిల్లా నుండి వంద మందికి పైగా బధిర ఉద్యోగులు, నిరుద్యోగులు హాజరయ్యారు.



## కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఖమ్మం,ఆర్గాన్, సెప్టెంబర్ 26 :** తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బతుకమ్మ వేడుకలు కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లో మార్కెటింగ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన అలిగిన బతుకమ్మ వేడుకలలో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలలో భాగంగా ప్రత్యేకంగా బతుకమ్మలను పేర్చి పూజలు చేసి, వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.... అంటూ ఆట, పాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్న బతుకమ్మ పండుగలో తొమ్మిది రోజులు రకరకాలుగా గౌరమ్మను కొలుచుకొంటూ, కలిసి కట్టుగా అందరూ ఒకేచోట చేరి ఆడుతూ, పాడుతూ బతుకమ్మను పూజించుకొంటారు. కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, మద్దులపల్లి మార్కెట్ కార్యదర్శి ఆంజనేయులు, వైరా మార్కెట్ కార్యదర్శి మొహసీన్ సుల్తానా, మార్కెటింగ్ శాఖ సిబ్బంది రామకృష్ణ, సాదిక్, యశోద, పద్మ, శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మకు బిఆర్ఎస్ నాయకుల నివాళులు

**ఖమ్మం ఆర్గాన్ సెప్టెంబర్ 26:** చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఖమ్మం నగరంలో పాత కలెక్టరేట్ ఎదుట ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఖమ్మం నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, షేక్ మక్బూల్, బిచ్చల తిరుమలరావు, మేకల సుగుణ రావు, షేక్ షకీనా, ఆసిఫ్, భోజట్ల రామ్మోహన్, చేతి కృష్ణ, అరెంపుల వీరభద్రం, ఉస్మాన్, కందాల వీరేందర్, వెంకట్, తిరుమల్, షేక్ అఫ్రోజ్, మాధవి, సతీష్ తదితరులు.



## అమ్మ దయ అందరిపై ఉండాలి

### టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు

**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** పాల్వంచ మండలంలోని జగన్నాథపురం పెద్దమ్మతల్లి గుడిలో దుర్గాదేవి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి మహాలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చారు. కుంకుమ పూజకు హాజరైన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పెద్దమ్మతల్లి గుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరావుతో కలిసి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దయ అందరిపై ఉండాలని అందరూ బాగుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ కమిటీ సభ్యులు బాదర్ల జోషి, ఓబీసీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు జయప్రకాశ్, జిల్లా సెక్రటరీ వెంకట్ యాదవ్,అప్పారావు మరియు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అత్యవసర సర్జరీకి ఎల్‌ఓసి అందించిన ఎమ్మెల్యే

**అశ్వారావుపేట, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన ముత్తిని లావణ్య , హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆమె శస్త్రచికిత్స కోసం అవసరమైన 1,10,000 రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్ఓసి చెక్కును మంజూరు చేయించి స్వయంగా ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేసి సంబందిత వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాల్సిందిగా సూచించారు.

# వీరవనిత ఐలమ్మ నిర్భయ పోరాట స్ఫూర్తి ఆదర్శం

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, సెప్టెంబర్ 26, ఆర్గాన్ న్యూస్ :** వీర వనిత చాకలి ఐలమ్మ చూపిన నిర్భయ పోరాట స్ఫూర్తి నేటికీ ప్రతి ఒక్కరికి ప్రేరణనిస్తుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆమె 130వ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ సమాజంలోని అసమానత్వం, జమీందార్ల పాలనలో వెట్టిచాకిరి వ్యతిరేక పోరాటాలలో మహిళలకే కాదు, సమాజానికే మార్గదర్శకురాలిగా నిలిచారని గుర్తు చేశారు. ఆమె రైతాంగ ఉద్యమంలో, భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో చూపిన ధైర్యం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం మహనీయుల త్యాగాలు, పోరాట స్ఫూర్తి ప్రజలకు చేరేలా వారి జయంతులను అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పారు. ఐలమ్మకు గుర్తింపుగా కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి ఆమె పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఆమె ప్రధాన స్ఫూర్తి అని, తెలంగాణ మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనితగా గుర్తించబడిందని కలెక్టర్ వివరించారు. పేదల భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం 'భూభారతి' వంటి పథకాలను తీసుకువస్తోందని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి. జ్యోతి, కార్పొరేటర్ 43వ డివిజన్, రజక సంఘం, బిసి సంఘాల నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘాల ప్రతినిధులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, వసతిగృహ అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం ఐలమ్మకు అవమానం

- ఐలమ్మ జయంతిన మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొనకపోవడంపై ఆగ్రహం
- కేసీఆర్ నాయకత్వంలో పోరాటయోధులకు విగ్రహాలు, అధికారిక గౌరవం దక్కింది
- బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు
- ఖమ్మంలో చిట్యాల ఐలమ్మ జయంతి రోజున ఉద్రిక్తం
- బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం
- అధికారుల వైఖరిపై విమర్శలు



**ఖమ్మం, ఆర్గాన్, సెప్టెంబర్ 26 :** పోరాడి సాధించుకున్న తెలంగాణలో పోరాట యోధులు, ప్రాణ త్యాగం చేసిన వీరులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అవమానం జరిగిందని బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు అన్నారు. సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా శుక్రవారం ఖమ్మం నగరంలో ఆమె విగ్రహం వద్ద నివాళులు అర్పించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను అధికారులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. "కలెక్టర్ వచ్చాకే మీరు దండలు వేయాలి" అంటూ అధికారుల నిరంకుశ వైఖరిపై నగర బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కలెక్టర్ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు నిర్ణయించి 11 గంటలైనా రాకపోగా, తమను అడ్డుకోవడం బలహీన వర్గాల ఆత్మగౌరవానికి భంగమని విమర్శించారు. తరువాత బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, నేతలు బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణరావు, షకినా తదితరులు మాట్లాడుతూ... తెలంగాణ సాధించిన తర్వాత బలహీన వర్గాల పోరాటయోధుల జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని గుర్తు చేశారు. తెలంగాణలో వీరులు, వీరవనితల చరిత్రలను వెలికితీసి ప్రతి జిల్లాలో విగ్రహాలను ఏర్పాటుచేసి వారి జయంతులను వర్ధంతులను ఘనంగా, అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న మహానాయకుడు మా కెసిఆర్ అన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న ల విగ్రహాలను ఏర్పాటుచేసిన ఘనత మాదే అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వీరనారుల విగ్రహాలకు గౌరవం ఇవ్వకపోవడం వివక్షతకే నిదర్శనమని మండిపడ్డారు. గతంలో పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటైందని, కానీ నేడు ఆ విగ్రహానికి కూడా పూలదండలు వేసే అవకాశం లేకపోవడం బాధాకరమని దుయ్యపట్టారు. "బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేసిన కాంగ్రెస్, ఇప్పుడు రిజర్వేషన్ల పేరిట బీసీలను వంచిస్తోందని విమర్శించారు. ఇకపై బలహీన వర్గాల పోరాటయోధులను అవమానిస్తే జిల్లాలోని బీసీ బిడ్డలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. రేపు తెలంగాణ ఉద్యమ ధీరుడు, 'తెలంగాణ తండ్రి' కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా మంత్రులు స్వయంగా నివాళులర్పించి తమ చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మక్బూల్, భోజట్ల రామ్మోహన్, వీరభద్రం, ఉస్మాన్, కందాల వీరేందర్, నెమలి కిషోర్, ఆసిఫ్, పొతే పొంగు వెంకట్, అఫ్రోజ్, మాధవి, పిట్టల తిరుమల్, ఎడ్లపల్లి నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపుల వేలం

- ఖమ్మంలో అక్టోబర్ 18 లోపు దరఖాస్తులు సమర్పించాలి
- ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ నాగేంద్ర రెడ్డి
- ఖమ్మం జిల్లాలో 116 మద్యం దుకాణాలకు లైసెన్స్ దరఖాస్తుల ఆహ్వానం
- ప్రతి దరఖాస్తుకు మూడు లక్షల రూపాయల నాన్ రీఫండబుల్ ఫీజు

**ఖమ్మం, ఆర్గాన్,సెప్టెంబర్ 26:** నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా మద్యం షాపుల నిర్వహణకు ఆసక్తి గలవారు అక్టోబర్ 18 లోపు దరఖాస్తులు దాఖలు చేయాలని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జి. నాగేంద్ర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–27 సంవత్సరానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 116 మద్యం షాపుల వేలం కొరకు స్వీకరించే దరఖాస్తులను అక్టోబర్ 18 వరకు స్వీకరించడం జరుగుతుందని, దరఖాస్తుదారుడు మూడు లక్షల రూపాయలను డిడి / చలాన్ రూపేన చెల్లించాలని, ఈ సొమ్ము తిరిగి చెల్లించబడవని అన్నారు. దరఖాస్తుదారుడు జిల్లా మద్యపాన నిషేధ అధికారి, ఖమ్మం పేరిట డిడి తీయాలని, దరఖాస్తుతో పాటు పాన్ కార్డు, ఆధార్ కార్డు సెల్ఫ్ సర్టిఫైడ్ కాపీ, కుల ధ్రువీకరణ పత్రం జత చేయాలని, దరఖాస్తులను ఖమ్మం కొత్త కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న ఎక్సైజ్ స్టేషన్ నందు సమర్పించాలని ఆయన తెలిపారు. మద్యం షాపుల దరఖాస్తులను ఖమ్మం లోని లేక్ వ్యూ ఫంక్షన్ హాల్ నందు అక్టోబర్ 23న ఉదయం 11.00 గంటలకు డ్రా ద్వారా కేటాయించడం జరుగుతుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## డైలీ వేజ్ వర్కర్స్ సమ్మె

- దశాబ్దాలు గడుస్తున్నా సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వని అధికారులు
- చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిన బ్రతుకులు



**అశ్వారావుపేట, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబరు 26 :** అశ్వారావుపేట నియోజకవర్గంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వేజ్, కాంటినెంట్, పార్ట్ టైం వర్కర్లకు గత 30 సంవత్సరాలుగా జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు తెలుస్తున్నారు. కానీ ఇప్పుడు 2021 జూన్ 15 వ తేదీన బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఆర్థిక శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 64 ప్రకారం వేతనాలు చెల్లించాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీని ఫలితంగా వేతనాలు బాగా తగ్గుతున్నాయి. జీవో నెంబర్ 64 అమలు నిలిపివేయాలని, ఇప్పుడు తెలుస్తున్న విధంగానే జిల్లా కలెక్టర్ కనీస వేతనాల సర్కులర్ ప్రకారం యధావిధిగా వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. ఈ క్రమంలోనే నిరవధిక సమ్మె 15 రోజులు గడుస్తున్నా సమస్యలకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వారి డిమాండ్స్..**

- సర్వీస్ ఐదు సంవత్సలు పూర్తి చేసిన వారికి క్రమబద్ధీకరణ చేయాలి.
- సమ్మె కాల వేతనాలు చెల్లించాలి
- 10 లక్షల ప్రమాద బీమా కల్పించాలి
- రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలి. మట్టి ఖర్చులకు 50,000 ఇవ్వాలి
- వేతనంతో కూడిన వారాంతపు సెలవులు అమలు చేయాలి
- మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులను డైలీ వేజ్ వర్కర్లుగా నియమించాలి
- విద్యార్థులతో పాటు కార్మికులు కూడా రెండు జతల యూనిఫాం మరియు ఐడి కార్డులు ఇవ్వాలి
- 12 నెలలకు వేతనాలు (దసరా సెలవులు, సంక్రాంతి, వేసవి సెలవులు కూడా) చెల్లించాలి.
- ఈ క్రమంలోనే డైలీ వేజ్ వర్కర్లు మాట్లాడుతూ సమస్యలను వీలైనంత త్వరగా ప్రభుత్వం పరిష్కారం చేయాలని, సమస్యలను పరిష్కారం చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని తెలిపారు.

## రోడ్‌పై గుంతలు పూడ్చిన ఎస్ఐ వీరేందర్


**చింతకాని, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26 :** చింతకాని మండల కేంద్రంలోని చింతకాని–కొణిజర్ల రోడ్డు చింతకాని–జగన్నాథపురం రోడ్ లో గత కొంత కాలంగా రోడ్ పై గుంతలు ఏర్పడి సి సి రోడ్డు లో ని ఇనుప చువ్వలు బయట పడి ప్రమాదభరితంగా మారాయి.వాహన దారుల అవస్థలు గ్రహించిన చింతకాని ఎస్ ఐ వీరేందర్ శుక్రవారం నాడు సిమెంట్ కాంక్రిట్ తో గుంతలు పూడ్పించారు.చింతకాని మండలంలో బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తన దైన శైలిలో మండల ప్రజలకు అన్ని విధాలుగా సోషల్ రెస్పాన్స్ తీసుకొని మండల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న ఎస్ ఐ వీరేందర్ సేవలను మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు

### ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26:** శ్రీ దేవి శరన్నవత్రుల సందర్భంగా భద్రాచలం భగవాన్ దాస్ కాలనీ లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మ, భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బుద్ధ నరసింహారావు హాజరయ్యారు. శుక్రవారం ఉదయం 11:30 నుండి ప్రారంభం అయిన ముగ్గుల పోటీలలో భద్రాచలంలో వివిధ ప్రాంతాల నుండి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొదటి బహుమతి బి రాజేశ్వరి, రెండవ బహుమతి బి వాణి, మూడో బహుమతి ప్రియ, నాలుగో బహుమతి వశం హరిప్రియ, ఐదవ బహుమతి హానిష గెలుపొందారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు ఎంతో ఉత్సాహంగా ముగ్గుల పోటీలలో పాల్గొన్నారని , అమ్మ వారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికీ బహుమతులు అందించిన దాత సమ్మక్క సారక్క దేవుడమ్మ తూరుబాక కి కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా రంగా, ముగడ హరినాథ్, ఎస్కే సిరాజ్, ప్రియ, సాయి కౌశిక్, గణేష్, వినీత్, నాగేశ్వర రావు, సుదర్శన్, రామాచారి, సున్నం భూలక్ష్మి, తెల్లం సునీత, స్వరూప, సుశీల, లీలావతి, ప్రియాంక, రమణమ్మ, క్రిష్ణ ప్రియ,కైక, కుమారి,అనిత, ఉష, వాణి, రమణ, కమల, యశోద, మీనా, మహేష్, సంతోష్, హరికృష్ణ, గోపాల కృష్ణ, లత, రమ్య, జయ, మని, భక్తులు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## అల్పపీడనం, అకాల వర్షాలకు పత్తి పంట నీట మునక

**తిరుమలాయపాలెం ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 26 :** మండలంలో గత 10 రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పత్తి పంట మొత్తం నీట మునిగింది. చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో ఉన్న పత్తి చేను నీట మునిగి పత్తి రైతును ఆందోళనకు గురి చేసింది. రైతు ఇప్పటివరకు ఎకరానికి యాభై వేల వరకు పెట్టుబడి పెట్టి పంట చేతికి వస్తుందన్న తరుణంలో అకాల వర్షం పత్తి పంట సాగు చేస్తున్న రైతుకు శాపంగా మారింది. ప్రభుత్వం పత్తి పంట నీట మునిగిన రైతులు వివరాలు సేకరించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని నష్టపోయిన రైతులు ప్రభుత్వాన్ని వేడుకుం టున్నారు. మండలంలో ప్రధానంగా పత్తి, మిర్చి, వరి ,సాగు అధికంగా ఉంటుంది. అకాల వర్షం వల్ల రైతులు పంట పై పెట్టిన పెట్టుబడి వస్తదా అని ఆలోచనలో పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు రంగంలో దించి నీట మునిగిన పత్తి పంట వివరాలను సేకరించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పండగలు సమీపిస్తున్నాయి. ఈ సమయంలో కొనుగోళ్లను పోత్సహించేందుకు పలు రాయితీలు అందుబాటులోకి వస్తుంటాయి. ఇదే సమయంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు అందుబాటులోకి వస్తుండటంతో చాలా సంస్థలు ఈసారి పండగల కొనుగోళ్లకు వెలుగులు వస్తాయని భావిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు క్రెడిట్ కార్డు సంస్థలూ ప్రయత్నిస్తున్నాయి. కొత్తగా కార్డులు జారీ చేసేందుకు పోటీ పడుతున్నాయి. పూర్తిగా ఉచితం అంటూ, ఆకర్షిస్తున్నాయి. మరి, ఈ మాటల్లో నిజమెంత? అని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దీనికోసం కొన్ని అంశాలను పరిశీలించాలి.



# క్రెడిట్ కార్డు ఉచితం కాదు

సాధారణంగా క్రెడిట్ కార్డులను జారీ చేసే సమయంలో బ్యాంకులు కొన్ని రుసుములను వసూలు చేస్తుంటాయి. స్టేట్‌మెంట్ ఫీజు, కార్డు పోతే కొత్త కార్డు ఇచ్చేందుకు ఫీజులాంటివి ఇందులో ఉంటాయి. వీటన్నింటి గురించి ఎక్కడా చెప్పరు. కానీ, కార్డు బిల్లుల్లో వీటిని గమనించవచ్చు.

- క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించినప్పుడు, ఎలాంటి వడ్డీ ఉండదు. సాధారణంగా ఉచిత వడ్డీ కాలం 50 రోజుల వరకూ ఉంటుంది. ఇది పూర్తిగా మీ కార్డు బిల్లింగ్ తేదీపై ఆధారపడి ఉంటుంది. బిల్లు మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలి. ఆలస్యం చేస్తే రుసుముతోపాటు, వడ్డీ విధిస్తుంది.
- ప్రతి క్రెడిట్ కార్డుకూ గరిష్ఠ వినియోగ పరిమితి ఉంటుంది. ఒక బిల్లింగ్ సైకిల్‌లో ఆ మేరకే దాన్ని వినియోగించేందుకు వీలవుతుంది. కార్డుదారుడి క్రెడిట్ స్కోరు, చెల్లింపుల చరిత్ర, ఆదాయం, వినియోగ నిష్పత్తిలాంటివి పరిగణనలోకి తీసుకొని, పరిమితి నిర్ణయిస్తారు. తొలిసారి కార్డు తీసుకున్న వారికి ఇది కాస్త తక్కువగా ఉండొచ్చు. క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తూ ఉంటే, కొంత కాలం తర్వాత పరిమితిని పెంచే అవకాశం ఉంటుంది.

## ఏటీఎంలలో నగదు తీసుకోవచ్చు


- క్రెడిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంలలో నగదు తీసుకోవచ్చు. కానీ, దీనికి నెలకు 3–4 శాతం వరకూ వడ్డీ ఉంటుందని మర్చిపోవద్దు.
- జాగ్రత్తగా వాడితేనే క్రెడిట్ కార్డు మంచిది. నిర్లక్ష్యంగా ఉన్నామా.. అప్పుల ఊబిలోకి నెట్టేస్తుంది. వీలైనంత వరకూ అప్రమత్తంగా ఉండి, అన్ని వివరాలూ తెలుసుకున్నాకే, కార్డుతో కొనుగోళ్లు చేయండి. అప్పుడే మీకు ఇబ్బందులు లేకుండా పండగ షాపింగ్ పూర్తవుతుంది.




## గడువులోపు బిల్లును చెల్లించడమే మేలు



- చాలామంది మొత్తం బిల్లు చెల్లించకుండా.. కనీస బిల్లు మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటారు. ఇది సాధారణంగా బిల్లులో 5 శాతం వరకూ ఉంటుంది. ఈ కనీస మొత్తాన్ని చెల్లించడం వల్ల క్రెడిట్ కార్డు అమల్లో ఉంటుంది. కానీ, మిగతా మొత్తానికి వడ్డీ తప్పదు. కాబట్టి, గడువులోపు మొత్తం బిల్లును చెల్లించడమే ఎప్పుడూ మేలు. ఒకవేళ పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినప్పుడు దాన్ని ఈఎంఐగా మార్చుకోవడం మంచిది.
- క్రెడిట్ కార్డు బిల్లు వచ్చినప్పుడు దాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఏం కొన్నారు? కొన్న బిల్లులూ.. స్టేట్‌మెంట్‌లో వచ్చిన మొత్తం సరిగానే ఉందా? వడ్డీ, రుసుముల్లాంటివి ఏమైనా ఉన్నాయా? సరి చూసుకోవాలి. లావాదేవీల్లో ఏదైనా వ్యత్యాసం ఉంటే, కార్డు సంస్థ దృష్టికి తీసుకెళ్లాలి.
- కార్డు బిల్లింగ్ తేదీలను జాగ్రత్తగా గమనించాలి. మీ కార్డు బిల్లు ఒక నెలలో రెండో తేదీన బిల్లింగ్ ముగిస్తే.. మూడో తేదీ నుంచి కొత్త బిల్లింగ్ ప్రారంభమవుతుంది. బిల్లింగ్ ప్రారంభంలో కొన్నప్పుడు మాత్రమే 50 రోజుల వ్యవధి లభిస్తుంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ వ్యవధి తగ్గుతుంది.
- రివార్డులు, నగదు వెనక్కి తదితరాలను పరిశీలించాలి. రివార్డు పాయింట్ల ద్వారా కొన్ని వస్తువుల కొనుగోలుపై రాయితీ లభిస్తుంది. ప్రయాణాల్లో, హోటల్ బుకింగ్‌లోనూ డిస్కౌంట్లు లభిస్తాయి. నగదు వెనక్కి ఆఫర్లు ఉన్నప్పుడు.. వెంటనే ఆ ప్రయోజనం లభిస్తుంది. కార్డుతో కొనేటప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.




## త్వరలో బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలు

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ :** త్వరలో బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను ప్రతిపాదించే బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బీమా రంగంలోకి మరిన్ని సంస్థలను తీసుకురావడంతో పాటు.. అధిక సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎఫ్‌డీఐ ప్రతిపాదిత బిల్లును రాబోయే శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా బీమా చట్టం 1938లోని వివిధ నిబంధనలను సవరించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. వాటిలో బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లను ప్రస్తుత 74 శాతం నుంచి 100 శాతానికి చేర్చడంతో పాటు పెయిడప్ క్యాపిటల్‌ను తగ్గించడం, కాంపోజిట్ లైసెన్స్ నిబంధన వంటివి ఈ బిల్లులో ఉన్నాయన్నారు. బీమా నియంత్రణ అభివృద్ధి చట్టం 1999లోనూ సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. పాలసీదారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం, వారి ఆర్థిక భద్రతను పెంచడం, బీమా మార్కెట్‌లోకి మరిన్ని భాగస్వామ్య సంస్థల ప్రవేశాన్ని సులభతరం చేయడం, ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనకు ప్రతిపాదిత సవరణలు ఉపయోగపడతాయని నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు భారత్‌లోని ప్రతి పౌరుడు సాధించిన విజయమని పేర్కొన్నారు. దీపావళి పండగకు ముందే జీఎస్టీ సంస్కరణలను ప్రారంభించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు ఈ సంస్కరణలను ప్రజలముందుకు తీసుకువచ్చి అనేక కుటుంబాలపై భారం తగ్గించామన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు.

## కృత్రిమ మేధతో మెరుగైన అవకాశాలు



**ముంబయి:** టెక్నాలజీ రంగంలో మెరుగైన, కోరుకున్న ఉద్యోగ అవకాశాలు పొందేందుకు కృత్రిమ మేధ (ఏఐ) దోహదపడుతుందని అధిక శాతం మహిళలు విశ్వసిస్తున్నారు. ఉద్యోగ అవకాశాలకు ఏఐ కీలక చోదకమని 78 శాతం మహిళలు వెల్లడించినట్లు ఉద్యోగాలు, కెరీర్ ప్లాట్‌ఫామ్ అప్నా.కో నివేదిక వెల్లడించింది. దేశంలోని టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న 11,300 మందికి పైగా మహిళల స్పందనల ఆధారంగా ఈ నివేదికను సంస్థ వెలువరించింది. ఇందులో పాల్గొన్న వారిలో 52% మంది జెన్ జెడ్ (25 ఏళ్లలోపు) కాగా.. దాదాపు 60 శాతం మంది ద్వితీయ, తృతీయ నగరాలకు చెందిన వారు. మూడింట రెండొంతుల మంది సాధారణ కాలేజీల్లో చదువుకున్నవారు ఉన్నారు.

- ఏఐ ఆధారిత భవిష్యత్ కోసం టెక్ రంగం సిద్ధమవుతోందని మహిళలు అభిప్రాయపడ్డారు. ఉద్యోగాలు, అధికారిక కార్యక్రమాలు, స్వతహాగా ఏఐ/ఎంఎల్ శిక్షణను 58 శాతం మంది ఇప్పటికే పొందుతున్నారు. త్వరలోనే శిక్షణ పొందడానికి సన్నాహాలు చేస్తున్నట్లు 24% మంది తెలిపారు. జెన్ జెడ్ మహిళల్లో (62%) శిక్షణ పొందాలనే భావన అధికంగా ఉంది. సాధారణ స్థాయి కళాశాలలకు చెందిన వారిలో ఇది 70 శాతంగా ఉంది.
- ఏఐ సాఫ్ట్‌వేర్ డెవలపర్లుగా ఎదగాలని సగానికి పైగా మహిళలు లక్ష్యంగా పెట్టుకున్నారు. తర్వాతి స్థానాల్లో డేటా సైన్స్, ఎంఎల్ కొలువులు (19%), ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్ (14%), రీసెర్చ్ (10%) ఉన్నాయి. అధిక గిరాకీ ఉన్న ఉద్యోగాలకు మహిళలు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.
- దిగ్గజ కళాశాలలో విద్యను అభ్యసించడం కంటే ఏఐ నైపుణ్యాలు చాలా ముఖ్యమని దాదాపు మూడింట రెండొంతుల (64%) మహిళలు అభిప్రాయపడ్డారు.



## నాణ్యతలో ఇన్ని ఉల్లంఘనలా..

### బోయింగ్‌కు ఎఫ్ఏఏ మళ్లీ ఫైన్

ప్రముఖ వైమానిక రంగ దిగ్గజం బోయింగ్‌కు అమెరికా నియంత్రణ సంస్థ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మరో సారి ఫైన్ విధించింది. భద్రతకు సంబంధించిన చాలా ఉల్లంఘనలను గుర్తించడంతో దాదాపు 3.1 మిలియన్ డాలర్లు (రూ.27.36 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలు మొత్తం సెప్టెంబర్ 2023 నుంచి ఫిబ్రవరి 2024 లోపు చోటు చేసుకున్నవి. అలాస్కా ఎయిర్‌లైన్స్ డోర్ ఊడిపోవడం సహా చాలా సంఘటనలున్నాయి. వాషింగ్టన్‌లోని రెంటాన్ ఫ్యాక్టరీలో నిర్వహించిన దర్యాప్తులో క్వాలిటీ సిస్టమ్స్‌లో వందల ఉల్లంఘనలు గుర్తించినట్లు ఎఫ్ఏఏ ప్రకటనలో పేర్కొంది. ఇక కెన్సాస్‌లోని బోయింగ్ సబ్‌కాంట్రాక్ట్ సంస్థ స్పిరిట్ ఏరోసిస్టమ్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పింది. రెండు విమానాలు ఎగిరేందుకు అయోగ్యమైనవిగా గుర్తించినట్లు పేర్కొంది. ఇక నాణ్యతలేని విమానానికి ధ్రువీకరణ వచ్చేట్లు సంతకం చేయాలని ఒత్తిడి చేసినట్లు గుర్తించారు. ఈ పెనాల్టీపై స్పందించేందుకు బోయింగ్‌కు 30 రోజుల గడువు ఉంది. ఈ ఏడాది జూన్‌లో 'అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్' 17 నెలల పాటు నిర్వహించిన దర్యాప్తు నివేదికను విడుదల చేసింది. దీనిలో బోయింగ్ తయారీ, భద్రతా పర్యవేక్షణలో చాలా లోపాలు ఉన్నా.. ఎఫ్ఏఏ తనిఖీలు, ఆడిట్స్ ఏమాత్రం ప్రభావం చూపలేదని పేర్కొంది. ఫలితంగానే అలాస్కా ఎయిర్‌లైన్స్ ఘటన చోటు చేసుకొందని వెల్లడించింది. జనవరి 2024 ఘటన విచారకరమని బోయింగ్ ఓ ప్రకటనలో పేర్కొంది. తమ భద్రతా ప్రమాణాలను బలోపేతం చేసుకొంటామని పేర్కొంది. నాణ్యత, బాధ్యతలకు సంబంధించి చర్యలు చేపడతామని చెప్పింది.



# వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

## రోజుకో సేవలో విహరించనున్న స్వామివారు

## చక్రస్నానంతో ముగియనున్న ఉత్సవాలు

### బ్రహ్మాతో తొలిగా ఉత్సవాలు మొదలైనట్లు ఆచారం

### మాడవీధుల్లో కనువిందు చేయనున్న వాహనసేవలు

**తిరుమల, సెప్టెంబర్ 26 :** తిరుమలేశుని ఆలయంలో నిత్యకళ్యాణంపచ్చతోరణంగా జరిగే బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈ నెల 23నుంచి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగబోతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాన్ని సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే జరిపించినట్లు భవిష్యోత్తర పురాణం పేర్కొంటోంది. బ్రహ్మదేవుడు స్వయంగా ఆరంభించిన ఉత్సవాలు కావటంతో, ఇవి బ్రహ్మోత్సవాలు అయ్యాయని అంటారు. మరో వ్యాఖ్యానం ప్రకారమైతే నవాహ్నిక దీక్షతో, నవబ్రహ్మలు తొమ్మిది రోజులు జరిపించే ఉత్సవాలు కాబట్టి ఇవి బ్రహ్మోత్సవాలు అని కూడా అంటారు. తిరుమలలో జరిగే మిగిలిన ఉత్సవాలతో పోలిస్తే, ఇవి చాలా పెద్దయెత్తున జరిగేవి కాబట్టి వీటిని బ్రహ్మోత్సవాలు అంటారనీ ఇంకొందరి భావన. ఈ ఉత్సవాలన్నీ పరబ్రహ్మస్వరూపుడైన శ్రీవారికి చేసే గొప్ప ఉత్సవాలు కాబట్టి వీటిని బ్రహ్మోత్సవాలు అంటున్నారని మరికొందరి భావన. బ్రహ్మోత్సవాలు తొలిరోజున జరిగే ధ్వజారోహణంతో మొదలవుతాయి.



### తిరుమంజన పక్రియ

ఈ క్రమంలో మంగళవారం ఉదయం స్వామివారికి సుప్రభాత, తోమాలసేవలు జరిగాక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామికి ఏకాంతంగా తిరుమంజన పక్రియ చేసి, నైవేద్యం సమర్పిస్తారు. ఆలయసన్నిధిలోని ధ్వజస్తంభంమీద పతాకావిష్కరణ చేస్తారు. స్వామివారి వాహనం గరుడుడు కాబట్టి, ఒక కొత్త వస్త్రంమీద గరుడుడి బొమ్మ చిత్రీకరించి సిద్ధంగా ఉంచుతారు. దీన్ని గరుడధ్వజపటం అంటారు. దీన్ని ధ్వజస్తంభంమీద కట్టేందుకు నూలుతో చేసిన కొడితాడును సిద్ధం చేస్తారు. గరుడధ్వజపటాన్ని ఊరేగించి, ధ్వజస్తంభం వద్దకు తెచ్చి, ఉత్సవ మూర్తులైన భోగ శ్రీనివాసుడు, శ్రీదేవి, భూదేవిల సమక్షంలో గోధూళి లగ్నమైన మీనలగ్నంలో కొడితాడుకు కట్టి పైకి చేరుస్తారు. ధ్వజస్తంభం మీద ఎగిరే గరుడ పతాకమే సకల దేవతలకు స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రం. అష్టదిక్పాలకులు, భూత, ప్రేత, యక్ష, రాక్షస, గంధర్వగణాలకూ ఇదే ఆహ్వానం. ఈ ఆహ్వానం అంది విచ్చేసిన దేవ, రాక్షసగణాలకు, వారివారి నిర్ణీత స్థలాలను కేటాయించి, పద్ధతి ప్రకారం, వారి నియమాల ప్రకారం నైవేద్యం రూపంలో బలిని సమర్పిస్తారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయి. ధ్వజారోహణం తర్వాత, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామిని పుష్పమాలాలంకృతుల్ని చేసి, వాహన మంటపంలో ఉన్న పెద్ద శేష వాహనంపై ఊరేగిస్తారు. అనంతరం ఉత్సవమూర్తులను రంగనాయక మంటపంలో విశ్రమింపజేస్తారు. స్వామి శేషతల్పశాయి. ఆయన కొలువున్న కొండ శేషాద్రి. అందుకే ఏడు తలలున్న పెద్ద శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు బ్రహ్మోత్సవాలలో అతి ప్రధానమైనదిగా పరిగణిస్తారు. మొదట్లో ఈ పెద్ద శేషవాహనాన్ని తొమ్మిదోరోజు ఉదయంపూటనే ఊరేగింపునకు వినియోగించేవారు. పెద్ద శేషవాహనాన్ని ఆదిశేషుడికి ప్రతీకగా భావిస్తే, చిన్న శేషవాహనాన్ని వాసుకికి ప్రతీకగా పరిగణించటం కద్దు. రోజూ సాయంత్రం వేళలో స్వామివారిని హంస వాహనంమీద వూరేగిస్తారు. ఈ హంసవాహనం మీద స్వామి, విద్యాలక్ష్మిగా వూరేగటం విశేషం. మూడోరోజు ఉదయం శ్రీవారికి సింహ వాహనసేవ జరుగుతుంది. ఆ సమయంలో స్వామివారు వజ్రఖచిత కిరీటంతో, సకల ఆభరణాలతో అలంకృతమయి ఉంటారు. జంతుజాలానికి రాజైన సింహాన్ని మృగత్వానికి ప్రతీకగా భావిస్తారు. ప్రతిమనిషి తనలోని మృగత్వాన్ని సంపూర్ణంగా అణచి ఉంచాలనీ తలపైన ఆదిదేవుడిని ధరించాలనీ చెప్పే ప్రతీకగా ఈ సింహవాహనంపై స్వామివారు ఊరేగుతారని భక్తులు భావిస్తారు. ఆరోజు రాత్రి స్వామివారు తన ఉభయ దేవేరులతో కలిసి, అచ్చమైన భోగశ్రీనివాసునిగా ముత్యాలపందిరి వాహనంపై తిరువీధులలో ఊరేగుతారు. నాలుగోరోజు ఉదయం, స్వామివారు తన కల్పవృక్ష వాహనంలో భక్తులకు దర్శనం ఇస్తారు. కామితార్థ ప్రదాయినిగా కల్పవృక్షానికి మన పురాణ, ఇతిహాసాలలో ఓ విశిష్ట స్థానం ఉంది. ఆ కల్పవృక్షాన్ని సైతం తన వాహనం చేసుకోగలిగిన శ్రీవారు భక్తుల కొంగు బంగారమన్నది వేరుగా చెప్పేదేముంది! ఆరోజు సాయంత్రం, సర్వభూపాల వాహనంమీద స్వామివారి వూరేగింపు, భక్తులకు కనులవిందుగా సాగుతుంది. బ్రహ్మోత్సవాలలో అయిదోరోజున, స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ అవతార వూరేగింపు విధానానికి ఓ ప్రత్యేకత ఉంది.

### శ్రీవారి ఆలయంనుంచే పల్లకీపై

మిగిలిన అన్ని వాహనసేవలూ స్వామివారి ఆలయంలోని వాహన మండపంలో ఆరంభమైతే, మోహినీ అవతార వూరేగింపు శ్రీవారి ఆలయంనుంచే పల్లకీపై ఆరంభమవుతుంది. మోహినీ అవతారంలో ఉన్న స్వామి వజ్రాలు, రత్నాలు పొదిగిన హారాన్ని ధరించి, తన కుడిచేతితో చిలుకను పట్టుకొని ఉంటారు. ఈ హారాన్నీ, చిలుకనూ స్వామివారి భక్తురాలైన శ్రీవిల్లి పుత్తూరు ఆండాళ్ (గోదాదేవి) నుంచి తెచ్చినట్లుగా చెప్తారు. స్వామివారి ప్రధాన వాహనం గరుడుడు. అయిదోరోజు రాత్రి జరిగే ఈ సేవకు ఒక ప్రత్యేకత ఉంది. ఏడాదిలో అన్నిరోజులూ ధ్రువబేరానికి అలంకరించే మకరకంఠి, లక్ష్మీహారం, సహస్రనామ మాలలను గరుడవాహన సేవ రోజున మాత్రం ఉత్సవమూర్తి మలయప్పస్వామికి అలంకరింపజేస్తారు. అలాగే ఈరోజునే, శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బేడీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి రాష్ట్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి సమర్పించే నూతన వస్త్రాలను స్వామివారు స్వీకరిస్తారు. గరుడ వాహనసేవలో స్వామి సరసన దేవేరులు ఉండరు. ఆరోజు ఉదయం, హనుమద్వాహనసేవ జరుగుతుంది. హనుమంతుడు, శ్రీరాముని నమ్మినబంటు. త్రేతాయుగంలో తనకు అపార సేవలందించిన ఆ భక్తుడిని తాను మర్చిపోలేదంటూ, ఆ బంటుకు మళ్ళీ తన సేవాభాగ్యం కలిగించే దివ్య దృశ్యం ఇది. తాను సైతం ఆ మహావిష్ణువు స్వరూపమేనని భక్తులకు స్వామి తెలియజేసే మధుర సన్నివేశమది. ఆరో రోజు రాత్రివేళలో స్వామివారు గజ వాహనం మీద తిరువీధులలో మెరిసి భక్తులను మురిపిస్తారు. శ్రీమద్భాగవతంలోని గజేంద్రమోక్ష ఘట్టాన్ని తలపింపజేస్తూ సాగే వూరేగింపు ఇది. ఆపదలో ఉన్న భక్తులను ఆదుకోవటానికి తానెప్పుడూ సిద్ధమేననీ అలనాడు సిరికింజెప్పక, శంఖుచక్ర యుగమున్ చేదోయి సంధింపక వచ్చినా, నేడు భక్తజనుల మొరల్ని వినేందుకు సర్వాలంకారభూషితుడనై వస్తున్నాననీ విశదపరిచే ఘట్టం ఏడోరోజు ఉదయం మలయప్పస్వామి సూర్యప్రభ వాహనంలో ఊరేగుతారు. అదేరోజు సాయంత్రం చంద్రప్రభ వాహనంమీద స్వామి రావటంతో, దివారాత్రాలకు తానే అధినేతనని ప్రకటించినట్లు భక్తులు భావిస్తారు. చంద్రప్రభ వాహనంమీద వచ్చే స్వామి, చంద్రప్రభలకు ప్రతీకలైన తెలుపు వస్త్రాలు, తెల్లని పుష్పాలు, మాలలు ధరించటం విశేషం. ఎనిమిదోరోజు జరిగే రథోత్సవానికి హాజరయ్యేంత భక్తజనం మరేరోజునా కానరారు. భక్తులు ప్రత్యక్షంగా పాలుపంచుకోగలిగే స్వామివారి వాహన సేవ అదే మరి. ఇక రథం విషయానికొస్తే... దానికి సారథి దారుకుడు. సైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వాలహాకం రథానికి పూన్చిన గుర్రాలు. సకల దేవతా మూర్తులతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆ రథాన్ని అధిరోహించిన మలయప్పస్వామి తిరు వీధుల్లో ఊరేగి భక్తులను పరవశింపజేస్తారు.

### చక్రస్నానం

బ్రహ్మోత్సవాలలో చివరిరోజైన తొమ్మిదోనాడు, స్వామివారికి చక్రత్తాళ్వార్ రూపంలో చక్రస్నానం చేయిస్తారు. ముందుగా వరాహస్వామి ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవితో సహా అభిషేకసేవలు జరిపిస్తారు. ఆ తర్వాత సుదర్శన చక్రానికి స్వామి పుష్కరిణిలో పుణ్యస్నానం చేయిస్తారు. ఇదే చక్రస్నాన ఉత్సవం. చక్రస్నానం జరిగే సమయంలో స్వామి పుష్కరిణిలో స్నానాలు చేస్తే పాపాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం. చక్రస్నానాలు అయిన తర్వాత ఆరోజు సాయంత్రం శ్రీవారి ఆలయ ధ్వజ స్తంభం మీద ఆరోహణ చేసిన గరుడ పతాకాన్ని అవరోహణం చేస్తారు. ఈ అవరోహణంతో బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన సకల దేవతలకూ వీడ్కోలు పలికినట్లే. బ్రహ్మోత్సవాలు సైతం మంగళపూర్వకంగా పరిసమాప్తి చెందినట్లు లెక్క. మళ్ళీ బ్రహ్మోత్సవాలు సరిగ్గా సంవత్సరం తర్వాతే జరుగుతాయి.



# జీఎస్టీ సంస్కరణలతో 8వేలకోట్ల లబ్ది

### శాసనసభలో బిల్లుకు ఆమోదం.. పలు బిల్లులకు సభ ఆమోదముద్ర

**అమరావతి, సెప్టెంబర్ 26 :** నూతనంగా చేపట్టిన జీఎస్టీ సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రూ.8 వేల కోట్ల లబ్ధి చేకూరనుందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. జీఎస్టీ లబ్ధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. జీఎస్టీ సవరణ బిల్లును ఆయన శాసనసభలో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీఎస్టీ వంటి విప్లవాత్మక మార్పు ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదని తెలిపారు. ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని పేర్కొన్నారు. శాసనసభలో ఆమోదం పొందిన 7 బిల్లులకు మండలి ఆమోదముద్ర వేసింది. సంబంధిత శాఖల మంత్రులు సభలో బిల్లులను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ సవరణ బిల్లు 2025కు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం సవరణ బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల సవరణ బిల్లు2025కు శాసన మండలి ఆమోద ముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల రెండో సవరణ బిల్లు2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల మూడో సవరణ బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల నాలుగో సవరణ బిల్లు2025, ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల సవరణ బిల్లు 2025కు శాసన మండలి ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది.పల్నాడు జిల్లా గుండ్లపల్లికి చెందిన తెదేపా కార్యకర్త తోట చంద్రయ్యను అత్యంత దారుణంగా హత్య చేశారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం చేయడంతో పాటు పాడె మోశారు. రాజకీయ ప్రేరేపిత హింసకు బలైపోయిన వారికి అండగా నిలబడేందుకు ప్రభుత్వ ఉద్యోగం హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దిశగా చర్యలు తీసుకున్నాం. తోట చంద్రయ్య కుమారుడు తోట వీరాంజనేయులుకు ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం. సీఎంతో పాటు మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో చొరవ చూపారు. తీవ్రవాదుల హింసకు బలైపోయిన వారికి ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర గతంలో ఉంది. అదే క్రమంలో ఇప్పుడు రాజకీయ హింసకు బలైపోయిన వారికి ఉద్యోగం ఇస్తున్నారు‘ అని పయ్యావుల తెలిపారు. నాలా చట్టం రద్దు చేస్తూ ఏపీ శాసనసభ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన బిల్లును రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. సభ ఆమోదించింది. నాలా చట్టం వల్ల స్థానికంగా ఇబ్బందులు వస్తున్నాయని. భూ మార్పిడి చాలా ఇబ్బంది అవుతోందని మంత్రి తెలిపారు. దీనివల్ల పరిశ్రమల స్థాపన, స్థిరాస్తి రంగం అభివృద్ధికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అందుకే చట్టాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని సభకు వివరించారు.




# కార్గో రవాణాలో గుజరాత్ తర్వాత మనమే

### నాణ్యమైన లాజిస్టిక్స్ ఏపీకి వచ్చేలా ప్రణాళికలు


### లాజిస్టిక్స్‌లో ప్రస్తుతం 3లక్షల మంది పని

### వైకాపా హయాంలో దెబ్బతిన్న రాష్ట్రం ఇమేజ్

### త్వరలోనే ఐటీ హబ్‌గా విశాఖపట్టణం

### అసెంబ్లీలో సిఎం చంద్రబాబునాయుడు

**అమరావతి, సెప్టెంబర్ 26 :** కార్గో రవాణాలో గుజరాత్ తర్వాత మనమే ఉన్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. కొత్తగా వచ్చే నాలుగు పోర్టుల వల్ల కార్గో రవాణా పెరుగుతుందన్నారు. పోర్టుల నిర్మాణంలో టార్గెట్‌లు పెట్టుకుని పనిచేస్తున్నాం. ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు కూడా వస్తున్నాయి. రవాణాకు ఇన్‌లాండ్ మార్గాలు ఉపయోగించుకుంటాయి. ప్రపంచంలో నాణ్యమైన లాజిస్టిక్స్ ఏపీకి వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. లాజిస్టిక్స్‌లో ప్రస్తుతం 3లక్షల మంది పనిచేస్తున్నారు. ఆ రంగంలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తాం అని వివరించారు. లాజిస్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. వైకాపా పాలనలో పరిశ్రమల యజమానులను బెదిరించి పంపించేశారు. దాంతో పెట్టుబడి దారులకు మన రాష్ట్రంపై నమ్మకం పోయింది. వైకాపా హయాంలో రాష్ట్రం ఇమేజ్‌ను బాగా దెబ్బతీశారు. పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించేందుకు అనేక చర్యలు చేపట్టాం. అన్ని రకాలుగా అండగా ఉంటామని పెట్టుబడి దారులకు నమ్మకం కల్పించాం. త్వరలోనే విశాఖ ఐటీ హబ్‌గా మారుతుంది. విశాఖకు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సంచర్ వస్తున్నాయి. 2026 ఆగస్టు నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. డిమాండ్ మేరకు టెర్మినళ్లు, రన్‌వేలు విస్తరిస్తాం. దసరా ఉత్సవాల్లో కోల్‌కతా, మైసూర్ సరసన విజయవాడను చేర్చాం అని చంద్రబాబు వివరించారు. వస్తు రవాణా, ప్రయాణికుల రవాణా లాంటి మాధ్యమాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారి మార్గాలు, రైల్వే ఇలా వేర్వేరు రంగాలను విస్తృతం చేయాలని సూచించారు. భారత్‌లో లాజిస్టిక్స్ వ్యయం రూ.24.01 లక్షల కోట్లుగా ఉందని చెప్పుకొచ్చా రు. జీడీపీలో లాజిస్టిక్స్ వాటా 7.97 శాతంగా ఉందని వివరించారు. రవాణా రంగంలో రోడ్ల ద్వారా జరిగే రవాణా 41 శాతం మేర వాటా కలిగి ఉందని తెలిపారు. లాజిస్టిక్స్ కు అయ్యే వ్యయాన్ని తగ్గించగలిగితే ఉత్పత్తి వ్యయమూ తగ్గుతుందని వెల్లడించారు. ఇది ఉత్పత్తిదారులు, వినియోగదారులతోపాటు అందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ఎకో సిస్టమ్‌లో రైలు, రోడ్డు, జల రవాణాతోపాటు పైప్‌లైన్ మార్గం కూడా కీలకంగా మారిందని చెప్పుకొచ్చారు. పైప్‌లైన్ ద్వారా గ్యాస్, నీరు, స్లర్రీ లాంటివి రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని వెల్లడించారు. మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ ద్వారా హైయ్యర్ కార్గో రవాణా చేస్తే వ్యయం తక్కువ అవుతుందని వివరించారు. ఏపీకి ప్రస్తుతం డ్రై పోర్టుల ప్రాజెక్టులు పెద్దఎత్తున వస్తున్నాయని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ ఎకో సిస్టమ్ లో మౌలిక సదుపాయాలే ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఉద్ఘాటించారు. దీని కోసం ఓ బ్లూ ప్రింట్ తయారు చేసి వ్యయం తగ్గించటమే లక్ష్యంగా పనిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. భారతదేశ లాజిస్టిక్స్ కాస్ట్ రూ.24 లక్షల కోట్లు. పాత్ హోల్స్ ఫ్రీ రోడ్లు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. డబ్బులు ఎంతైనా ఫర్వాలేదు. అయితే పాత్ హోల్ ఉంటే వదిలిపెట్టనని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఆదేశించాను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బ్లాక్ సాయిల్ అవ్వడంతో వెంటనే రోడ్లు దెబ్బతింటున్నాయి. రాయలసీమలో ఆ ఇబ్బంది ఉండదు. మొదట్లో గుంతల మూలంగా కోల్‌కత్తా నుంచి చెన్నైకి వెళ్లాలంటే నాలుగైదు రోజులు పట్టేది. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయితో మాట్లాడి స్వర్ణ చతుర్భుజికి శ్రీకారం చుట్టాం. రోడ్లు నాగరికతకు చిహ్నం. 4,739 కిలోమీటర్లు జాతీయ రహదారులు ఏపీలో ఉన్నాయి. వెయ్యి స్కేర్ కిలోమీటర్లకు 53 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉన్నాయి. ఇప్పుడున్నవి కాకుండా రెండు లైన్లు, నాలుగు రైల్వే లైన్లు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. అలాగే హైస్పీడ్ రైల్వే కారిడార్‌కూ కేంద్రం అంగీకరించింది అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. హైదరాబాద్ బెంగళూరు కారిడార్, హైదరాబాద్ చెన్నై కారిడార్ నాలుగు లైన్ల రైల్వే లైన్లు రాబోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖపట్నంలో రైల్వేజోన్‌ను ఏర్పాటు చేశాం.



# పవన్ కళ్యాణ్‌కు వైరల్ ఫీవర్

### వైద్యులు సూచనల మేరకు హైదరాబాద్‌కు రాక

**అమరావతి, సెప్టెంబర్ 26 :** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు.. ఫీవర్‌తోనే ఆయన అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు.. ఇతర కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.. అయితే, గత నాలుగు రోజులుగా వైద్యం చేయించుకుంటున్నా.. జ్వరం తీవ్రత తగ్గలేదు.. దగ్గు ఎక్కువగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు పవన్ కల్యాణ్.. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ లో వైద్య పరీక్షలు చేయించుకోనున్నారు. అందుకోసం ఈ రోజు మంగళగిరి నుంచి హైదరాబాద్ వెళ్తనున్నారు పవన్ కల్యాణ్.. కాగా, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తాజా చిత్రం ఓజీ ఈ నెల 25వ తేదీన అంటే నిన్నే ప్రేక్షకుల ముందుకు రాగా.. బాక్సాఫీస్‌పై దండయాత్ర కొనసాగిస్తోంది. ఓజీ మూవీ ఫస్ట్ డే రికార్డు కలెక్షన్లు నమోదు చేసినట్టు చెబుతున్నారు.. ఈ మూవీ ఇండియా బాక్సాఫీస్ వద్ద మొత్తం రూ.91 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది అంటున్నరాయి ట్రేడ్ వర్గాలు.. బుధవారం ప్రీమియర్స్ తో పాటు డే1 గురువారం వసూళ్లు కలుపుకుని ఓజీ రూ.91 కోట్ల నెట్ కలెక్ట్ చేసిందంటున్నారు.. ఇక, ఈ మూవీ సూపర్ హిట్ అంటూ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు.. అయితే, ఓజీ ఫస్ట్ డే కలెక్షన్స్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# ఉల్లి దండతో షర్మిల యాత్ర

**విజయవాడ, సెప్టెంబర్ 26 :** రైతు సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేస్తానని బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు అడ్డుకున్నారు. మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో రైతన్నకు అండగా కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు.



సీఎంను కలిసేందుకు ఏపీ కాంగ్రెస్ కార్యాలయం నుంచి వైఎస్ షర్మిల బయదేరారు. మెడలో ఉల్లిపాయల మాల వేసుకుని ట్రాక్టర్ ఎక్కారు. ట్రాక్టర్‌తోనే రోడ్డు మీదకు వెళ్లే ప్రయత్నం చేయగా.. అనుమతి లేదంటూ పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. రైతుల గురించి ఎవరూ ఏపీలో మాట్లాడటం లేదు. ఒకప్పుడు రైతు గురించి వైఎస్ రాజశేఖర రెడ్డి పట్టించుకున్నారు. రాజశేఖర రెడ్డి రైతులకు రుణమాఫీ చేశారు. రైతులు ఆత్మహత్యల విషయంలో ఏపీ 3వ స్థానంలో ఉంది. ఏపీలో రైతుకు అసలు భరోసానే లేదు. మాటలే చెపుతున్నారు కానీ ఏమీ చేయడం లేదు. మిర్చి, పొగాకు, జొన్న, పత్తి రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. ఉల్లిపాయకు 1200 రూపాయలు ఇస్తామన్నారు, 400 కూడా మార్కెట్ ధర రావడం లేదు. ఉల్లి పంట పారబోసుకుంటున్నారు. అసెంబ్లీకి వెళ్ళకుండా, సీఎం చంద్రబాబును కలవకుండా మమ్మల్ని అడ్డుకోవడానికి పోలీసులను మోహరించారు. చంద్రబాబుకు మెమొరాండం ఇవ్వాలి, పోలీసులు ఓవరాక్షన్ చేసి అడ్డుకోవద్దు. యూరియా కూడా తెచ్చుకునే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదని వైఎస్ షర్మిల మండిపడ్డారు.




# మీ ఫైటర్‌జెట్స్ వస్తే కూల్చేయడానికి సిద్ధం

## రష్యాను హెచ్చరించిన ఐరోపా దేశాలు

**రష్యా :** గగనతల సరిహద్దులను ఉల్లంఘిస్తే నాటో కూటమి పూర్తి శక్తితో స్పందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఐరోపా దేశాలు రష్యాను హెచ్చరించాయి. తాజాగా నాటో సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా మాస్కోలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల దౌత్యవేత్తలు రష్యా మిగ్-31 ఫైటర్‌జెట్ చొరబాట్లపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశం పూర్తిగా రహస్యంగా జరిగింది. దీని వివరాలు తెలిసిన ఓ అధికారి బ్లూమ్‌బెర్గ్ పత్రికకు వెల్లడించారు. రష్యా కమాండర్లు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతున్నారన్న అభిప్రాయానికి వచ్చారు. అయితే దీనిని రష్యా అధికారులు తిరస్కరించారు. తమ విమానాలు ఎస్తోనియా గగనతలంలోకి చొరబడలేదని.. నాటో పరీక్షించే చర్యలు కావని రష్యా అధికారులు వాదించారు. ఇక పోలెండ్ గగనతలంలోకి డ్రోన్లు చొరబడటంపై స్పందిస్తూ.. అది ఓ తప్పు కారణంగా చోటు చేసుకొందని వివరణ ఇచ్చారు. అయితే ఉక్రెయిన్ దాడికి ప్రతికారంగానే క్రిమియాలో తమ చర్యలు ఉన్నాయని వారు వెల్లడించారు. నాటో మద్దతు లేకుండా కీవ్ అటువంటి ఆపరేషన్లు చేయలేదని పేర్కొన్నారు. ఇక తాము ఐరోపా దేశాలతో పోరాడుతున్నట్లే భావిస్తున్నామన్నారు. ఈ సమావేశం జరిగిందని జర్మనీ అధికారులు ధ్రువీకరించారు. ఇక ఇటీవల క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ.. తమ యుద్ధవిమానాలు అంతర్జాతీయ నిబంధనలు పాటిస్తున్నాయని చెప్పారు. నాటోలోని తూర్పు ప్రాంత దేశాలు ఈ నెలలో పలుమార్లు రష్యా విమానాలు, డ్రోన్లు తమ గగనతలంలోకి వచ్చినట్లు వెల్లడించాయి. అవసరమైతే నాటో రష్యా విమానాలను కూల్చేయాలని ట్రంప్ కూడా ఇటీవల అభిప్రాయపడిన విషయం తెలిసిందే.

# వెస్ట్‌బ్యాంక్ ఆక్రమణకు ఇజ్రాయెల్‌ను అనుమతించను : ట్రంప్



**యూఎస్ :** వెస్ట్‌బ్యాంక్‌పై దూకుడును అనుమతించనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. " వెస్ట్‌బ్యాంక్ ఆక్రమణకు ఇజ్రాయెల్‌ను నేను అనుమతించను. ఇప్పటి వరకు చేసింది చాలు. ఇక ఆపాల్సిన సమయం ఆసన్నమైంది" అని వ్యాఖ్యానించారు. వెస్ట్‌బ్యాంక్ అంశంపై ట్రంప్ ఇటీవల కాలంలో తొలిసారి చేసిన వ్యాఖ్యలు ఇవి. ఇటీవల గాజాను ఇజ్రాయెల్ ఆక్రమించుకోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు న్యూయార్క్‌లో ఆ దేశ ప్రధాని నెతన్యాహు పర్యటనకు రంగం సిద్ధమైన వేళ ట్రంప్ వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం. అయితే వీటిపై ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం స్పందించింది. తమ నాయకుడు స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత వీటిపై స్పందిస్తారని పేర్కొంది. ఈ వారం మొదట్లో కొందరు అరబ్ నేతలు ఐరాస వద్ద ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్ ఆక్రమణలకు పాల్పడితే ఎదురయ్యే తీవ్ర పరిణామాలు ట్రంప్‌నకు బాగా తెలుసని సౌదీ విదేశాంగ మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ పేర్కొన్నారు. మరోవైపు పలు ప్రపంచ దేశాలు కూడా ఇజ్రాయెల్ ఆక్రమణను తప్పుపడుతున్నాయి. ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, పోర్చుగల్ దేశాలు పాలస్తీనాకు గుర్తింపునిచ్చాయి.



# ఇంధన ఎగుమతులపై రష్యా నిషేధం

## ఉక్రెయిన్ దాడుల ఎఫెక్ట్..

**రష్యా :** ఉక్రెయిన్ డ్రోన్లు నిరంతరం ఇంధన సరఫరా వ్యవస్థలపై దాడులు చేయడంతో రష్యాలో చమురుకు కొరత ఏర్పడింది. దీంతో అన్నిరకాల చమురు ఎగుమతులను నిలిపివేయాలని క్రెమ్లిన్ ఆదేశించింది. ఈ నిషేధం సంవత్సరం చివరి వరకు అమల్లో ఉండనుంది. కీవ్ ఎండాకాలం మొత్తం రష్యా చమురు శుద్ధి కేంద్రాలు, పంపింగ్ కేంద్రాలు, ఇంధన సరఫరా రైళ్లను టార్గెట్ చేసింది. సాధారణంగా ఆ సీజన్‌లోనే ప్రజలు ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటారు. దీంతో ఇంధన డిమాండ్ విపరీతంగా ఉంటుంది. ఆ దేశంలో కొరతను సృష్టించడమే లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు ప్లాన్ చేసింది. మరోవైపు రష్యా అధికారులు మాత్రం ఈ నిషేధానికి రవాణా వ్యవస్థల్లో కొరతను కారణంగా చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్ మునుపటిలా సరఫరా చేస్తామని చెప్పారు. ఇంకోవైపు ఉక్రెయిన్ మాత్రం తాము రష్యాలోని పలు ఇంధన ఉత్పత్తి కేంద్రాలు, పంపింగ్ స్టేషన్లను ధ్వంసం చేసినట్లు చెబుతోంది. దక్షిణ రష్యాలో గ్యాజ్‌ప్రోమ్ నిర్వహిస్తున్న ఓ భారీ చమురు శుద్ధి కేంద్రాన్ని ఇటీవలే ఉక్రెయిన్ డ్రోన్లు ధ్వంసం చేశాయి. ఇంధన కొరతను ఎదుర్కొనేందుకు రష్యా నుంచి ఎగుమతి అయ్యే పెట్రోల్‌లో మార్చిలో కొంత బ్యాన్ విధించింది. దానిని మళ్లీ జులైలో విస్తరించింది. తాజాగా గురువారం ఆ దేశ డిప్యూటీ పీఎం అలెగ్జాండర్ నొవాక్ ఈ నిషేధాన్ని మరోసారి పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ఇక డీజిల్‌లో కొంతమేరకు ఎగుమతిని కూడా ఆపినట్లు పేర్కొన్నారు. ఇక దేశంలోని చాలా ప్రాంతాల్లో వినియోగదారులకు డీజిల్, పెట్రోల్ నిర్దేశించినంతే ఇస్తున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇక క్రిమియాలో సగం పెట్రోల్ పంపులు నిల్వలు లేక మూతపడినట్లు వెల్లడించింది. చాలా చోట్ల వాహనాలు ఇంధనం కోసం బారులుతీరి ఉన్నాయి. ఇక ప్రపంచంలో డీజిల్ అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశంగా రష్యా నిలిచింది. ఆ దేశ ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం దీనినుంచే లభిస్తోంది.

# మహిళల ఖాతాల్లో ₹10వేలు



## ఎన్నికల వేళ బిహార్ బొనాంజా

**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఇతర మంత్రులు హాజరయ్యారు. రూ.7,500 కోట్లతో బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పించడం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఈ స్కీమ్ కింద రూ.10వేలు నేరుగా అందాయి. తర్వాత వివిధ దశల్లో ఆ సహాయం రూ.2 లక్షల వరకు ఉండనుంది. స్వయంఉపాధి కోసం పశుపోషణ, వ్యవసాయం, టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. "ఈ నవరాత్రి సందర్భంగా బిహార్ మహిళల సంతోషంలో నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు స్క్రీన్‌పై లక్షలాదిమంది మహిళలు కనిపిస్తున్నారు. వారి ఆశీర్వాదాలు మాకు గొప్ప బలం" అని పేర్కొన్నారు. "ప్రధాన మంత్రి మోదీ మీకోసం పని చేస్తున్నారు. గత ప్రభుత్వం అలా కాదు. ఆయన సీఎం పదవిని కోల్పోయినప్పుడు.. తన సతీమణిని ముఖ్యమంత్రిని చేశారు. తన కుటుంబం గురించి మాత్రమే ఆందోళన చెందారు. మేం మాత్రం బిహార్ ప్రజలందరి కోసం పనిచేస్తాం" అని విపక్ష ఆర్జేడీపై నీతీశ్‌కుమార్ విమర్శలు చేశారు.

# చాలా దేశాల్లో అవసరమైనంత శ్రామిక శక్తి లేదు

## విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్

**న్యూఢిల్లీ :** ప్రపంచ దేశాలకు గ్లోబల్ వర్క్‌ఫోర్స్ అవసరం ఉందని.. దానినుంచి అవి తప్పించుకోలేవని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వ్యాఖ్యానించారు. చాలా దేశాల్లో జనాభా పరిస్థితుల కారణంగా డిమాండ్‌ను కూడా పూర్తి చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన 'ఎట్ ది ఆర్ట్ ఆఫ్ డెవలప్‌మెంట్: ఎయిడ్, ట్రేడ్, అండ్ డెవలప్‌మెంట్' అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. "గ్లోబల్ వర్క్‌ఫోర్స్ ఎక్కడ ఉండాలన్నది రాజకీయంగా చర్చనీయాంశం. కానీ, దానికి ప్రత్యామ్నాయం లేదు. ఆయా దేశాల్లో డిమాండ్.. అక్కడి జనాభాను చూడండి. అందుకే చాలాచోట్ల డిమాండ్‌కు తగినంత శ్రామికశక్తి లేదు. ఇది వాస్తవం. దానినుంచి మీరు తప్పించుకోలేరు. అందుకే మనం మరింత సమర్థవంతమైన, సమకాలీన శ్రామిక శక్తిని సృష్టించాలి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ముందున్న అతిపెద్ద




సవాలు ఇది. ప్రపంచంలోని దేశాల మధ్య విభిన్నమైన వాణిజ్య ఒప్పందాలను మనం చూడబోతున్నాం. ఇతర పరిస్థితుల్లో తీసుకోలేని నిర్ణయాలను కూడా అమలుచేయడం చూడబోతున్నాం. భౌతిక, డిజిటల్ కారణాలతో నేడు వాణిజ్యం చాలా సులభమైపోయింది. మెరుగైన రోడ్లు, షిప్పింగ్, ఎన్నడూ లేనంత సరళమైన వాణిజ్య విధానాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. ప్రపంచం గత మూడు నాలుగేళ్లుగా పంపిణీ వ్యవస్థలు, ఉత్పత్తి సోర్సుల విషయంలో ఆందోళన చెందుతోందన్నారు.

# యుద్ధం, సుంకాలు.. పుతిన్ వ్యూహంపై మోదీ ఆరా

## నాటో చీఫ్ కీలక వ్యాఖ్యలు

**నాటో :** ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో ఏవిధంగా ముందుకువెళ్తున్నారనే అంశం గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను భారత ప్రధాని మోదీ ఆరా తీసినట్లు తెలుస్తోంది. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్‌పై సుంకాల భారం పడటంతో పుతిన్ భవిష్యత్ వ్యూహాల గురించి అడిగి తెలుసుకున్నారని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుటె వ్యాఖ్యలు చేశారు. "భారత్‌పై ట్రంప్ విధిస్తోన్న సుంకాలు రష్యాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్ సుంకాలతో ఇబ్బందిపడుతోంది. దాంతో పుతిన్‌కు దిల్లీ నుంచి ఫోన్ వెళ్లింది. ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్లనున్నారనే దానిపై పుతిన్‌ను నరేంద్ర మోదీ ఆరాతీశారు" అని న్యూయార్క్‌లో నాటో సెక్రటరీ జనరల్ మీడియాతో వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రస్తుతం భారత్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. ఇదిలా ఉంటే.. చమురు కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్, చైనాలు నిధులు సమకూరుస్తున్నాయని ట్రంప్ విమర్శించారు. రష్యా కూడా యుద్ధాన్ని ముగించడానికి సిద్ధంగా లేదని, ఈ రక్తపాతాన్ని ఆపేందుకు మరిన్ని శక్తివంతమైన సుంకాలను విధించడానికి సిద్ధమవుతున్నానని హెచ్చరించారు. నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం షాక్‌కు గురిచేస్తుందని ఇప్పటికే పలుమార్లు అసహనం వ్యక్తం చేశారు. ట్రంప్ మాటలు ఇలాఉంటే.. అసలు తమ పాత్ర



ఏదీ లేదన్నట్టు నాటో చీఫ్ భారత్, రష్యాల గురించి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ వారం వాణిజ్యశాఖ మంత్రి పీయూశ్ గోయల్ అమెరికా ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఇలా చర్చలు జరుగుతోన్న సమయంలో అమెరికా ప్రయోజనాలకు తగ్గట్టుగా భారత్ ట్రేడ్ డీల్‌కు అంగీకరించేలా సుంకాలతో ట్రంప్ ఒత్తిడి తీసుకువస్తున్నారు. తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ పట్టుపడుతుండగా.. అందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించడం లేదు. ఇది అమెరికా అధ్యక్షుడిని అసహానికి గురిచేస్తోంది. అందుకే వరుసగా సుంకాల మోత మోగిస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.


# పాక్ నేతలతో భేటీ వేళ..

## ట్రంప్ సూట్‌పై ఫైటర్ జెట్ పిన్ ఎందుకంటే..?

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాక్ నేతలతో భేటీ వేళ ధరించిన పిన్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇటీవల కాలంలో ఇస్లామాబాద్‌ను ఆకాశానికి ఎత్తేస్తున్న ఆయన ఇప్పుడు వారిని సంతృప్తి పరిచేందుకే దాన్ని ధరించారు అన్న ప్రచారం జరుగుతోంది. సాధారణంగా ట్రంప్ సూట్‌పై అమెరికా పతాకం పిన్ చేసి ఉంటుంది. కానీ, పాక్ ప్రధాని షెహబాజ్, ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌తో భేటీ వేళ ట్రంప్ సూట్‌పై ఫైటర్ జెట్ కూడా పిన్ చేసి ఉంది. దీంతో భారత్‌ను ఇబ్బంది పెట్టడానికే ట్రంప్ అలా నర్మగర్భ సందేశం పంపారని పాక్ అనుకూలురు సోషల్ మీడియాలో ప్రచారం మొదలుపెట్టారు.

### వాస్తవం వేరు..

పాక్ మద్దతుదారులు ప్రచారం చేస్తున్నట్లు అది భారత్‌ను వెక్కిరించడానికి కాదు. ఈ భేటీకి కొద్దిసేపటి ముందు తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్‌తో ట్రంప్ భేటీ అయ్యారు. చాలా రోజులుగా ఆ దేశానికి యుద్ధవిమానాల అమ్మకాన్ని అమెరికా నిలిపేసింది. తాజాగా ఎఫ్-16, ఎఫ్-35 యుద్ధ విమానాల విక్రయాన్ని పునఃప్రారంభించడంపై చర్చలు జరిగాయి. దీనికి చిహ్నంగా ట్రంప్ ఫైటర్ జెట్ పిన్‌ను ధరించి ఆ భేటీకి హాజరయ్యారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియా ఎదుట మాట్లాడారు. ఆ సమయంలో ట్రంప్ తుర్కియే అధినేతను ఇబ్బందిపెట్టారు. ఎలక్షన్‌లో రిగ్గింగ్ చేయడం ప్రపంచంలోనే అందరికంటే బాగా ఎర్డొగాన్‌కు తెలుసని పేర్కొన్నారు. అది పొగడ్తో.. వెక్కిరింతో అర్థంకాక తుర్కియే నేత మౌనంగా ఉన్నారు. ఆ తర్వాత ఎగ్జిక్యూటివ్



ఆర్డర్లపై సంతకం కార్యక్రమంలో కూడా దానిని ధరించే ఉన్నారు. ఈ సమావేశం అనంతరం ట్రంప్ మాట్లాడుతూ ఆయుధాలు, పరికరాలను కొనుగోలు చేసేందుకు అమెరికా ఫ్యాక్టరీలను సందర్శించడానికి విదేశీ నాయకులు, జనరల్స్ బారులు తీరారని పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ల నుంచి బాగ్రాం ఎయిర్ బేస్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ వ్యూహంలో పాక్ కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అఫ్గాన్‌కు అమెరికా సేనలు చేరాలంటే పాక్ మీదుగా వెళ్లడం సులువు. ఈ ఎయిర్ బేస్ నుంచి అటు చైనా, ఇటు ఇరాన్‌పై నిఘా వేయడం వాషింగ్టన్‌కు తేలికవుతుంది. ట్రంప్- పాక్ నేతల భేటీ అరగంట ఆలస్యంగా మొదలై దాదాపు 80 నిమిషాల పాటు సాగింది. ఈ సమావేశం వివరాలను మాత్రం మీడియాకు వెల్లడించలేదు. వాస్తవానికి ఈ భేటీ నుంచి పాక్ రక్షణ మంత్రి ఖవాజ ఆసిఫ్‌ను తప్పించారు. ఆయన స్థానంలో ఫీల్డ్ మార్షల్ మునీర్ వచ్చారు.



# భారత్‌తో కాల్పుల విరమణలో ట్రంప్ కీలక పాత్ర

## పాక్ కొత్త రాగం

**పాకిస్థాన్ :** భారత్-పాకిస్థాన్ యుద్ధాన్ని ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వాదనను భారత్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కొత్త రాగం అందుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడంలో ట్రంప్ సాయం చేశారని, తద్వారా దక్షిణాసియాలో భారీ విపత్తును నివారించారని ఓ ప్రకటనలో కొనియాడారు. "పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిం మునీర్‌తో కలిసి అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని పెంపొందించుకునే అంశాలతోపాటు గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం, ఉగ్రవాదంపైపోరులో సహకారం వంటి అంశాలపై చర్చించారు. తెగువ చూపించి పాక్-భారత్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి అధ్యక్షుడు ట్రంప్ సాయం చేయడంతోపాటు ముస్లిం దేశాధినేతలతో సంప్రదింపులు జరిపి గాజాలో సంక్షోభం ముగింపు, పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు కృషి చేశారు" అని తాజా ప్రకటనలో ట్రంప్‌పై పాకిస్థాన్ ప్రశంసలు కురిపించింది. ఈ సందర్భంగా తమ దేశంలో కీలక రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని అమెరికాను ప్రధాని షరీఫ్ కోరినట్లు పేర్కొంది. అంతేకాకుండా వీలునుబట్టి పాకిస్థాన్‌లో పర్యటించాలని ఆహ్వానించినట్లు తెలిపింది. ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ సైనికాధికారుల విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణకు అంగీకరించామని భారత్ పదే పదే స్పష్టం చేస్తోంది. ఇందులో మూడో దేశం జోక్యం లేదని ఉద్ఘాటిస్తోంది. ఇదే విషయంపై పలు వేదికలపై ట్రంప్ చేస్తున్న వాదనలనూ ఖండిస్తోంది. అయినప్పటికీ.. తాజాగా పాకిస్థాన్ కూడా ట్రంప్ వాదనను సమర్థిస్తూ మాట్లాడటం గమనార్హం.



# అమెరికా విశ్వవిద్యాలయాలకూ హెచ్-1బీ కష్టాలు

**యూఎస్ :** హెచ్-1బీ వీసా ఫీజును ట్రంప్ సర్కారు భారీగా పెంచడంతో అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకూ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే ప్రభుత్వం నుంచి వచ్చే పరిశోధనల నిధులకు కోతపడటంతో ఇబ్బంది పడుతున్న ఈ విద్యాసంస్థలు తాజా నిర్ణయం మోయలేని ఆర్థిక భారమైంది. అమెరికాలో సాఫ్ట్‌వేర్, ఆర్థిక సేవల కంపెనీలే కాదు.. మెడికల్ స్కూల్స్, స్టేట్ యూనివర్శిటీలు, ఐవీ లీగ్ స్కూల్స్ ఈ రకం వీసాలపై ఆధారపడుతున్నాయి. ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఆ దేశంలో విద్యాసంస్థల్లో మరెవరూ వాడనన్ని హెచ్-1బీ వీసాలను వినియోగిస్తోంది. ఇక్కడ సిబ్బందిలో 500 మందికి ఈ రకం వీసాలున్నాయి. ఈ విశ్వవిద్యాలయం ఏటా 270 మందిని సగటున ఈ వీసాపై నియమించుకొంటోందని గణాంకాలు చెబుతున్నాయి. కొత్తగా పెరిగిన ఫీజు ప్రకారం వీసాలకే 27 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇక కొలంబియా విశ్వవిద్యాలయం, ది యూనివర్శిటీ ఆఫ్ మిషిగన్, హార్వర్డ్, వాషింగ్టన్ విశ్వవిద్యాలయం ఏటా వందల సంఖ్యలో విదేశీ సిబ్బందిని నియమించుకొంటున్నాయి. ప్రస్తుత విధానమే కొనసాగితే ఒక్కో విద్యాసంస్థపై ఏటా 10-20 మిలియన్ డాలర్ల అదనపు భారం తప్పదు. చాలా విశ్వవిద్యాలయాలు విదేశాలకు చెందిన ప్రతిభావంతులను సిబ్బందిగా, పరిశోధకులుగా, బోధనా సిబ్బందిగా నియమించుకోవాల్సి ఉంటుంది. అలా వచ్చిన వారిలో చాలా మంది అమెరికా పౌరసత్వం స్వీకరిస్తున్నారు. 2023 గణాంకాల ప్రకారం 58శాతం మంది పోస్ట్ డాక్టోరల్ సిబ్బంది ఈ వీసాలతో వచ్చినవారే. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పైగా విశ్వవిద్యాలయాల హెచ్-1బీ దరఖాస్తులకు లాటరీ విధానం నుంచి మినహాయింపు ఉంది.

# అమెరికా ప్రసంగం వివాదం..

## హైకోర్టులో రాహుల్ గాంధీకి చుక్కెదురు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అలహాబాద్ హైకోర్టులో చుక్కెదురైంది. తన వ్యాఖ్యలపై దర్యాప్తునకు వారణాసి ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో రాహుల్ వ్యాఖ్యలపై విచారణకు మార్గం సుగమమయ్యింది. గతేడాది అమెరికా పర్యటనలో ఓ వర్గాన్ని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై వారణాసి ప్రత్యేక కోర్టు రివిజన్ పిటిషన్‌ను స్వీకరించింది. దీనిని సవాలు చేస్తూ రాహుల్ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా..తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం దానిని తోసిపుచ్చింది. అమెరికా పర్యటనలో భాగంగా గతేడాది వర్జీనియాలో భారతీయ సంతతి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. కొన్ని వర్గాలు, భాషలు, మతాలను ఆర్ఎస్ఎస్ అభద్రతా భావానికి గురిచేస్తోందని ఆరోపించారు. ఇలా భారత్‌లో మత స్వేచ్ఛపైనే పోరాటం జరుగుతోందని, రాజకీయాల గురించి కాదన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ముందు కూర్చొన్న వారిలో తలపాగాతో ఉన్న వ్యక్తిని ఉద్దేశిస్తూ- సిక్కులు తలపాగాలు, కడియాలు ధరించవచ్చా? వారు గురుద్వారాకు వెళ్లగలుగుతున్నారా? అనే వాటిపైనే భారత్‌లో ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. అన్ని మతాలకూ ఇదే పరిస్థితి తప్పడం లేదన్నారు. ఈ వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా తప్పుపట్టింది.

# వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌కు అధిక ప్రాధాన్యమిస్తే..

## గూగుల్ మాజీ సీఈఓ కీలక వ్యాఖ్యలు

వర్క్-లైఫ్ బ్యాలెన్స్ గురించి గూగుల్ మాజీ సీఈఓ ఎరిక్ స్మిత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ విధానానికి అతి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పోటీతత్వం దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు. అలాగే వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి కూడా తాను వ్యతిరేకమని వెల్లడించారు. "టెక్ రంగంలో విజయం సాధించాలంటే కొన్ని విషయాల్లో రాజీ పడాల్సి ఉంటుంది. పని-జీవన సమతుల్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పోటీతత్వం దెబ్బతింటుంది. ఇక ఇంట్లో ఉండి పనిచేయడం వల్ల నేర్చుకోవడం కుంటుపడుతుంది. వర్క్‌ఫ్రమ్ హోమ్ వల్ల మార్గదర్శకత్వ లోటు ఏర్పడుతుంది. ఆవిష్కరణలపై ప్రభావం పడుతుంది" అని ఎరిక్ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. యూఎస్ సాంకేతికరంగం చైనా నుంచి సవాలు ఎదుర్కొంటోందని అన్నారు. అక్కడ చాలా సంస్థలు '996' పని సంస్కృతి అవలంబిస్తుంటాయి. దానిప్రకారం.. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది వరకు ఆరు రోజుల పాటు సిబ్బంది విధుల్లో ఉంటారు. అధిక పని గంటలకు వ్యతిరేకంగా అక్కడ చట్టాలు ఉన్నప్పటికీ.. ఇదే విధానం కొనసాగిస్తున్నారని ఆయన వెల్లడించారు. దీని ద్వారా అమెరికా వ్యాపారాలు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాయన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతి వల్లే కృత్రిమ మేధ విషయంలో కాస్త వెనకబడిందని గతంలో గూగుల్‌పై ఆయన ఘాటు విమర్శలు చేశారు కూడా. కాగా.. కరోనా సమయంలో టెక్ సంస్థలు వర్క్ ఫ్రమ్‌హోమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం కొన్ని సంస్థలు ఉద్యోగులు కార్యాలయాలకు రావాలని ఆదేశించగా.. మరికొన్ని హైబ్రిడ్ మోడల్‌లో పనిచేయించుకుంటున్నాయి. ఈ క్రమంలో ఈ అంశంపై ఇప్పటికీ చర్చ నడుస్తోంది.



# బిజినెస్



## ఆరో రోజూ అదే సీన్..

### భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఆరో రోజూ నష్టాల్లో ముగిశాయి. హెచ్-1బీ వీసా రుసుము పెంపు, విదేశీ మదుపర్ల అమ్మకాలతో స్టాక్ మార్కెట్ వరుస నష్టాల వేళ.. ట్రంప్ మరో బాంబు పేల్చారు. అమెరికాలోకి దిగుమతయ్యే బ్రాండెడ్, పేటెంట్ కలిగిన ఔషధాలపై అక్టోబర్ 1 నుంచి నూరు శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. దీనికి అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు తోడయ్యాయి. దాదాపు అన్ని రంగాల షేర్లూ నష్టపోయాయి. ముఖ్యంగా ఐటీ, హెల్త్‌కేర్, ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఓ దశలో సెన్సెక్స్ 800 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 250 పాయింట్ల మేర కోల్పోయింది. సెన్సెక్స్ ఉదయం 80,956.01 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,159.68) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 80,332.41 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 733.22 పాయింట్ల నష్టంతో 80,426.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 236 పాయింట్ల నష్టంతో 24,654.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.72గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్, ఐటీసీ, రిలయన్స్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఎటెర్నల్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అన్ని ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్లు మాత్రం లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 3749 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

#### కారణాలు ఇవీ..

- ఫార్మా దిగుమతులపై ట్రంప్ సుంకాల ప్రకటనతో ఫార్మా కంపెనీల స్టాక్స్ తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. నిఫ్టీ ఫార్మా సూచీ ఏకంగా 2 శాతానికి పైగా నష్టపోయింది.
- జపాన్, హాంకాంగ్, చైనా సహా అన్ని ఆసియా మార్కెట్‌లు నష్టపోయాయి. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలపైనా ఆ ప్రభావం పడింది.
- ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. గురువారం ఒక్కరోజే 4,9995.42 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. సెప్టెంబర్ నెలలో ఇప్పటి వరకు రూ.13,450 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు.





## 'హీరోలా ఉన్నావంటున్నారు'

### అభిషేక్ ఇన్‌స్టా పోస్టుకు లైలా రియాక్షన్ వైరల్

భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్నాడు. ఆసియా కప్‌లో దూకుడైన ఆటతీరుతో అదరగొట్టేస్తోన్న అతడు తన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేశాడు. ఇది ప్రతి క్రికెటర్ చేస్తాడనేగా? మీ డౌట్. కానీ, ఈ ఇమేజ్‌లకు వచ్చిన రియాక్షన్ ఇప్పుడీ చర్చకు కారణం. ఈ జాబితాలో భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్‌తోపాటు అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అందులోనూ అభిషేక్ రూమర్డ్ గర్ల్‌ఫ్రెండ్ లైలా ఫైసల్ కూడా ఉండటం గమనార్హం. "మిస్టర్ ఫ్రాంక్.. నా కళ్లన్నీ నీపైనే ఉన్నాయి" అని యువరాజ్ సింగ్ కామెంట్ చేయగా.. రూమర్డ్ గర్ల్‌ఫ్రెండ్ లైలా స్పందిస్తూ "హీరోలా ఉన్నావని అంటున్నారు" అని పోస్టు చేసింది. ఇప్పుడీ కామెంట్ వైరల్‌గా మారింది. ఇప్పటికే వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారంటూ సామాజిక మాధ్యమాల్లో కథనాలు వస్తున్నాయి. ఇప్పుడీ పోస్టుతో తమకు కన్‌ఫార్మ్ అయిందని అభిమానులు సరదాగా కామెంట్లు చేశారు.

#### యువీ నాకు చెప్పిన మాట అదే : అభిషేక్

టీ20ల్లో 25 అంతకంటే తక్కువ బంతుల్లో ఐదు హాఫ్ సెంచరీలను అభిషేక్ నమోదు చేసి తన గురువు యువరాజ్‌సింగ్‌ను అధిగమించాడు. తన మెంటార్ ఇచ్చిన సూచనను పాటించేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తానని అభిషేక్ (%ూఎష్ట్రఅంష్ట్రవని నాష్ఘుతీమ్ఖ%) ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. "ఓవర్‌లో ఒక సిక్స్ కొట్టినప్పుడు.. సహచర క్రికెటర్‌కూ సిక్స్ కొట్టేందుకు ఛాన్స్ ఇవ్వమని చెప్పాడు. నేను దాని మీద వర్కౌట్ చేస్తూనే ఉంటా" అని గుర్తుచేసుకున్నాడు. ఆసియా కప్‌లో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఐదు మ్యాచుల్లో 206.67 స్ట్రైక్‌రేట్‌తో 248 పరుగులు చేశాడు. ఇవాళ ఆసియా కప్ సూపర్ -4లో శ్రీలంకతో టీమ్‌ఇండియా చివరి మ్యాచ్ ఆడనుంది. సెప్టెంబర్ 28న పాకిస్థాన్‌తో ఫైనల్‌లో తలపడనుంది.



## కోహ్లీ పేరు చెప్పి.. పాక్ ఆటగాళ్లు తప్పించుకునే ప్రయత్నం

ఆసియా కప్ సూపర్-4 మ్యాచ్‌లో భారత్‌పై రెచ్చగొట్టే హావభావాలు ప్రదర్శించిన పాక్ ఆటగాళ్లపై బీసీసీఐ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఐసీసీ చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే.. టీమ్‌ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ పేరు చెప్పి పాక్ ఆటగాళ్లు ఐసీసీ శిక్ష నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ఆటగాళ్లు హారిస్ రవూఫ్, సాహిబ్‌జాదా ఫర్హాన్‌లు ఆదివారం భారత్‌తో జరిగిన ఆసియా కప్ సూపర్ 4 మ్యాచ్‌లో రెచ్చగొట్టే హావభావాలు ప్రదర్శించారు. రవూఫ్ బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తూ.. విమానాలను కూల్చామంటూ '6-0' సంకేతం చేశాడు. అయితే.. దీనిపై వివాదం తలెత్తడంతో.. ఆ సంకేతానికి ఎలాంటి అర్థం లేదని, దానిని తప్పుగా ఎలా పరిగణిస్తారని మ్యాచ్ రిఫరీతో అతడు అన్నట్లు సమాచారం. మరోవైపు ఫర్హాన్ తన 'గన్‌ఫైర్' వేడుకల గురించి స్పందిస్తూ..'నేను పఠాన్‌ని. మా దేశంలో ఇలాగే వేడుకలు చేసుకుంటాం" అని చెప్పినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా విరాట్ కోహ్లీ కూడా ఇదే తరహాలో సెలబ్రేషన్స్ చేసుకుంటాడని.. అతడి పేరును ప్రస్తావించినట్లు సమాచారం. వీరిద్దరిపై ఐసీసీ విచారణ ముగించినట్లు తెలుస్తోంది. హారిస్ రవూఫ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఫర్హాన్ ప్రవర్తనపై ఐసీసీ హెచ్చరించి వదిలేసినట్లు తెలుస్తోంది. అయితే.. వీటిపై ఐసీసీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఇక ఆసియా కప్ ముగింపు దశకు చేరుకుంది. ఫైనల్‌లో మరోసారి భారత్-పాకిస్థాన్ తలపడనున్నాయి. ఈ టోర్నీలో ముచ్చటగా మూడోసారి దాయాదిని ఓడించి టీమ్‌ఇండియా తన ఆధిపత్యాన్ని కొనసాగించాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

## ఎందుకో సెలక్టర్లనే అడగండి : కరుణ్ నాయర్



వెస్టిండీస్‌తో స్వదేశంలో రెండు టెస్టుల సిరీస్‌ను టీమ్‌ఇండియా ఆడనుంది. సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ కమిటీని ఎంపిక చేసింది. అనుకున్నట్లుగానే కరుణ్ నాయర్‌కు చుక్కెదురైంది. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత వచ్చిన ఛాన్స్‌ను సద్వినియోగం చేసుకోవడంలో విఫలం కావడం అతడికి ప్రతికూలంగా మారింది. గత ఇంగ్లాండ్ పర్యటనలో అంతగా ప్రభావం చూపించలేదు. దీంతో ఈసారి విండీస్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక చేయలేదు. తాను ఎంపిక కాకపోవడంపై కరుణ్ నాయర్ స్పందించాడు. "టెస్టులకు ఎంపిక అవుతానని భావించా. అయితే, అలా జరగలేదు. ఏం మాట్లాడాలో కూడా తెలియడం లేదు. దీనిపై ఎక్కువ కామెంట్లు చేయలేను. సమాధానం ఇవ్వడం కూడా చాలా కష్టమే. సెలక్టర్లు ఏం ఆలోచించారో వారినే అడగాలి. ఇంగ్లాండ్‌పై చివరి మ్యాచ్‌లో ఎవరూ ఆడనప్పుడు నేను హాఫ్ సెంచరీ చేశా. జట్టు కోసం కంట్రిబ్యూట్ చేశానని భావించా. ఆ మ్యాచ్‌లో మనం గెలిచాం. కానీ, అవేవీ ఇక్కడ పరిగణనలోకి తీసుకోలేదు" అని కరుణ్ వెల్లడించాడు.

## అభిషేక్ నిలబడ్డాడా.. విజయం దూరమైనట్లే..

### పాక్‌కు అక్తర్ హెచ్చరిక



మరో మ్యాచ్ మిగిలిఉండగానే ఆసియా కప్ 2025 ఫైనలిస్టులు ఎవరో తేలిపోయింది. సెప్టెంబర్ 28న భారత్ - పాకిస్థాన్ టైటిల్ కోసం తలపడతాయి. ఇప్పటికే ఈ ఎడిషన్‌లో రెండుసార్లు పాక్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించింది. హ్యాట్రిక్‌పై కన్నేసిన భారత్‌ను అడ్డుకోవడం తమ జట్టుకు చాలా కష్టమని పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ వ్యాఖ్యానించాడు. అయితే, ఒకే ఒక్క పని చేస్తేనే టీమ్‌ఇండియాపై ఒత్తిడి తెచ్చేందుకు వీలవుతుందని తెలిపాడు. పాక్ ప్లేయర్లు తమ మైండ్ సెట్‌ను త్వరగా మార్చుకోవాలని పేర్కొన్నాడు. "భారత్‌తో మ్యాచ్ అంటే ఒత్తిడికి గురయ్యే మైండ్‌సెట్ నుంచి పాక్ ఆటగాళ్లు బయటకు రావాలి. బంగ్లాపై ఎలా ఆడారో అలాగే భారత్‌ను ఎదుర్కోవాలి. మొత్తం 20 ఓవర్లూ బౌలింగ్ చేయాల్సిన అవసరం లేదు. పది వికెట్లు తీసేందుకు ప్రయత్నించాలి. ఇప్పుడు నేను చెప్పే మాటలు గుర్తు పెట్టుకోండి. అభిషేక్ శర్మను రెండు లేదా మూడు ఓవర్లలోనే ఔట్ చేస్తేనే వారిని ఇబ్బంది పెట్టొచ్చు. వారికి ఇప్పటివరకు వచ్చిన ఆరంభాలన్నీ అతడు తీసుకొచ్చినవే. అభిషేక్‌ను త్వరగా ఔట్ చేయాలి. అలా కుదరకపోతే మాత్రం మరోసారి ఇబ్బందులు తప్పవు. అభిషేక్ కూడా బంతిని మిస్ అయ్యే అవకాశాలు చాలా తక్కువ. అతడిపై కాస్త ఎదురుదాడి చేయాలి. అప్పుడే భారత్ మిగతా బ్యాటర్లు కాస్త ఆచితూచి ఆడేందుకు ప్రయత్నిస్తారు. పరుగుల కోసం కష్టపడతారు. అయితే, భారత్ తమ అత్యుత్తమ గేమ్‌ను తీసుకొస్తుందనడం లో సందేహం లేదు. అక్కడ ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ ఉన్నాడు. పాక్‌పై టాప్ క్లాస్ ఆటను ఆడాలని భారత్‌కు చెబుతాడు. చెత్త జట్టుతో దిగినా, నాసిరకంగా ఆడినా పాక్ ఫైనల్‌కు చేరుకుంది. ఇక్కడ మాత్రం దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తారని భావిస్తున్నా" అని వ్యాఖ్యానించాడు.

#### అతడు జట్టులో ఎందుకు?: వకార్

ఆసియా కప్‌లో నాలుగు మ్యాచుల్లో డకౌట్ అయిన సైయామ్ ఆయుబ్‌పై పాక్ మాజీ ఆటగాడు వకార్ యూనిస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. బౌలింగ్‌లో రాణిస్తున్నప్పటికీ.. బ్యాటింగ్‌లో విఫలం కావడంపై విమర్శలు గుప్పించాడు. "ఆసియా కప్‌లో రెండోసారి డకౌట్ అయినప్పుడే నేను ఆయుబ్‌ను బెంచ్‌కే పరిమితం చేయాలని చెప్పా. అతడి స్థాయి ఆట ఇది కాదు. చాలా టాలెంట్ కలిగిన ప్లేయర్. ఒక్కోసారి మనం అనుకున్నవి కానప్పుడు విరామం తీసుకోవాలి. మైదానంలోకి వచ్చాక అతడి బాడీ లాంగ్వేజ్ కూడా పేలవంగా ఉంది. యువకుడైన అతడికి ఇంకా చాలా కెరీర్ ఉంది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. కేవలం బౌలర్‌గానే ఆయుబ్ జట్టులో ఉన్నాడు. ఈ విషయంపై మేనేజ్‌మెంట్ దృష్టి పెట్టాలి" అని వకార్ వ్యాఖ్యానించాడు.

## ఫార్మాపై 100% టారిఫ్..

### భారత్ కంపెనీలపై ప్రభావం అంతంతే



**దిల్లీ:** ఫార్మా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 100 శాతం సుంకాల ప్రభావం భారత ఔషధ కంపెనీలపై పెద్దగా ఉండబోదని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక్కడి కంపెనీలు జనరిక్ మెడిసిన్‌ను మాత్రమే ఎగుమతి చేస్తుండడం ఇందుక్కారణమని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ అభిప్రాయపడింది. పేటెంట్, బ్రాండెడ్ ఔషధ దిగుమతులకు మాత్రమే టారిఫ్‌లు వర్తిస్తాయని పేర్కొంది. బ్రాండెడ్, పేటెంట్ కలిగిన ఔషధాలపై అక్టోబర్ 1 నుంచి నూరుశాతం టారిఫ్ విధిస్తామంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. అమెరికాలో తయారీ ప్లాంట్ నెలకొల్పిన వారికి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే పరిశ్రమ పనులు మొదలుపెట్టినవారు లేదా పనులు కొనసాగుతున్న కంపెనీలకు మినహాయింపు ఉంటుందని స్పష్టంచేశారు. ఈ ప్రకటనతో అమెరికాకు భారీగా ఔషధాలను ఎగుమతి చేసే భారత కంపెనీల పైనా ప్రభావం ఉంటుందని తొలుత వార్తలు వచ్చాయి. ఈనేపథ్యంలో డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, లుపిన్, జైడస్ లైఫ్‌సైన్సెస్ వంటి 23 ప్రధాన ఫార్మా కంపెనీలతో కూడిన ఐపీఏ దీనిపై స్పందించింది. భారత్ నుంచి ఎగుమతి అయ్యేవాటిలో 80 శాతం, దేశీయంగా 64 శాతం ఔషధ అవసరాలను ఈ సంస్థలే తీరుస్తుండడం గమనార్హం. తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాలను భారత ఫార్మా కంపెనీలు కొన్నేళ్లుగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నాయని ఫార్మాసిల్ ఛైర్మన్ నమిత్ జోషి పేర్కొన్నారు. అమెరికాకు అవసరమయ్యే 47 శాతం ఔషధ అవసరాలను భారత కంపెనీలే తీరుస్తున్నాయన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన నూరు శాతం సుంకాలు కేవలం బ్రాండెడ్, పేటెంట్ కలిగిన ఔషధ దిగుమతులకే వర్తిస్తాయని చెప్పారు. కాబట్టి ఇప్పటికిప్పుడు భారత ఎగుమతులపై ప్రభావం ఉండబోదన్నారు. అమెరికాకు ఇక్కడి నుంచి ఎగుమతయ్యేవి జనరిక్ ఔషధాలేనని పేర్కొన్నారు. ఇప్పటికే భారత కంపెనీలు అమెరికాలో తయారీ యూనిట్లు, రీప్యాకింగ్ యూనిట్లు నెలకొల్పాయని జోషి గుర్తుచేశారు. అయితే, ప్రతికూల పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు సిద్ధం చేసుకోవాలన్నారు. విధాన నిర్ణయాల్లో ఏవైనా మార్పులు జరిగితే ఆ తీవ్రత తగ్గించుకునేందుకు సన్నద్ధత అవసరం అని అభిప్రాయపడ్డారు. మరోవైపు భారత్ నుంచి దిగుమతయ్యే ఔషధాల వల్ల అమెరికా వైద్యారోగ్యరంగానికి పెద్ద మొత్తంలో భారం తగ్గుతోంది. ఒక్క 2022లోనే 219 బిలియన్ డాలర్ల మేర ఆదా చేసినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2013 నుంచి 2022 వరకు చూస్తే ఈ మొత్తం 1.3 ట్రిలియన్ డాలర్ల మేర ఉంటుందని పేర్కొంటున్నాయి.





## రేపు దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభం

**న్యూఢిల్లీ :** ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ సేవలు దేశవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి. శనివారం (సెప్టెంబర్ 27న) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా ఈ సేవలు ప్రారంభం కానున్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుండడం విశేషం. ఇది క్లౌడ్ ఆధారిత నెట్‌వర్క్ అని, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు 5జీకి సులువుగా అప్‌గ్రేడ్ అవ్వొచ్చని టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. సెప్టెంబర్ 27న బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను దేశవ్యాప్తంగా సుమారు 98 వేల సైట్లలో అందుబాటులోకి తేనున్నట్లు మంత్రి వివరించారు. పలు రాష్ట్రాల్లో ఒకేసారి ప్రారంభోత్సవం జరగనుందని చెప్పారు. ప్రధాని మోదీ ఒడిశాలోని జార్సుగుడా నుంచి ఈ నెట్‌వర్క్‌ను ఆవిష్కరించనున్నారని తెలిపారు. గువాహటిలో జరిగే కార్యక్రమంలో మంత్రి సింధియా పాల్గొననున్నా రు. "భారత్ ఇప్పుడు టెలికాం పరికరాల ఉత్పత్తి, తయారీలో అగ్రదేశాల సరసన చేరింది. ఇప్పటివరకు డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా మాత్రమే ఈ రంగంలో ఉండగా.. భారత్ ఐదో దేశంగా నిలిచింది" అని సింధియా పేర్కొన్నా రు. అలాగే, డిజిటల్ భారత్ నిధి కార్యక్రమంలో భాగంగా 100 శాతం 4%+% సాచురేషన్ ప్రాజెక్టును కూడా ప్రధాని మోదీ ప్రారం భించనున్నారు. ఈ ప్రాజెక్ట్ కింద 29,000- 30,000 గ్రామాల్లో టెలికాం సేవలు అందుబా టులోకి రానున్నాయని మంత్రి వెల్లడించారు.

## ప్రైమ్ మెంబర్‌షిప్ వివాదం..

### 2.5 బిలియన్ డాలర్లతో అమెజాన్ సెటిల్‌మెంట్





ప్రైమ్ మెంబర్‌షిప్ వివాదం తలెత్తడంతో దాదాపు 2.5 బిలియన్ డాలర్ల(రూ.22 వేల కోట్ల)తో ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ సెటిల్‌మెంట్ చేసుకుంది. ప్రైమ్ మెంబర్‌షిప్ తీసుకున్న తర్వాత మళ్లీ దాన్ని క్యాన్సిల్ చేసుకునేందుకు కస్టమర్లు ఇబ్బంది పడుతున్నారంటూ అమెజాన్‌పై అనేక ఫిర్యాదులు నమోదయ్యాయి. తాజాగా దీనిపై దర్యాప్తు జరిపిన ఫెడరల్ ట్రేడ్ కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించింది. దీంతో ఈ వివాదం పరిష్కారం కోసం 2.5 బిలియన్ డాలర్లు చెల్లించేందుకు అమెజాన్ సిద్ధమయ్యింది. అనుకోకుండా ప్రైమ్‌లో చేరి.. తమ మెంబర్‌షిప్‌ను క్యాన్సల్ చేసుకోవడానికి ఇబ్బందిపడిన వినియోగదారులకు ఇందులోని 1 బిలియన్ డాలర్లను జరిమానా రూపంలో చెల్లించనున్నట్లు తెలిపింది. సెటిల్‌మెంట్ ఆర్డర్ వచ్చిన 90 రోజుల్లోపు ఈ డబ్బు కస్టమర్‌లకు తిరిగి చెల్లించే అవకాశముంది. అమెజాన్ ప్రైమ్ మెంబర్‌షిప్‌పై ఫిర్యాదుల విషయంలో రెండేళ్లుగా విచారణ కొనసాగుతోందని బ్యూరో ఆఫ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ డైరెక్టర్ క్రిస్ ముఫారిజ్ తెలిపారు. కస్టమర్లు ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోకుండా వస్తువులు కొనుగోలు చేయడాన్ని అమెజాన్ ఉద్దేశపూర్వకంగానే కష్టతరం చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. దీనిపై అనేకసార్లు అప్పీళ్లకు వెళ్లడానికి బదులు ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో అమెజాన్ ఈ నిర్ణయం తీసుకొని ఉంటుందన్నారు. సెటిల్‌మెంట్‌లో భాగంగా అమెజాన్ తమ సేవలకు సంబంధించిన అన్ని విషయాలను వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అయితే తాము అన్ని విషయాల్లో చట్టపరంగానే ముందుకువెళ్తామని.. ఈ విషయంలో తమ తప్పేమీ లేదని అమెజాన్ ప్రతినిధి మార్క్ బ్లాఫ్కిన్ పేర్కొన్నారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకొని ఇతర సేవలపై దృష్టిపెట్టడానికే 2.5 బిలియన్ డాలర్లను చెల్లించడానికి అంగీకరించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కస్టమర్లు ప్రైమ్ మెంబర్‌షిప్‌ను పొందేందుకు, దానిని రద్దు చేసుకోవడాన్ని మరింత సరళంగా చేయడానికి తమ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.



# ఓజి తొలిరోజు 154 కోట్ల కలెక్షన్

సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ఓజీ విడుదలైంది. ఫ్యాన్స్ ఆశించినట్టే హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఫస్ట్ డే కలెక్షన్స్ ఎంత వసూలు చేసిందన్న ప్రశ్నకు చిత్ర బృందం తాజాగా సమాధానమిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు రూ. 154కోట్లకుపైగా వసూలు చేసిందని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఈ మేరకు పవర్‌ఫుల్ పోస్టర్ పంచుకుంటూ ఇది పవన్ కల్యాణ్ సినిమా. చరిత్రను ఓజీ చెరిపేసింది అని క్యాప్షన్ పెట్టింది.




ఆర్గాన్ న్యూస్
12
తెలంగాణ
శనివారం
27 సెప్టెంబర్ 2025
సినిమా

## క్రైమ్ థ్రిల్లర్‌తో రాబోతున్న శ్రద్ధా శ్రీనాథ్

శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ వెబ్ సిరీస్ 'ది గేమ్: యూ నెవర్ ప్లే అలోన్'. క్రైమ్ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ సిరీస్‌ను రాజేష్ ఎం.సెల్వా దర్శకత్వం వహిస్తున్నాడు. నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్స్ కలిసి నిర్మిస్తున్న ఈ సిరీస్ అక్టోబర్ 2 నుంచి ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. ఇక రిలీజ్ సమయం దగ్గర పడుతున్న క్రమంలో 'ది గేమ్' వెబ్ సిరీస్ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ విషయానికి వస్తే.. శ్రద్ధా శ్రీనాథ్ ఇందులో గేమ్ డెవలపర్‌గా నటిస్తుంది. అనుకోకుండా ఆమెపై అటాక్ జరుగుతుంది. అయితే ఆ అటాక్ చేసిన వాళ్లనూ, వాళ్ల వెనకున్న వాళ్లనూ ట్రాప్ చేసే ఆమె ప్రయాణమే ఈ సిరీస్. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో, స్ట్రాంగ్ స్టోరీ టెల్లింగ్‌తో ఆడియన్స్‌కి విభిన్నమైన అనుభూతిని అందించేలా సిరీస్ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. నిజం, అబద్ధం మధ్య సన్నని గీత గురించి చెప్పే కథ ఇదని దర్శకుడు రాజేష్ ఎం.సెల్వా అన్నారు. ప్రజెంట్ ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ నెట్టింట విశేషంగా ఆకట్టుకుంటుంది.



## ఓజి విజయం ..సుజిత్ త్యాగాలకు నిదర్శనం

ఓజీ సినిమా విజయం ఆ దర్శకుడు చేసిన త్యాగాలకు నిదర్శనమని నటి శ్రియా రెడ్డి అన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ మూవీలో గీతగా శ్రియారెడ్డి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. తాజాగా ఆమె సుజీత్‌పై ప్రశంసలు కురిపిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. సుజీత్ రాసిన పాత్ర తెరపై మరోసారి అద్భుతం సృష్టించింది. ఓజీలాంటి సినిమాను అంగీకరించడానికి అంత పెద్ద ప్రాజెక్ట్‌లో గుర్తింపు తెచ్చుకోవడానికి ఆత్మవిశ్వాసం ఉన్న దర్శకుడు అవసరం. సుజీత్ అలాంటి దర్శకుడే. ఈ పాత్రకు నన్ను ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు. ఉన్నతంగా ఆలోచించినప్పుడు ఇలాంటి అద్భుతాలు జరుగుతాయి. నేను చూసిన గొప్ప వ్యక్తుల్లో మీరూ ఒకరు. ఈ విజయానికి పూర్తి అర్హులు. మీ కృషి, విశ్వాసం, మీరు చేసిన త్యాగాలు అన్నీ ఈ విజయానికి నిదర్శనం అంటూ పోస్ట్‌లో రాసుకొచ్చారు. గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన ఓజీని ఇప్పటికే సినీ ప్రముఖులు వీక్షించి రివ్యూలు ఇచ్చారు. తాజాగా ఈ చిత్రాన్ని చూడడం కోసమే హైదరాబాద్ వచ్చినట్లు కోలీవుడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ తెలిపారు. ఈ మాస్ చిత్రాన్ని తెలుగు ఆడియన్స్‌తో కలిసి చూస్తేనే కదా అసలైన ఆనందం అని తాను

## ఓటిటిలోకి మళయాళ హిట్ మూవీ హృదయపూర్వం




విలక్షణ పాత్రలతో మెప్పించే మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటించిన తాజా చిత్రం హృదయపూర్వం. బాక్సాఫీస్ వద్ద రూ. 100 కోట్లు వసూలుచేసిన ఈ మూవీ ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న సందీప్ బాలకృష్ణన్ (మోహన్‌లాల్)కు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఆర్మీ కర్నల్ రవిచంద్రన్ గుండెను వైద్యులు అమ-రుస్తారు. అతడి ఆరోగ్యం కుదుటపడేవరకూ సహాయం చేయడానికి తోడుగా జెర్రీ (సంగీత్ ప్రతాప్)ను ఆస్పత్రి నియమిస్తుంది. సందీప్ తాను నడుపుతున్న క్లౌడ్ కిచెన్ వ్యవహారాలు చూసుకుంటూ ఉండగా, కర్నల్ రవిచంద్రన్ కుమార్తె హరిత (మాళవిక మోహనన్) అతడి దగ్గరకు వస్తుంది. తనకు నిశ్చితార్థం కుదిరిందని, ఆ వేడుకకు రావాలని కోరుతుంది. తొలుత రానని చెప్పినా, ఆ తర్వాత జెర్రీతో కలిసి సందీప్ పుణె వెళ్తాడు. మరి అక్కడికి వెళ్లాక అతడికి ఎదురైన పరిస్థితులు ఏంటి? హరిత నిశ్చితార్థం ఆగిపోవడానికి కారణం ఎవరు? కర్నల్ రవి భార్య, కుమార్తె హరిత.. సందీప్‌పై చూపిన ప్రేమ, ఆప్యాయత ఎలాంటి పరిస్థితులకు దారితీసింది? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి మరణించిన వేరొకరి అవయవాలను అమర్చడం ఒకరకంగా ఇద్దరికీ పునర్జన్మ ఇచ్చినట్లే. ఈ నేపథ్యంతో ఇప్పటికే ఎన్నో కథలు వచ్చాయి. హృదయపూర్వం కూడా ఈతరహా నేపథ్యమే అయినా, దర్శకుడు సత్యన్ అంతికాడ్ దీనిని ఒక అందమైన ప్రయాణంలా తీర్చిదిద్ది ప్రేక్షకులను మెప్పించారు. అందుకే మలయాళంలో బాక్సాఫీస్ వద్ద డీసెంట్ హిట్ అందుకుంది. కర్నల్ రవిచంద్రన్ గుండెను సందీప్‌కు అమర్చడంతోనే నేరుగా కథను ప్రారంభించాడు దర్శకుడు. ఆ తర్వాత నెమ్మదిగా సందీప్ నేపథ్యం, అతడి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆవిష్కరించాడు. సందీప్, జెర్రీలు పుణె వెళ్లిన తర్వాత కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. అనుకోకుండా హరిత నిశ్చితార్థం ఆగిపోవడం, సందీప్ రెండు వారాల పాటు పుణెలో ఉండాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి కథ రొమాంటిక్ టర్న్ తీసుకుంటుంది. హరిత ఇంటికి సందీప్ వెళ్లిన దగ్గరి నుంచి వారి మధ్య వచ్చే సన్నివేశాలు సరదాగా సాగిపోతూ చక్కటి వినోదాన్ని పంచుతాయి. అటు తల్లి, ఇటు కుమార్తె సందీప్‌పై చూపే చొరవ, దానిని అతడు అర్థం చేసుకొనే తీరు, మధ్యలో జెర్రీ చేసే హంగామా అలరిస్తుంది. సందీప్‌ను వెతక్కుంటూ అతడి బావ పణికర్ పుణెకు వచ్చిన తర్వాత వినోదం పాళ్లు మరింత పెరుగుతాయి. ఒక బలమైన ఎమోషనల్ నోట్‌తో సినిమాను ముగించిన తీరు బాగుంది. సందీప్ బాలకృష్ణన్ వంటి పాత్రలు చేయడం మోహన్‌లాల్‌కు వెన్నతో పెట్టిన విద్య. అయితే, ఆ పాత్రకు ఎంత చేయాలో అంతే చేశారు. ఆయన చేసే ఒక్క ఫైట్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది.

## ఓటిటిలోకి వస్తున్న మదరాసి

అమరన్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత మదరాసి అంటూ వచ్చి సూపర్ హిట్‌ను అందుకున్నాడు తమిళ నటుడు శివ కార్తికేయన్. మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించడమే కాకుండా రూ. 80 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం అక్టోబర్ 1నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.



## నవీన్ పోలిశెట్టి.. అనగనగా ఒకరాజు

నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో దర్శకుడు మారి తెరకెక్కిస్తున్న చిత్రం అనగనగా ఒక రాజు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానుంది. తాజాగా ఓ స్పెషల్ ప్రోమోను టీమ్ షేర్ చేసింది. నటీనటులిద్దరూ జ్యువెలరీ యాడ్‌లో నటిస్తున్నట్లుగా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దీన్ని సంక్రాంతి ప్రోమో పేరుతో టీమ్ షేర్ చేసింది. తనదైన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి, మరో ఫ్యామిలీ చిత్రం అనగనగా ఒక రాజుతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ఈ సంక్రాంతికి ప్రేక్షకులను నవ్వుల కనుక అందివ్వబోతున్నట్టు అర్థం అవుతోంది. బంగారు ఆభరణాల ప్రకటనపై స్పూఫ్ తో ప్రారంభమైన ఈ టీజర్, ఎంతో వైవిధ్యంగా ఉంది. ఒంటి నిండా ఆభరణాలు ధరించిన మీనాక్షి చౌదరి, తమ సినిమా గురించి కాకుండా ఆభరణాల గురించి మాట్లాడుతుండటంతో ఆమె ఆభరణాలను నవీన్ పొలిశెట్టి ధరించి కనిపించడం భలే సరదాగా ఉంది. టీజర్ లో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పోటాపోటీగా నవ్వులు పంచారు. వినోదాల వేడుకకు వేదికగా ఈ టీజర్ నిలిచింది. ఇప్పటికే విడుదైన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజా టీజర్ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ.. సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నవీన్ యొక్క అద్భుతమైన కామెడీ టైమింగ్ ప్రతి ఫ్రేమ్ లో ప్రకాశించింది. తెరపై నవీన్ ఉత్సాహంగా కనిపించిన తీరు సంక్రాంతి పండుగకు ప్రేక్షకులు కోరుకునే అసలైన వినోదాల విందుకి వాగ్దానంలా ఈ టీజర్ నిలిచింది. కేవలం ఒక నిమిషం కంటే ఎక్కువ నిడివితో రూపొందిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అంతేకాకుండా హాస్యం, తాజాదనం మరియు కమర్షియల్ పంచ్‌లను మిళితం చేసే చిత్రాలను ఎంచుకోవడంలో నవీన్ పొలిశెట్టి నైపుణ్యాన్ని పునరుద్ఘాటించింది. టీజర్ చూసిన ప్రతి ఒక్కరూ నవీన్ ఖాతాలో మరో ఘన విజయం ఖాయమని ప్రశంసలు కురిపిస్తున్నారు. సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న అనగనగ ఒక రాజుపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.

## వెంకీ సినిమా కోసం త్రివిక్రమ్ కొత్త టీమ్

సంక్రాంతికి వస్తున్నాం చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న నటుడు విక్టరీ వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా పూజ కార్యక్రామాలు పూర్తి చేసుకున్న చిత్రయూనిట్ అక్టోబర్‌లో రెగ్యూలర్ షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. వెంకీ 77 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఒక విషయం వైరల్‌గా మారింది. ఈ సినిమా కోసం త్రివిక్రమ్ తన టీమ్ మొత్తాన్ని మార్చినట్లు తెలుస్తుంది. కొత్తవారిని ఈ సినిమా కోసం తీసుకున్నట్లు ఫిల్మ్ నగర్‌లో టాక్ నడుస్తుంది. అయితే ఇది ఎంతవరకు నిజం అనేది తెలియాల్సి ఉంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అవ్వడంతో అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers - ID : PRESS/2025/125/00007278, Address : Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam - 507002.Telangana. EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in